
: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
ఖమ్మం
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nalgonda, Nellore, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

29-7-2026
బుధవారం
సంపుటి: 32
సంచిక: 179
పేజీలు: 8+16
వెల: 6.50

కామన్‌వెల్త్ గేమ్స్: షాట్‌పుట్‌లో **షర్మిలకు స్వర్ణం** శిల్పకు కాంస్యం

-'ఆట'లో




# 'పరీక్షల' దోషులకు పదేళ్లు జైలు



## జరిమానా పదికోట్లకు పెంపు

### సవరణ బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

### ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టిన గౌరవ్‌గగోయ్, ప్రియాంక గాంధీ

**న్యూఢిల్లీ,జులై 28:** పేపర్ లీకేజీలకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వ పరీక్షల్లో అక్ర మాల కట్టడి సవరణ బిల్లు2026 బిల్లు తీసుకొచ్చామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చను ప్రారంభించిన సింగ్ మాట్లాడుతూ దోషులకు జైలు శిక్షను 10 ఏళ్లకు పెంచామని, లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.1 కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచామని చెప్పారు. ఈ కేసుల విచారణకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదిత బిల్లు చట్టమైతే సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. పరీక్ష పేపర్ లీకేజీలు అరికట్టేందుకు నందన్ నిలేకని ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంతకు ముందు యుపిఎ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఎంట్రన్స్ పరీక్షలు, ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని జితేంద్ర సింగ్ గుర్తుచేశారు. 2009, 2011లో ఎన్నో పేపర్ లీక్స్, 2010లో యూపీలో బిఇడి పేపర్ లీక్, 2012లో ఎయిమ్స్ ఎంట్రన్స్ పేపర్‌లీక్, తమిళనాడులో పిఎస్సీ పేపర్‌లీక్‌లు జరిగాయి. క్రమంగా ఇవి వ్యవస్థీకృత నేరాలుగా మారాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లో కొన్ని >>2

# ప్రభుత్వ విచక్షణ మేరకే 'హైడ్రా'



- హైకోర్టు ఆదేశాలు పరిశీలించి సమీక్షిస్తాం
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే హైడ్రా ఏర్పాటు చేశాం
- కబ్జాకోరులే దాని రద్దు కోరుతున్నారు
- చర్యలు లేనందువల్లే సిబిఎస్ఇకి విస్తరించిన గ్లోబరీనా అక్రమాలు
- కెసిఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 8 వేల కోట్లు
- ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై28:** చెరువులు,నాలాలు,కుంటలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పార్క్‌లను కబ్జాలు పెట్టుకున్నోళ్లు కోర్టులను తప్పుదోవ పట్టించి కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిం చారు. కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద అధికారులను మార్చాలనే నిబంధనఉంటే, గతంలో సోమేశ్ కుమార్ మీద 400 కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులు న్నాయని, అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వం విచక్షణాధికారమని, దానిని ఎవరూ గుంజుకోలేరని సిఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో పర్యటిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సిఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తప్పించాలన్న హైకోర్టు ఆదేశాలపై స్పందించిన సిఎం అధికారులు నియామకం అనేది ప్రభుత్వ విచక్షణాధికారమని స్పష్టంచేశారు. న్యాయ స్థానాల మీద తనకు సంపూర్ణమైన విశ్వాసం ఉందని సిఎం తెలిపారు. హైడ్రా మంచి పనులు చేస్తోందని, తమ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రేటెస్ట్ రిఫార్మ్ హైడ్రా అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైడ్రా అత్యుత్తమ సంస్థల్లో ఒకటని, ప్రభుత్వ పార్కులు, చెరువులు, కుంటలు, నాలాలను కాపా డటమే హైడ్రా విధి అని, ఆ పనిని హైడ్రా పకడ్బం దీగా చేస్తోందని సిఎం తెలిపారు.

బతుకమ్మ కుంటలాంటి దానిని బిఆర్‌ఎస్‌వాళ్లు కబ్జా పెట్టుకున్నారని, దానినిపై కూడా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసు వేశారని సిఎం విమర్శించారు. ఆ కుంట పేరే బతుకమ్మ కుంట అని, దానిపై కేసు నడుస్తోందని, వాటిని ఏవిధంగా చూడాలని సిఎం ప్రశ్నించారు. హైడ్రాని పనిచేయకుండా అడ్డుకో వాలనే కబ్జాకోరులకు సహకరించవద్దని మీడియాకు సిఎం విజ్ఞప్తి చేశారు. హైడ్రా ఎన్ కన్వెన్షన్ కూలగొ ట్టింది.. అది పేదోళ్లదా?గండిపేటచెరువులో ఆక్రమ ణలు కూలగొట్టింది... అవి పేదోళ్లవా? బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్నోళ్లు పేదోళ్లా? అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కబ్జాదారులను కాపాడ టానికి డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హైడ్రా కార్యాచరణపైనా, హైడ్రా నిర్వహిస్తున్న బాధ్యతలపైనా ప్రభుత్వానికి స్పష్టత ఉందని సిఎం తెలిపారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఇంకా పరిశీలించలేదని, ప్రభుత్వపరంగా >>2

# కాజీపేట రైల్వే డివిజన్ ఇవ్వండి

### మనోహరాబాద్-సిరిసిల్ల-కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టు వేగవంతం: రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై28:** కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను మంగళవారం ఢిల్లీలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు, పార్టీ సీనియర్ నేత జాన్సన్ నాయక్ తదిత రులు కలిశారు. తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో కెటిఆర్ మాట్లాడుతూ... తమకు రాజకీ యాల కంటే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్య మని, అందుకే రాష్ట్ర ప్రజల తరఫున రైల్వే, ఐటీ రంగాలకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశా లను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాజీపేటను కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ప్రధానంగా విజ్ఞప్తి చేసినట్లు తెలి పారు. ప్రస్తుతం సౌత్‌సెంట్రల్ రైల్వే పునర్వి >>2



# వర్షాలు విస్తృతం

### మెదక్‌లో అత్యధికంగా 84.5 మి.మీ. నమోదు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త :** బంగాళా ఖాతంలో బలపడిన తీవ్ర వాయుగుండంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర, పశ్చిమ, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, కరీం నగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్త గూడెం, మహబూబాబాద్ జిల్లాలను వర్షాలు ముంచెత్తాయి. ఈ జిల్లాలోని >>2

# పోలీసుల అదుపులో ట్రైనీ ఐపిఎస్ కృష్ణారెడ్డి

### ట్రైనీ అధికారిణిపై దాడిచేసినట్లు ఆధారాలు లభ్యం?



**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిని లైంగికంగా వేధించడంతో పాటు ఆమె ప్రైవేటు వీడియోలు. ఫోటోలను భర్తకు పంపిన కేసులో నిందితుడుగా వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని మంగళవారం నాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లైంగిక వేధింపుల ఘటనపై జులై 18వ తేదీన ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో బిఎన్‌ఎస్ 74,75,77, 315(2) సెక్షన్లతో పాటు ఐటి చట్టంలోని 66 సెక్షన్‌కింద కేసునమోదవడం తెలిసిందే. అదేరోజున ఉదయ్ కృష్ణారెడ్డిని >>2



Creative Visualisation. Images used are for illustration purposes only. | Applicable T&C available at the dealership. | **As certified by Kantar IMRB for an OEM platform for end-to-end usage as on November 28, 2025. | #543 km range: Certified range; actual results may vary by driving conditions and usage. | Assured buyback plan is available on payment basis with the option of 3 years/45 000 km or 4 years/60 000 km ownership plans (whichever is earlier). The program is offered through an insurance company. e VITARA comes with standard warranty of 3 years/1 00 000 km (whichever is earlier) with an option of extending the same on payment basis to 5 years/1 40 000 km and service activated coverage for 6th to 8th year for EV related components.


మంగళవారం ఢిల్లీలో కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లా మారిన రోడ్లు

# వర్షాలు విస్తృతం

>> చెరువులు, వాగులు పొంగిపొర్లాయి. భారీ వర్షానికి మెదక్ జిల్లాలోని పాపన్నపేటలో అత్యధికంగా 84.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సొసైటీ (టీజీడీపీఎస్) వెల్లడించింది. చేగుంటలో 83.5, ములుగు జిల్లా వెంకటాపురంలో 74.8, భూపాలపల్లి జిల్లా పలిమేలలో 68.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ ప్రకటించింది.

**రాష్ట్రంలో 3వ తేదీ వరకూ భారీ వర్షాలు**

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ వాయుగుండం బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది గంటకు సుమారు 3 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా ప్రయాణిస్తోంది. ప్రస్తుతం ఇది పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీర ప్రాంతాలకు ఆనుకుని ఉన్న హల్దియా, బాలాసోర్ మధ్య కేంద్రీకృతమై ఉంది. కొద్ది గంటల్లో హల్దియా సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు. దీని కారణంగా కోస్తా ప్రాంతాల్లోని ఓడరేవుల్లో మూడో నంబరు, ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికలను కూడా జారీ చేశారు. వాతావరణ శాఖ ఇచ్చిన అప్‌డేట్ ప్రకారం ఆగస్టు 3 వరకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ హెచ్చరిక నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో వర్షాలు, ఈదురుగాలులు, పిడుగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీసర్వే కీలకం

## ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి

## అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై28:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీసర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీసర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు.

# బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఎంపీగా తెలంగాణ బిడ్డ

## ఉదయ్ నాగరాజును సన్మానించిన కిషన్‌రెడ్డి, కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై28:** తెలంగాణకు చెందిన ప్రముఖ ప్రవాస భారతీయుడు, తొలిసారిగా బ్రిటన్‌లో యూకే పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యులుగా ఎంపికైన తెలుగు బిడ్డ ఉదయ్ నాగరాజును భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు పార్లమెంటరీ బోర్డు సభ్యుడు రాజ్యసభ సభ్యుడె డాక్టర్ కె లక్ష్మణ్ మంగళవారం ఢిల్లీలోని ఇండియా హాబిటెట్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. భారతీయ సంతతికి తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి పార్లమెంటు సభ్యులుగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. మరెన్నో ఉన్నత పదవులను వారు అధిష్టించాలని అక్కడి ప్రజలకు సేవ చేస్తూ భారతదేశానికి కూడా వారి సేవలను ఉపయోగించాలని కోరారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధి కోసం వారు కృషి చేస్తారని అభిలాషించారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శాసనసభ్యులు పాయల్ శంకర్, పైడి రాకేష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్ వి సుభాష్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ ముస్తాఫిర్, బిజెపి మీడియా ప్యానలిస్ట్ తిరుపతి రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు. న్యూ ఢిల్లీలోని ఒక ప్రత్యేక అభినందన సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరై ఉదయ్ నాగరాజును శాలువాతో సత్కరించి,కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ మాస్టర్ పీస్ అందజేసి శుభా కాంక్షలు తెలిపారు.

# తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

## స్థానిక అవసరాలకు తగినట్లు జీ రామ్ జీలో పనులు చేర్చండి

## కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి


మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయిన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై28:** తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజనగ్రామీణ్ (పిఎంఎవై) కింద 11,56,915 ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్య మిస్తున్నట్లు కేంద్ర మంత్రికి సిఎం తెలిపారు.

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కృషి భవన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం పిఎంఎవైను వినియోగించు కోక పోవడంతో రాష్ట్రంలో గత పదేళ్ల పేదలు సొంత ఇళ్ల నిర్మించుకోకపోవడంతో, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొం దని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. కేంద్ర గ్రామీణా భివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు సిఎం తెలిపారు.

సాధ్యమైనంత త్వరగా తెలంగాణకు ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఎల్‌నినో నేపథ్యంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)లో (వీబీ జీ రామ్ జీ) అదనపు పనులు చేర్చాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పనులు లేనందున ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు జీవనోపా ధులు మెరుగుపర్చేందుకు, పంటల వైవిధ్యీకరణ ప్రోత్సాహా నికి అదనపు పనులను చట్టంలో చేర్చాలని సిఎం కోరారు. రైతులు తమ భూముల్లో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీతోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇళ్ల సమీపంలో ఆకు కూరలు, కూరగాయల తోటలు, వెదురు వనాలు పెంచుకునే పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలని కేంద్ర మంత్రి చౌహాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొండ ప్రాంతాలతో పాటు కొండ వాలుల్లో నీటి నిల్వ చేసుకునే కందకాలు, ఇప్పటికే ఉన్న ప్లాంటేషన్లు, పండ్ల తోటల్లో తేమ రక్షణకు కందకాల నిర్మాణం, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులు వీబీ జీ రామ్ జీలో చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో 90 రోజుల వరకు పనులు చేసే అవకాశం ఉండేదని సిఎం తెలిపారు. వీబీ జీ రామ్ జీ లోనూ అందుకు అనుమతి ఇప్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. స్థానిక అవసరాలకు తగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే ఇతర పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి వెంట ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ ఉన్నారు.

# కాజీపేట రైల్వే డివిజన్ ఇవ్వండి

>> భజన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ప్రతిపాదిత కాజీపేట డివిజన్‌లో కాజీపేట-బల్లార్షా, పెద్దపల్లి-నిజామాబాద్, కాజీపేట-ఎర్రుపాలెం, డోర్నకల్-మణుగూరు, మోతమర్రి-విష్ణుపురం, కాజీపేట-వంగపల్లి రైల్వే సెక్షన్లను చేర్చాలని సూచించినట్లు చెప్పారు. ఈ డివిజన్ పరిధి సుమారు 2,000 ట్రాక్ కిలోమీటర్ల వరకు ఉంటుందని వివరించారు.రైల్వే ఉద్యోగులు కూడా కాజీపేట డివిజన్ ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. కేవలం 900 కిలోమీటర్లతో గుంటూరు డివిజన్, సుమారు 2,200 కిలోమీటర్లతో విజయవాడ, గుంతకల్ డివిజన్లు కొనసాగుతున్న నేపథ్యంలో కాజీపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేయడం పరిపాలనా పరంగా, అభివృద్ధి పరంగా ఎంతో ప్రయోజనకరమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. మనోహరాబాద్-సిద్దిపేట-సిరిసిల్ల-వేములవాడ-కొత్తపల్లి రైల్వేలైన్‌ను మిషన్‌మోడ్‌లో పూర్తి చేయాలి,సిరిసిల్ల నియోజ కవర్గానికి అత్యంత కీలకమైన 151 కిలోమీటర్ల మనోహరాబాద్-సిద్దిపేట- సిరిసిల్ల-వేములవాడ-కొత్తపల్లి న్యూ బ్రాడ్ గేజ్ రైల్వే ప్రాజెక్టును అత్యవసరంగా పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేట-సిరిసిల్ల-వేములవాడ-కొత్తపల్లి మధ్య మిగిలిన 75 కిలోమీటర్ల పనులు పూర్తిగా మందగించాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను నిర్వర్తించకపోవడమే ఇందుకు కారణమన్నారు.

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయాల్సిన సుమారు రూ.416 కోట్లతో పాటు మరో రూ.511 కోట్ల నిధులు విడుదల చేయకపోవడం, ఇంకా 96 హెక్టార్ల భూసేకరణ పూర్తి చేయకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని, ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో రాజ్యసభకు అధికారికంగా తెలిపిందని అన్నారు.ప్రాజెక్టు ఆలస్యం కారణంగా మొదట రూ.1,160 కోట్లుగా ఉన్న అంచనా వ్యయం ప్రస్తుతం రూ.2,780 కోట్లకు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్ల టెక్స్‌టైల్ పరిశ్రమకు, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఈ రైల్వే లైన్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు దర్శనానికి వస్తున్న నేపథ్యంలో ఈ రైల్వే లైన్ పూర్తయితే తెలంగాణకు భారీ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకంలో చేర్చి ఆధునికీకరించాలని, మిడ్ మానేరు రిజర్వాయర్‌పై రైల్వే కమ్ రోడ్ బ్రిడ్జికి ఆమోదం తెలపాలని, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ మొత్తాన్ని విద్యుదీకరించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.

అదేవిధంగా సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులతో కలిసి ప్రత్యేక హైలెవల్ కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టును నిరంతరం సమీక్షించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించి కేంద్రం ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.రైల్వే అంశాలతో పాటు తెలంగాణ టియర్2 ఐటీ నగరాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు కెటిఆర్ తెలిపారు. గత రెండేళ్లలో జిల్లాల ఐటీ విస్తరణ మందగించడం, ఆక్యుపెన్సీ తగ్గడం, కొన్ని సంస్థలు కార్యకలాపాలను తగ్గించుకోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ టియర్2 ఐటీ ఎకోసిస్టమ్ పునరుద్ధరణకు కేంద్ర సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. వరంగల్‌లో ఇండియా ఏఐ సెంటర్ లేదా ఇండియా ఏఐ డేటాల్యాబ్ ఏర్పాటు చేయాలని, కరీంనగర్ లేదా ఖమ్మంలో ఏఐ, సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్ డిజైన్, డీప్ టెక్‌రంగాలపై దృష్టిసారించే ఎస్‌టిపిఐసెంటర్ ఆఫ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. అదనంగా మరో టియర్2 నగరంలో ఎస్‌టిపిఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇప్పటికే జిల్లాల్లో నిర్మించిన ఐటీ టవర్లను వినియోగిస్తూ కేంద్ర ప్రభుత్వ ఏఐ డిజిటల్ ఇన్నోవేషన్ తదితర సాంకేతిక కార్యక్రమాలను తెలంగాణ జిల్లాలకు విస్తరించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. తెలంగాణవద్ద ఇప్పటికే అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానాలు సిద్ధంగా ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే తెలంగాణ టియర్2 నగరాలు మరోసారి ఉపాధి, ఆవిష్కరణల కేంద్రాలుగా ఎదగడమే కాకుండా దేశవ్యాప్తంగా సమతుల్య డిజిటల్ అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తాయని కెటిఆర్ పేర్కొన్నారు.

# 'పరీక్షల' దోషులకు పదేళ్లు జైలు

>> ప్రయత్నాలు జరిగాయని, కానీ అవి ఎందుకు ఫలించలేదో ఆనాటి పాలకులే చెప్పాలని జితేంద్ర సింగ్ అన్నారు. ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లు అనేది విద్యార్థులు, యువత పట్ల మోడీ సర్కార్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇది భారత పార్లమెంట్ చరిత్రలోనే నిలిచిపోతుందని అన్నారు. ఉమ్మడి పరీక్ష విధానాన్ని ఏర్పాటు చేయడానికి గతంలో జరిగిన ప్రయత్నాలను కూడా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. కాంగ్రెస్ సభా పక్షం ఉపనేత గౌరవ్‌గగోయ్ మాట్లాడుతూ లీకేజీ కేసుల విచారణలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి ప్రదర్శించిందని, అనేక లీకేజీ కేసుల్లోని నిందితులకు ప్రభుత్వం బెయిలిచ్చిందని వ్యాఖ్యానించారు. నీట్ లీకేజీతో 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రధాని కనీసం స్పందించలేదని, ఇప్పుడు టాస్క్‌ఫోర్స్ వేశామంటూ ప్రధాని చెప్పడం పట్ల ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండేళ్ల క్రితం కూడా నిపుణుల కమిటీ వేశారని, దానిపై ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. అప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే మళ్లీ లీకేజీ జరిగేది కాదు కదా అని మండిపడ్డారు. ఈ ఆ బిల్లులో కఠినమైన నిబంధనలను పొందుపర్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుందని దుయ్యబట్టారు. విద్యను కూడా ఓట్లు సంపాదించే మార్గంగా ఎన్‌డీఏ సర్కారు భావిస్తోందని గొగోయ్ ఆరోపించారు. లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్‌బిల్లుపై చర్చలో గౌరవ్ గొగోయ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. తరచూ లీకేజీలు జరుగుతున్నా ఎన్‌టిఏ ఛైర్మన్‌ను ఎందుకు తొలగించలేదని ఆయన ప్రశ్నించారు. నీట్‌పరీక్ష పేపర్ లీకేజీపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ మండిపడ్డారు. విద్యార్థులను పోలీసులు లాఠీలతో కొట్టారని, బాష్పవాయువు ప్రయోగించారని, ముఖ్యంగా బాలికల దుస్తులు లాగి అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డారు.ప్రధాని మోడీ కెమెరా యాంగిల్ కాదు, తన మనసు యాంగిల్ మార్చి చూడాలని సూచించారు. పేపర్ లీక్ బిల్లు వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్కరికీ శిక్ష పడలేదు. పేపర్ లీక్ దోషులకు శిక్ష పడనంత కాలం యువతకు భరోసా ఎలా కలుగుతుంది ప్రధాని తన సలహాదారులను మార్చాలి. ఎందుకంటే ఆయన వాస్తవాలను పూర్తిగా విస్మరించారు. కేంద్ర ప్రభుత్వ విద్యావ్యవస్థపై అన్ని వర్గాలతో చర్చించాలి. నిపుణులతో చర్చించి సమూల మార్పులు చేయాలి. ఉపాధి కల్పనకు పెద్దపీట వేయాలి. వైద్య కళాశాలల సంఖ్యను మరింత పెంచాలి. యువత న్యాయం కోరుతున్నారు. వారు భిక్షాటన చేయడం లేదు. యువత డిమాండ్లలో న్యాయం ఉంది. కనుకనే అందరూ మద్దతు ఇస్తున్నారు. పేపర్ లీక్‌లు నివారించడానికి కొత్త కమిటీలు వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇంతకు ముందు రాధాకృష్ణ కమిటీ సిఫారసులు ఒక్కటీ అమలు చేయలేదు. శిక్షల గురించి అనుభవం లేని వ్యక్తులను కమిటీలో చేర్చారు. ఇక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు గతంలోనూ ఉన్నాయి. ఆకోర్టుల రికార్డులు మొదటి నుంచి సరిగ్గా లేవని ప్రియాంక 2024లో పేపర్ లీక్ బిల్లు వచ్చాక ఇంతవరకు ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. పేపర్‌లీక్ ఘటనలవెనుక మాఫియా ఉందని ప్రియాంకా గాంధీ ఆరోపించారు. వారు విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారని విమర్శించారు. పేపర్ లీక్‌ల వల్ల విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బతిందని ప్రియాంకగాంధీ విమర్శించారు.అటురాజ్యసభలోను చర్చ సజావుగాకొనసాగలేదు. పదేపదే విపక్షసభ్యులు అడ్డుతగలడంతో సభను బుధవారానికి వాయిదావేసారు.

# విచక్షణ మేరకే 'హైడ్రా'

>> సమీక్షిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ఒక ప్రశ్నకు బదులిచ్చారు. కోర్టు ఆదేశాలను, న్యాయస్థానాన్ని గౌరవిస్తామని, అదేవిధంగా హైడ్రా కొనసాగిస్తున్న పనులను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు.ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైనవాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని సిఎం విమర్శించారు. ఈ విషయంలో దేశస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సిఎం అభిప్రాయ పడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సిఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని సిఎం తెలిపారు.ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేది చూస్తామని సిఎం ఒక ప్రశ్నకు బదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సిఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సిఎం చెప్పారు. గ్లోబరీనా వటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సిబిఎస్ఇ పరీక్షల వరకు విస్తరించి, వాటిని గందరగోళం చేశారని సిఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సిఎం తెలిపారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కెసిఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థల మీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సిఎం తెలిపారు. సక్రమంగా ఉన్నవాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు సిఎం బదులిచ్చారు. కెసిఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు.

తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బిఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బిజెపి వంతపాడుతోందని సిఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బిజెపి ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సిఎం ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వం ఉన్న ఎపిలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచి స్తున్నట్లు సిఎం తెలిపారు.

గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సిఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సిఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయని సిఎం అన్నారు. క్రమం తప్పకుండా వాటిని చెల్లించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సిఎం తెలిపారు.

## వారం - వర్జ్యం

29-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
○పౌర్ణమి రా.8.03,
ఉత్తరాషాఢ మ.3.35
వర్జ్యం : రా.7.56-9.40
దు. ఉ.11.47-మ.12.39
శుభసమయం : ఉ.9.00-10.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. వ్యవహారాలలో అవాంతరాలు ఎదురై చికాకుపెడతాయి.

**వృషభం:** కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తిలో లాభాలు పొందుతారు. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి.

**మిథునం:** భూ, స్థలాలకు సంబంధించిన కోర్టు కేసులు పరిష్కారదశకు చేరు కుంటాయి. కార్య క్రమాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు.

**కర్కాటకం :** ఆర్థిక పరమైన వాయిదాలు సక్రమంగా చెల్లించడానికి కష్టపడవలసి వస్తుంది. కీలక సమాచారం అందుకుంటారు.

**సింహం:** నూతన పరిచయాలు పెరుగు తాయి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు వుంటాయి. ఒక ఆహ్వానం ఆశ్చర్యం కలిగిస్తుంది.

**కన్య :** శాస్త్ర, సాంకేతిక విషయాలపై ఆసక్తిచూపుతారు. పుకార్లకు ప్రాముఖ్యత నివ్వకండి. స్పెక్యులేషన్ లాభించదు.

**తుల :** అనుకోని సమస్యలు ఎదురైనా చాకచక్యంగా ఎదుర్కొంటారు. బంధువులను కలుస్తారు.

**వృశ్చికం:** మీ మాటతీరు కొంత కటువుగా, ఎదుటి వారిని నొప్పించే విధంగా ఉంటుంది. జాగ్రత్త వహించండి.

**ధనుస్సు:** తలనొప్పి, పార్శ్వపునొప్పి ఇబ్బందిపెట్టవచ్చు. వాహనాల విషయంలో కాస్త మెలుకవ అవసరం.ఆరోగ్యం జాగ్రత్త.

**మకరం:** వైరి వర్గం వలన ప్రయోజనాలు చేజారిపోవచ్చు. పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. వాహనాలు సౌలభ్యం.

**కుంభం:** నమ్మకం, ఆత్మీయతల కన్న ధనమే గొప్పదని నిరూపించే విధంగా సంఘటనలు జరుగుతాయి.విందులు, వినోదాలలో పాల్గొంటారు.

**మీనం :** దాన ధర్మాల వంటి పుణ్య కార్యాచరణ పట్ల మక్కువ చూపుతారు. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జపాన్‌లో తీవ్రస్థాయి భూకంపం

## రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు, సునామీ హెచ్చరికలు జారీ

**టోక్యో,జులై 28:** జపాన్‌లోని దక్షిణ ప్రాంతాన్ని మంగళవారం మధ్యాహ్నం భారీ భూకంపం వణికించింది. క్యుషు ద్వీపంలోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. దీంతో జపాన్ వాతావరణ సంస్థ వెంటనే తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. కుమమోటో నగర సమీప ప్రాంతం కేంద్రంగా, భూమికి 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు నమోదయ్యాయి. అరియాకే, యత్సుషిరో సముద్ర తీరాల్లో సుమారు ఒక మీటర్ ఎత్తున అలలు ఎగిసిపడే ముప్పు ఉందని, ప్రజలందరూ తీరానికి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. భూకంపం కారణంగా కుమమోటో ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భద్రతా కారణాల దృష్ట్యా బుల్లెట్ రైళ్లతో సహా అన్ని రైలు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశారు.

క్యుషు ద్వీపంలోని కుమమోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఒయిటా, మియాజాకి ప్రాంతాల్లో జపాన్ ప్రభుత్వం తదుపరి అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది. జపాన్‌లో ప్రతి ఏటా వందలాది భూకంపాలు సంభవిస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించే భూకంపాలలో దాదాపు 18 శాతం జపాన్‌లోనే నమోదవుతుంటాయి. వీటిలో అత్యధిక శాతం స్వల్ప తీవ్రత కలిగినవే అయినప్పటికీ, కొన్నిసార్లు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 2011లో రిక్టర్ స్కేలుపై 9.0 తీవ్రతతో సంభవించిన వినాశకర భూకంప వల్ల సుమారు 18,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న జపాన్ ఉత్తర ప్రాంతంలో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే.

# అదుపులో ట్రైనీ ఐపిఎస్ కృష్ణారెడ్డి

>> పోలీసు అకాడమి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేయడం విదితమే. దీని తరువాత మరుసటి రోజు అతను సంజీవరెడ్డి నగర్‌లోని మోతీనగర్‌లో గల స్నేహితుడి ఇంట్లో అతిగా మద్యం సేవించడం వల్ల అనారోగ్యం పాలవగా ఆత్మహత్యకు పాల్పడినట్లు అతను ఒక లేఖ రాయడం, ఇందులో తనపై ఫిర్యాదు చేసిన మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారితో పాటు మరో ముగ్గురి పేర్లను నిందితులుగా చెప్పడం సంచలనం రేపింది. ఈ ఘటన తరువా త వెంటనే అతన్ని ఆసుపత్రిలో చేర్చగా మూడు రోజులకు కోలుకున్నాడు. ఇదే సమయంలో ఈ కేసును అత్తాపూర్ పోలీసు స్టేషన్ నుంచి మహిళా భద్రతా విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు)కు బదిలీ అయ్యింది. దీని తరువాత ఈ విభాగం అధికారులు ఒకసారి ఉదయ్ కృష్ణారెడ్డితో మాట్లాడగా మరోసారి సమగ్రంగా విచారించేందుకు నోటీసు ఇచ్చేందుకు వెళ్లారు. అయితే అక్కడి నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి వెళ్లిపోవడంతో పాటు తన సెల్‌ఫోన్‌ను స్విచాఫ్ చేశాడు. ఇదే సమయంలో తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిపై రెండుసార్లు విచారణ జరిగినా ఇతనికి ఊరట దక్కలేదు. పోలీసులు తనను అరెస్టు చేయకుండా హైకోర్టు నుంచి ఊరట లభిస్తుందని ఉదయ్ కృష్ణారెడ్డి భావించగా అలా జరగలేదు. ఈ కేసుపై బుధవారం హైకోర్టులో మరోసారి విచారణ జరగాల్సి వుంది. మరోవైపు ఉదయ్ కృష్ణారెడ్డి కోసం నాలుగు రోజులుగా పోలీసులు గాలిస్తుండగా మంగళవారం నాడు ఎపిలోని ప్రకాశం జిల్లా నుంచి అతను ఒక ప్రకటన విడుదల చేస్తూ తాను పారిపోలేదని, పోలీసులకు అన్ని విషయాలు చెబుతానని తెలిపాడు. దీని ద్వారా ఉదయ్ కృష్ణారెడ్డి ఆచూకీ పసిగట్టిన పోలీసులు అతను తెలంగాణ సరిహద్దుల్లో రాగానే మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతన్ని నేరుగా అత్తాపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని డబ్ల్యుఎస్‌డబ్ల్యు డిసిపి లావణ్య జాదవ్‌తో పాటు ఇతర అధికారులు విచారిస్తున్నారు. బుధవారం కోర్టులో హాజరు పరిచే వీలుంది.

**ట్రైనీ మహిళా అధికారిపై ఉదయ్ కృష్ణారెడ్డి దాడి చేసినట్లు ఆధారాలు లభ్యం?**

ఇదిలావుండగా లైంగిక వేధింపుల కేసులో నిందితుడుగా వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి తన సహచర మహిళా ట్రైనీ అధికారిపై భౌతికంగా దాడిచేసినట్లు ఈ కేసును విచారిస్తున్న డబ్ల్యుఎస్‌డబ్ల్యు అధికారులకు ఆధారాలు లభించినట్లు తెలిసింది. బాధితురాలి వాంగ్మూలం తీసుకున్న అధికారులు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా గొంతును నులిమినట్లు, చెంపపై కొట్టినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. దీంతో పాటు బాధితురాలి కాళ్లపై ఉదయ్ కృష్ణారెడ్డి బూటు కాలితో తన్నినట్లు డబ్ల్యుఎస్‌డబ్ల్యు అధికారులకు ఆధారాలు లభించినట్లు తెలిసింది. బాధితురాలి రెండు కాళ్లపై గాయాలు వున్నట్లు వైద్య పరీక్షల తరువాత తేలినట్లు సమాచారం. ఈ ఆధారాల కారణంగానే డబ్ల్యుఎస్‌డబ్ల్యు అధికారులు ఉదయ్ కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో ఉత్తరప్రదేశ్ స్పీకర్ సతీష్ మహానా భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై28:** హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఉత్తరప్రదేశ్ విధానసభ స్పీకర్ సతీష్ మహానా మంగళవారం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గవర్నర్‌తో వారు కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు.

## అమెరికా పౌరులు లక్ష్యంగా సైబర్ నేరాలతో కోట్ల రూపాయల స్వాహా

### హైదరాబాద్‌లో ఇడి దాడులు

### కీలక నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** అమెరికా పౌరులను లక్ష్యం చేసుకుని నకిలీ కాల్ సెంటర్‌ను ని ర్వహిస్తూ కోట్లాది రూపాయలను కాజేసి న ఓ బడా సైబర్ నేరగాడిని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. మాదాపూర్ కేంద్రంగా కొనసాగిన ఈ నకిలీ కాల్ సెంటర్‌ను మూడేళ్ల క్రితం సైబరాబాద్ పోలీసులు రట్టుచేయగా మనీలాండరింగ్ కోణంలో విచారణ చేబట్టి న బెంగళూరు ఈడీ విభాగం అధికారులు ఈ కేసులో అసలు నిందితుడు వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీని తాజాగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇతను నిర్వహించిన వీసీ సొల్యూషన్స్ కంపెనీ తాలూకు బ్యాంకు ఖాతాలలో వున్న నగదును, ఫిక్స్‌డ్ డిపాజిట్లను, క్రిప్టో కరెన్సీకి సంబంధించిన పత్రాలు, స్థిరచరాస్తులను జప్తు చేశారు. మాదాపూర్ కేంద్రంగా కొనసాగిన నకిలీ కాల్ సెంటర్ బండారాన్ని సైబరాబాద్ పోలీసులు రట్టు చేయగా ఇందులోని గోల్‌మాల్ వ్యవహారాల ను ఈడీ అధికారులు బట్టబయలు చేశారు. 2022 మే నెలలో వీసీ సొల్యూషన్స్ పేరిట వికాస్ కుమార్ నిమార్ ఒక నకిలీ కాల్ సెంటర్‌ను నె లకొల్పి అందులో ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారిని నియమించుకుని, వారిచేత అమెరికా పౌరులను లక్ష్యం చేసుకుని సైబర్ నేరాల కు పాల్పడడం తెలిసిందే. హైదరాబాద్‌తో పాటు వైజాగ్, లక్నో సహా పలు నగరాలలో వికాస్ కుమార్ నిమార్ ఇటువంటి గోల్‌మాల్ కాల్ సెం టర్లను నిర్వహించి మోసాలకు తెరలేపడం విదితమే. అమెరికా పౌరులను అక్కడి ఎఫ్‌బిఐ అధికారులమని బెదిరించడం, బ్యాంకులు, బీమా క ంపెనీల ప్రతినిధులమని నమ్మించడం ఆనక వారిని బెదిరించి లక్షలాది డాలర్లను వసూలు చేయడం నిమార్ ముఠా చేసేదని అప్పట్లో తేలింది. టెక్నికల్ సపోర్ట్ పేరుతో నిమార్ ముఠా సైబర్ నేరాలకు పాల్పడినట్లు తేలింది. ఈ క్రమంలో 2023 మే నెలలో నిమార్ అక్రమాలను రట్టు చే సి పెద్ద మొత్తంలో నగదును, ఇతర పత్రాలను జప్తు చేశారు. దీనిపై అప్పట్లో బెంగళూరు ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేశారు. దీ నిపై ఇంటర్‌పోల్ నుంచి అందిన సమాచారం మేరకు మంగళవారం నాడు ఈడీ అధికారులు నిమార్‌ను అరెస్టు చేశారు. అతనితో పాటు వీసీ సొల్యూషన్స్ పేరిట వున్న బ్యాంకుల ఖాతాలను జప్తు చేశారు. ఈ ఖాతాలలో కోట్లాది రూపాయలు, డిపాజిట్లు వున్నట్లు ఈడీ అధికారులు తెలి పారు. కాగా నిమార్ అక్రమంగా సంపాదించిన డబ్బులను క్రిప్టో కరెన్సీగా మార్చి భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ అధికారులు తేల్చా రు. ఈ కేసులో నిమార్‌ను గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రిమాండుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని అరెస్టులు వుండే అవకాశాలున్నాయి.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి పరిస్థితి విషమంగానే

### అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్‌లో చికిత్స

### హెల్త్ బులెటిన్ విడుదల చేసిన డాక్టర్లు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెల్త్ బులెటిన్ యశోద ఆస్పత్రి డాక్టర్లు విడుదల చేశారు.ఆయన హెల్త్ కండిషన్ సీరియస్‌గానే ఉందన్నారు. మాటలకు, నొప్పికి స్పందించడంలేదు. మరో 72 గంటలు గడిస్తేగానీ చెప్పలేమన్నారు. తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా రక్తప్రసరణ వ్యవస్థ కుప్పకూలి ఆయన షాక్‌కు గురైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. గత రెండు రోజుల క్రితం గుండెపోటురావడంతో పెద్ది సుదర్శన్ రెడ్డిని సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్చారు.

అప్పటినుంచి ఇంటెన్సివ్ కేర్‌లో ఆయనకు చికిత్స అందిస్తున్నారు డాక్టర్లు. మంగళవారం ఆయన ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్ విడుదల చేశారు యశోద డాక్టర్లు. మెదడుకు ఆక్సిజన్ అందకపోవడంతో ఆయన హెల్త్ కండిషన్ విషమంగానే ఉందన్నారు. "ఈఈజీ, ఎంఆర్ఐ బ్రెయిన్, టీసీడీఎస్ టెస్టుల్లో మెదడు డ్యామేజ్ అయి ఆక్సిజన్ అందని క్లిష్ట పరిస్థితి నెలకొంది.ప్రస్తుతం పెద్ది సుదర్శన్‌రెడ్డి బాడీ నొప్పికి స్పందించడం లేదు.పరిస్థితి విషమంగానే ఉంది..72 గంటల తర్వాత న్యూరాలజికల్ రీ అసెస్మెంట్ నిర్వహించి, ఆరోగ్య పరిస్థితిపై మరింత సమాచారం అందిస్తాం.క్రిటికల్ కేర్, పల్మనరీ, కార్డియాక్, న్యూరాలజీ విభాగాలకు చెందిన వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతున్నది"అని యశోద ఆస్పత్రి డాక్టర్లు తెలిపారు.ఉద్యమనేత ఆరోగ్యపరిస్థితిపై కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు, ఉద్యమ సహచరులు ఆందోళన చెందుతున్నారు.

## సినీనటి పావలా శ్యామల కన్నుమూత

### ఉస్మానియాలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి

### 250పైగా చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** సినీనటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడు తున్న ఆమె హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందు తూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రమైన గుండె పోటు రావడంతో ఆమె మరణించినట్లుగా ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు తెలి పారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్ర పరిచారు. ఎపిలోని గుంటూరు జిల్లాలో 1951లో జన్మించిన పావలా శ్యామల అసలు పేరు నేతి శ్యామల. పదో తరగతి వరకు చదు వుకున్న ఆమె.. నాటక రంగంతో నటన రంగంలోకి



సినీనటి పావలా శ్యామల (ఫైల్)

అడుగుపెట్టారు. నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఆమె నటించిన 'పావలా' అనే నాటకం విశేష ప్రజాదరణ పొందడంతో ఆదే ఆమె ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన అమాయకత్వంతో కూడిన నటనతో తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్రవేశారు. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సాగిన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాల్లో నటించారు. 1985లో బాలకృష్ణ హీరోగా వచ్చిన బాబాయ్.. అబ్బాయ్ సినిమాతో పావలా శ్యామల ఇండస్ట్రీలోకి వచ్చారు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన స్వర్ణకమలం సినిమాతో నటిగా ఆమె గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత ఖడ్గం, గోలీమార్, ఆంధ్రావాలా సినిమాలతో ఆమె పాపులర్ అయ్యారు. కాగా, పావలా శ్యామల మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది.

# తెలంగాణ సాధనలో జైపాల్‌రెడ్డి కృషి అమూల్యం

### శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

### దేశ రాజకీయాల్లో విలువలకు, పార్లమెంటరీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం

### స్ఫూర్తిస్థల్ వద్ద మంత్రులు, ప్రముఖుల నివాళులు



మంగళవారం హైదరాబాద్‌లో నెక్లెస్‌రోడ్డులోని స్ఫూర్తిస్థల్ వద్ద కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి ఏడవ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్ (బేగంపేట), జులై 28, ప్రభాతవార్త:** దేశ రాజకీయాల్లో విలువలకు, పార్లమెంటరీ సంప్రదా యాలకు జైపాల్‌రెడ్డి నిలువెత్తు నిదర్శనమని పలువురు కొనియాడారు. కేంద్ర మాజీమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి ఏడవ వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులో ఉన్న ఆయన స్మారకం స్ఫూర్తిస్థల్ వద్ద మంగళవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తోపాటు రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.

ఈ సంద ర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ముద్దుబిడ్డ తెలంగాణ సాధనలో ఆయన చేసిన ప్రత్యేక కృషి వెలకట్టలేనిదని అన్నారు. జైపాల్‌రెడ్డి ప్రజాసేవ, నిబద్ధత, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయ జీవితం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి అజాత శత్రువు అని అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల అభివృద్ధిలో ఆయన పాత్ర వెలకట్టలేనిదని, దక్షిణ భారతదేశం నుంచి ఉత్తమ పార్లమెం టేరియన్‌గా అవార్డు పొంద డం గర్వకారణ మన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లా డుతూ జైపాల్‌రెడ్డి ప్రజాసేవకు నిలువెత్తు సాక్ష్యం అని, తెలంగాణ అవతరణలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. విద్యార్థి సంఘం నాయ కుడిగా, కేంద్రమంత్రిగా దేశానికి, తెలంగాణకు ఎన్నో విలువైన సేవలు అందించారని పేర్కొ న్నారు.

అంతకుముందు ఆయనకు నివాళులు అర్పించిన వారిలో తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ముఖ్య మంత్రి సతీమణి గీతారెడ్డి, కే.కేశవరావు, ప్రభుత్వ సలహా దారులు వి.హనుమంతరావు, సుదర్శన్‌రె డ్డి, ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, శాసనసభ్యులు నవీన్ యాదవ్, నారాయణరెడ్డి, మాజీమంత్రులు కుందూరి జానారెడ్డి, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి, మాజీ శాసనమండలి ఛైర్మన్ నేతి విద్యాసాగర్ రావు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి, మాజీ శాసన సభ్యులు భాస్కర రావు, జూలకంటి రంగారెడ్డి, జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యు లు ఆయన సోదరులు వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు, ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివా ళులు అర్పించారు. జైపాల్ రెడ్డి సేవలను కొనియాడారు.

### జిఎంఆర్ ఏరోటెక్నిక్ - హనీవెల్ ఏరోస్పేస్ మధ్య

## వ్యూహాత్మక భాగస్వామ్యం

**శంషాబాద్, జులై 28, ప్రభాతవార్త :** దేశంలోని ప్రముఖ విమానాల నిర్వహణ, మరమ్మతులు మరియు ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) సంస్థ జీఎంఆర్ ఏరో టెక్నిక్, హనీవెల్ ఏరోస్పేస్‌తో లీప్ ఇంజిన్ లైన్ రీప్లేసబుల్ యూనిట్స్ (ఎల్ ఆర్ యూ ఎస్ ) నిర్వహణ, మరమ్మతులు మరియు ఓవర్‌హాల్ సేవల కోసం లైసెన్స్ ఒప్పందం కుదుర్చుకుంది.




ఒప్పందం చేసుకుంటున్న ఇరువురు ప్రతినిధులు

ఈ భాగస్వామ్యం ద్వారా భారతదేశంలో అత్యాధునిక ఎం ఆర్ ఓ సేవల విస్తరణకు ఊతమివ్వడంతో పాటు, దేశీయ విమానయాన రంగ సామర్థ్యాల అభివృద్ధిలో జీఎంఆర్ ఏరో టెక్నిక్ కీలక పాత్రను మరింత బలోపేతం చేయనుంది.

ఈ ఒప్పందం కింద, ఎయిర్ బస్సు ఎ 320నియో మరియు బోయింగ్ 737 మాక్స్ విమానాల్లోని లీప్ ఇంజిన్లకు అమర్చిన హనీవెల్ ఏరోస్పేస్‌కు చెందిన ఏడు కీలక ఎల్ ఆర్ యూఎస్ కు జీఎంఆర్ ఏరో టెక్నిక్ సమగ్ర మరమ్మతులు, ఓవర్‌హాల్ మరియు డిపో స్థాయి నిర్వహణ సేవలను అందించనుంది. ఈ సేవల్లో పరికరాలను పూర్తిగా విడదీయడం, సాంకేతిక తనిఖీలు, అవసరమైన మరమ్మ తులు, తిరిగి అమరిక మరియు పనితీరు పరీక్షలు నిర్వహించడం ఉంటాయి.ఈ సందర్భంగా జీఎంఆర్ ఏరో టెక్నిక్ ప్రెసిడెంట్ అకౌంటబుల్ మేనేజర్ అశోక్ గోపీనాథ్ మాట్లా డుతూ..."హనీవెల్ ఏరోస్పేస్‌తో మా భాగస్వామ్యం కాంపోనెంట్ ఎంఆర్ఓ సేవల్లో మరో కీలక మైలురాయని హనీవెల్ సాంకేతిక నైపుణ్యాన్ని, మా అత్యాధునిక మౌలిక సదుపాయాలను సమన్వయం చేస్తూ, దేశంతో పాటు ప్రాంతీయ లీప్ ఇంజిన్ ఆపరేటర్లకు వేగవంతమైన, నాణ్యమైన మరియు విశ్వసనీయ మరమ్మత్తు సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

హనీవెల్ ఏరోస్పేస్ - యూరప్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా మరియు భారతదేశం అధ్యక్షుడు కూపర్ కలెన్ మాట్లాడుతూ, "భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో ఒకటి. మా ప్రాంతీయ ఎయిర్‌లైన్ వినియోగదారులకు అత్యుత్తమ లీప్ ఇంజిన్ ఎల్ ఆర్ యూ మద్దతు సేవలను అందించడం మా ప్రధాన లక్ష్యమన్నారు.

ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం, జీఎంఆర్ ఏరో టెక్నిక్ తన ఎంఆర్ఓ సామర్థ్యాలను విస్తరించాలనే దీర్ఘకాలిక దృష్టికి అనుగుణంగా ఉండటమే కాకుండా, దేశీయ మరమ్మత్తు సామర్థ్యాలను అభివృద్ధి చేయడం మరియు విదేశి ఎంఆర్ఓ సేవలపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా భారత ప్రభుత్వ "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమానికి కూడా తోడ్పడుతుందన్నారు.

## పద్మశ్రీ గ్రహీతలకు 'లయన్స్ లైఫ్' పురస్కారాలు




పద్మశ్రీ గ్రహీతలు డాక్టర్ పాలకొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి, డాక్టర్ గుడూరు వెంకట్‌రావు, డాక్టర్ కుమారస్వామి తంగరాజ్, డాక్టర్ దీపికారెడ్డి, డాక్టర్ కృష్ణస్వామి బాలసుబ్రహ్మణ్యన్‌లకు 'లయన్స్ లైఫ్' పురస్కారాలు ప్రదానం చేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఎ ఆధ్వర్యంలో మంగళ వారం తెలంగాణకు చెందిన ఐదుగురు పద్మశ్రీ పురస్కారగ్రహీతలను ఘనంగా సత్కరించి, లైఫ్ (లయన్స్ ఇంటర్నేషనల్ ఫెలో ఆఫ్ ఎక్స్‌లెన్సు) ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జిల్లా వార్షిక పదవీ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. వైద్యం, విజ్ఞానం, కళలు-సంస్కృతి తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందిం చిన డాక్టర్ పాలకొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి (అంకాలజీ, కేన్సర్ కేర్), డాక్టర్ గుడూరు వెంకట్ రావు (గ్యాస్ట్రోఎంటరాలజీ), డాక్టర్ కుమారస్వామి తంగరాజ్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్), డాక్టర్ దీపికారెడ్డి (కళలు, సంస్కృతి), డాక్టర్ కృష్ణస్వామి బాలసుబ్రహ్మణ్యన్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్)లను ఈ సందర్భంగా సత్కరించారు. లైఫ్ అవార్డ్స్ ఛైర్మన్, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్ కుమార్ మాట్లాడుతూ అవార్డు గ్రహీతలు సమా జానికి, దేశానికి చేసిన సేవలు ఆదర్శ ప్రాయ మని కొనియాడారు. సమాజసేవ, సామాజిక బాధ్యతల నిర్వహణలో లయన్స్ క్లబ్ ఇంట ర్నేషనల్ విశేష సేవలు అందిస్తూ, 3,600 మం దికిపైగా సభ్యులతో సేవాకార్యక్రమాలు కొనసాగి స్తోందన్నారు. అనంతరం పాస్ట్ ఇంటర్నేషనల్ డైరె క్టర్లు ప్రేమ్‌చంద్ బఫ్నా, డాక్టర్ జి.బాబు, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సురేష్ జగ్నానీ తది తరులు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది ప్రతి నిధులు పాల్గొన్నారు. అనంతరం సత్కారం పొం దిన పద్మశ్రీ గ్రహీతలు డాక్టర్ పాలకొండ విజయ్ ఆనంద్‌రెడ్డి, డాక్టర్ గుడూరు వెంకట్‌రావు, డాక్టర్ కుమారస్వామి తంగరాజ్, డాక్టర్ దీపికారెడ్డి, డాక్టర్ కృష్ణస్వామి బాలసుబ్రహ్మణ్యన్‌లు యువ తకు స్ఫూర్తినిచ్చే సందేశాలను అందించారు. యు వత సమాజసేవతోపాటు తమతమ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని పిలుపునిస్తూ, తమను గౌరవించిన లయన్స్ క్లబ్స్ ఇంటర్నే షనల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

### బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కావాలి

### జంతర్ మంతర్ వద్ద మద్దతు

### తెలిపిన వివిధ పార్టీల ఎంపిలు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించా లని, ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఇన్‌చార్జి నూకాలమ్మ, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో డిల్లీలోని పార్లమెంట్ వద్ద భారీ ధర్నా ప్రదర్శన జరిపారు. జడి వాన కురుస్తున్న వానలో తడుస్తూ ధర్నా వద్ద ఎంపిలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, పాక సత్య నారాయణ, నాగరాజు, రామారావులతోపాటు ఏపీ,తెలంగాణ, కర్ణాటక నుంచి బీసీ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంలో వాటా పంచకుండా బీసీలకు ఎన్ని రోజులు అన్యాయం చేస్తారని బి.సి.లు ప్రశ్నించారు. ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను సమర్ధిం చారు. 'కేంద్ర ప్రభుత్వం బీసీలకు జాతీయ బీసీ కమిషన్, బిసి పార్లమెంట్ కమిటీ, జాతీయ బీసీ కార్పొ రేషన్ పని చేస్తు న్నాయి. వీటిని ఏ మంత్రిత్వ శాఖ క్రింద నడపాలని ప్రశ్నించారు. అలాగే అన్ని రాష్ట్రాలలో బీసీలకు ప్రత్యేక మంత్రి త్వ శాఖలు ఉన్నవి. ఈ రాష్ట్రాలు అమలు చేసే పథకా లకు కేంద్రంలో ఏ మంత్రిత్వ శాఖ అనుసం ధానం చేయాలి. కేంద్రం లో బీసీలకు విద్య, ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నా రు. వీటిని ఏ శాఖ అమలు చేయాలి. పరిశీలిం చాలి. బీసీలకు ప్రత్యేక శాఖ లేకపోవడం వలన బడ్జెట్ కేటాయింపులు, ఆర్థిక అభివృద్ధి పథకాలు, స్కాలర్ షిప్‌లు, ఫీజుల స్కీము అమలు చేయడం లేదు' అన్నారు. కేంద్ర విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు బి.సి.ల జనాభా ప్రకారం 27శాతం నుండి 56 శాతానికి పెంచాలని కోరారు. పంచాయతీరాజ్ సంస్థలో బి.సి. రిజర్వేషన్లను 22 శాతం నుంచి 50 శాతంకు పెంచాలి. ఎస్సీ ఎస్టీ అట్రా సిటీ యాక్ట్ మాదిరిగా బి.సిలకు బిసి యాక్ట్ తీసుకురావాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్ బి.సి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కృష్ణయ్య కోరారు.



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య



కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి తదితరులు

## రాజకీయ నైతికతకు ప్రతీక జైపాల్‌రెడ్డి

### చిత్రపటానికి నివాళులు అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 28:** రాజకీయాల్లో నైతికతకు ప్రతీక కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించు కొని సిఎం రేవంత్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. విద్యార్థి నాయకునిగా ప్రస్థానం ప్రారంభించిన జైపాల్‌రెడ్డి తుదిశ్వాస వరకు విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని సిఎం పేర్కొన్నారు. తన విషయ పరిజ్ఞానం, వాగ్ధాటితో అటు ప్రజలు, ఇటు పార్లమెంట్‌లో తనదైన ముద్రవేసిన ఘనత జైపాల్‌రెడ్డిదని సిఎం తెలిపారు. ఆయన ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కార్య క్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు రోహిణ్‌రెడ్డి, తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు.

## విజయం ఎంత ముఖ్యమో వినయం కూడా అంతే ముఖ్యం

### సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌ఛుక్



**న్యూఢిల్లీ, జులై 28:** కలిసికట్టుగా పోరాడితే విజయం వరిస్తుందని కాక్రోచ్ జనతా పార్టీ ఉద్య మం వల్ల స్పష్టమైంది. కానీ విజయం ఎంత ముఖ్యమో వినయం కూడా అంతే ముఖ్యమని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సీజేపీ చేసుకున్న సంబురాల వీడియో సోషల్ మీడియా లో వైరల్ అవుతుంది. దీనిపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. గౌరవంతో, సంయమనంతో, బాధ్యతా యుతంగా సంబురాలు జరుపుకోవాలని సామాజిక కార్యకర్తలు, తన మద్దతుదారులను కోరారు. సంబరాల వీడియోలపై వ్యతిరేకత వెల్లు వెత్తుతున్న నేపథ్యంలో సీజేపీ స్పోక్స్‌పర్సన్ సౌరవ్ దాస్ స్పందించారు. మేం ఎంత సమయమైనా రోడ్డుపై బైఠాయించగలం. కోల్డ్ కాఫీ తాగుతూ సంఘటితమవ్వగలం. డాన్స్ చేస్తూ నిరసన తెలపగలం. ఇదే ఈతరం స్వభావం అని అన్నారు. సృజనాత్మకత, దృఢత్వం ఉన్న జెన్‌జడ్ తరాన్ని ఒకే మూసలో ఇరికించడం సాధ్యం కాదు. విజయం తరువాత చేసుకున్న సంబురాల వీడియోలు యువ తరం స్ఫూర్తిని ప్రతి బింబిస్తున్నాయని, జెన్‌జడ్ ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపిస్తు న్నాయని అన్నారు. అయితే కొంతమందికి నేటి యువతరం భాష అర్థం కావడం లేదని ఆయన ఆరోపించారు. ఎవరేమనుకున్నా నేటి జెన్ జడ్ యువత ఇలాగే ఉంటుందని అన్నారు.

## పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఆగని నిరసనలు

### 20 మందికిపైగా మృతి, అనేకమందికి తీవ్రగాయాలు

**ముజఫరాబాద్, జులై 28:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) చేపట్టిన లాంగ్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసలో కనీసం 31 మంది మృతి చెందారు. వీరిలో 21మంది రావల్‌కోట్‌లోను మరో పది మంది మిర్‌పూర్‌లోను చనిపోయినట్లు తేలింది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. జేఏఏసీ మంగళవారం ఎక్స్‌లో చేసిన పోస్టు ప్రకారం లాంగ్ మార్చ్ బృందాలు రావల్‌కోట్‌కు చేరుకున్నాయి. ఇప్పటివరకు 19 మంది మృతుల గుర్తించామని తెలిపింది. తలకు బుల్లెట్ గాయం అయిన మరో వ్యక్తి వద్ద గుర్తింపు పత్రాలు లేకపోవడంతో మొత్తం మృతుల సంఖ్య 31కి చేరిందని పేర్కొంది. పరిస్థితులు సాధారణమైన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపింది. జేఏఏసీ, పాకిస్థాన్ అధికారుల మధ్య చర్చలు విఫలం కావడంతో ఈ లాంగ్ మార్చ్ చేపట్టారు. ఆదివారం మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ సోమవారం ముజఫరాబాద్ వైపు సాగింది. మరోవైపు పాక్ భద్రతా బలగాలు శాంతియుత నిరసనకారులపై సోమవారం సాయంత్రం కాల్పులు, టియర్ గ్యాస్, భారీ బలప్రయోగానికి పాల్పడ్డాయని యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ (యూకేపీఎన్‌పీ) ఆరోపించింది. దీంతో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు వెంటనే జోక్యం చేసుకోవాలని యూకేపీఎన్‌పీ కోరింది. శాంతియుత నిరసనకారులపై కాల్పులు, అధిక బలప్రయోగాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జులై 27 నుంచి ఆగస్టు 10 వరకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొత్తం 53 స్థానాల్లో 45 స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతుండగా, ఎనిమిది స్థానాలు మహిళలు, సాంకేతిక నిపుణులు, మతపెద్దలకు రిజర్వ్ చేశారు.

## ట్రోలింగ్‌కు దూరంగా ఉండండి

### అభిమానులకు అల్లు అర్జున్ కీలక సూచన

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 28, ప్రభాతవార్త:** నచ్చని వారి గురించి ఆలోచించడం కంటే నచ్చే పనిచేసుకుంటూ వెళ్లడం మంచిదని తన అభిమా నులను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సూచించారు. ఈ సందర్భం గా సోషల్ మీడియాలో జరుగుతున్న నెగెటివిటీ, అనవసర వివా దాల గురించి స్పం దిస్తూ అభిమానులకు పలు కీలక సూచనలు చేశారు. యూసుఫ్ గూడ లోని శౌర్యభవన్‌లో మంగళ వారం అల్లు అర్జున్ దాదా పు 900ల మంది అభి మానులతో నలుపు రంగు దుస్తుల కోడ్‌లో అభిమా నుల ఆతిథ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ.. ఈ రోజు నేను ఇక్కడ ఉండటం చాలా గర్వంగా ఉంది. ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు. మీలో ఈ ఉత్సాహాన్ని ఎప్పటికి పోనివ్వకండి. నా అభిమానులకే కాదు.. నన్ను ద్వేషించేవారికి చెబుతున్నా.. ఒకరిపై ఒకరు ట్రోలింగ్ చేయడం మంచిది కాదు. మనకు నచ్చని వాళ్ల కోసం మన సమయం, డబ్బు, శక్తి ఎందుకు ఖర్చుచేయాలి.? సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌పై స్పదించడం కంటే, ఆ సమయాన్ని మీ సొంత ఎదుగుదల కోసం ఉపయోగించండి, మీకు నచ్చిన పని చేయండి, నీకు నచ్చిన అమ్మాయి ఇంటి ముందు నిలబడి ఎదురుచూడండి, పర్లేదు కనీసం నువ్వు ఆ సయమాన్ని అయినా ఎంజాయ్ చేస్తావు కదా అని అన్నారు. ఎవరిని ఎప్పుడు ట్రోల్స్ చేయవద్దని, సమయం, శక్తి ఏదైనా అనుకోండి ప్రతి మనిషికి ఒక రోజులో 100 శాతం ఉందనుకుంటే దాన్ని మీరు దేనికి ఉపయోగిస్తారనేది ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతోపాటు ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ నుంచి అభిమానులు తరలివచ్చారు. ఏఏఎఫ్ఏ తరుపున ఆయన అభిమానులకు ఇన్సూరెన్స్ పాలసీలను అందించారు. ఈ సందర్భంగా ప్రతి అభిమానికి ఆయన తనతో ఫొటో దిగే అవకావం కల్పించారు.



అభిమానులతో కలిసి సెల్ఫీ దిగుతున్న సినీహీరో అల్లు అర్జున్

వార్త

అంతరాత్మ నీకు మంచి స్నేహితుడు. కావున తరచుగా తన మాట వినవలసిందే!

- గురజాడ

# ఓటు హక్కుపై నీలినీడలు !


ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితాపై ప్రజలకు నమ్మకం లేకపోతే ఎన్నికల ఫలితాలపై కూడా అనుమానాలు తలెత్తుతాయి. అందుకే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ వంటి ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా సాగాలి. ఇప్పటికే ఎన్నో రాష్ట్రాలలో 'సర్' ప్రక్రియ విమర్శలకు తలకెత్తుకుంది. కాగా ఆంధ్రప్రదేశ్లో ఎస్ఐఆర్ అమలుపై వెలువడుతున్న ఆరోపణలు ఎన్నికల నిర్వహణపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రతిపక్షాల ఆరోపణలు కొట్టేయదగినవి కావు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని, బూత్ లెవల్ అధికారులపై అసాధారణ ఒత్తిడి ఉందని, రాజకీయ ప్రభావంతో ధృవీకరణ జరుగుతోందని, ఫారాల పరిశీలన సజావుగా లేదనే ఆరోపణలున్నాయి. ఆ మేరకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా అందాయి. నకిలీ నమోదులు, మరణించిన వారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్లను గుర్తించి జాబితాను సరి చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని ప్రకటించుకున్నా జరుగుతున్న కార్యాచరణ వేరేగా ధ్వనిస్తోంది. ప్రతి అభ్యంతరాన్ని స్వీకరించేందుకు, ప్రతి ఓటరుకి అవకాశం కల్పించేందుకు చట్టబద్ధ విధానాలు అమల్లో ఉన్నాకూడా అధికారయంత్రాంగం కొన్ని విధానాలు పట్టించుకుంటున్నట్లు లేదు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఎంత ఎక్కువగా ఉంటే, రాజకీయ వివాదాలు అంత తక్కువగా ఉంటాయి. ప్రతి తొలగింపుకు స్పష్టమైన కారణం ఉండాలి. ప్రతి అభ్యంతరానికి వేగంగా పరిష్కారం లభించాలి. ప్రతి రాజకీయ పార్టీకి సమాన సమాచారం అందాలి. ఇదే ప్రజాస్వామ్యానికి సరైన మార్గం. ఆంధ్రప్రదేశ్లో ఓటరు జాబితాలపై వివాదాలు కొత్తవి కావు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలపై కూడాఇలాంటి ఆరోపణలు వచ్చాయి. అందువల్ల ఇది ఒక పార్టీకి సంబంధించిన అంశంగా కాకుండా, ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన సమస్యగా చూడాలి. కానీ ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే నష్టపోయేది ప్రజాస్వామ్యమే. ఎస్ఐఆర్ అమలులో బూత్ లెవల్ అధికారుల పాత్ర అత్యంత కీలకం. అధికార యంత్రాంగం వేగం కంటే నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంకో వైపు రాజకీయ పార్టీలకూ బాధ్యత ఉంది. ఆధారాలతో కూడిన అభ్యంతరాలు సమర్పించడం, వాటిని నిష్పాక్షికంగా విచారించడం ఈ రెండు సమాంతరంగా జరగాలి. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదు. అదే సమయంలో నకిలీ నమోదులకు కూడా స్థానం ఉండకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే ఎన్నికల సంఘం ముందున్న అసలు సవాలు. ఎస్ఐఆర్ వివాదం చివరికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలతో నిరంతర సంభాషణ ఈ మూడు సూత్రాలు బలంగా అమలైతే ఆరోపణలకు తావుండదు. తెలంగాణలో మొత్తం ఓటర్లు 3.4 కోట్లు. తెలంగాణలో ఫ్లాగ్ చేసిన రికార్డులు సుమారు 88 లక్షలుంటాయి. సుమారు 30లక్షలు అని అధికారుల అంచనా. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు 9శాతంగా చెప్పాలి. ఎమ్ఇఆర్ చెల్లుబాటైన డాక్యుమెంట్లు ఇస్తే పేరు తొలగించరాదని సుప్రీం కోర్టు తీర్పు స్పష్టం చేసింది కూడా. వలసదారులు, డూప్లికేట్ ఐడీల కారణంగా హైదరాబాద్లో అత్యధిక తొలగింపులు ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో 30 లక్షల వరకు తొలగిపోయే అవకాశం ఉందని అంచనా. ఇక ఆంధ్ర ప్రదేశ్లో మొత్తం ఓటర్లు 4.16కోట్లు కాగా ఒక్క తిరుపతి జిల్లాలోనే 2.88 లక్షల మంది ఆచూకీ తెలియని వారి జాబితాలో పెట్టారు. ఇప్పటికే 15.2 లక్షల మంది చనిపోయిన వారు, 14.4 లక్షల మంది చిన్న గాయాలు మారిన వారు, 7.3లక్షల డూప్లికేట్ వెరసి 37లక్షలకు పైగా ఓటర్లు తొలగింపు ప్రక్రియలో బాధితులుగా మారారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం రాజ్యాంగ హక్కు మాత్రమే కాదు, అది జన స్వరానికి ప్రతీక. అర్హు లైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదు. అదే సమయంలో నకిలీ నమోదులకు కూడా స్థానం ఉండకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే ఎన్నికల సంఘం ముందున్న అసలు సవాలు. ఎస్ఐఆర్ వివాదంలో తేలిన విషయాలను బట్టి చివరికి ఒక స్పష్టమైన సందేశాన్ని గమనించవచ్చు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలతో నిరంతర సంభాషణ. ఈ మూడు సూత్రాలు బలంగా అమలైతే ఆరోపణలకు తావు తగ్గుతుంది. ప్రజాస్వామ్యం బలపడేది రాజకీయ విజయాలతో కాదు. ప్రజలు ఎన్నికల ప్రక్రియను నమ్మినప్పుడే. ఆ నమ్మకాన్ని కాపాడడం ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అందరి ఉమ్మడి బాధ్యత. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. సాంకేతిక సరిదిద్దుబాట్లు లేదా అధికారిక ప్రక్షాళన పేరుతో ఏఒక్క నిజమైన పౌరుడూ ఓటు హక్కుకు దూరం కాకూడదు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత పెరగాలన్నా, ప్రజాస్వామ్య పునాదులు బలపడాలన్నా 'సర్' ప్రక్రియ నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరగడం అత్యంత ఆవశ్యకం. తగినముందస్తు నోటీసులు లేదా క్షేత్రస్థాయి విచారణ లేకుండానే నిజమైన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించడం క్షమార్హం కాదు. వలస కార్మికులు, పేదలు , అట్టడుగు వర్గాలు అవసరమైన ఆధార్, పుట్టిన తేదీ లేదా నివాస ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత సమయంలోగా అందించలేక ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అది ప్రజాస్వామ్యానికే తీరని మచ్చ.

ఆత్మవిశ్వాసం, స్వయం పోషకత్వం ఉత్తమ స్వభావానికి మూలస్తంభాలు వంటివి.



వినోబా భావే

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె. స్టానిస్లావిస్కి

## ప్రజావాక్కు



### మద్రాస్ హైకోర్టు తీర్పు అభినందనీయం

ఏదైనా ప్రమాదంలో చనిపోయిన వారికి ప్రభుత్వంలో ఉద్యోగం ఇస్తాం, ఆదుకుంటాం అనడం మన నాయకులకు అలవాటైపోయింది. ఆదుకుంటాం అనడంలో అర్థముంది. ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం అనడం మాత్రం కరెక్ట్ కాదు. మనరాజ్యాంగం 14వ ఆర్టికల్లో స్పష్టంగా చట్టం ముందు అందరూ సమానులే అని ఉంది. భారత దేశంలోఎక్కడా ఏవ్యక్తికి చట్టపరమైన సమనత్వాన్ని, రక్షణలను కల్పించటంలో సమానత్వాన్ని రాజ్యం నిరాకరించరాదు. మరి ఇలా ఈకుటుంబలవారికిప్రభుత్వ ఉద్యోగం ఇస్తామనడం చట్ట విరుద్ధం. ఇదే విషయాన్ని మద్రాస్ హైకోర్టు స్పష్టంగాచెప్పింది. 'గతంలో తమిళనాడు విజయ్ సభలో చనిపోయినవారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తాము అన్న హామీలు రాజ్యాంగ విరుద్ధం, పరీక్షలు పెట్టి అర్హులకు ఇవ్వాలి'. మద్రాస్ హైకోర్టు తీర్పు అభినందనీయం. ఈతీర్పు అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుంది. మరి మన నాయకులు చనిపోయిన వారికుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం అనడం పరిపాటి అయిపోయింది. కనుక ఇక నుండి ఇలాంటి సందర్భాలలో అలాంటి చట్టవిరుద్ధమైన హామీలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మీసేవ ద్వారా హాజరు కల్పించాలి

కూలీనాలీ చేసుకుని చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతుకువెళ్లతీసే ఎందరో ముద్దాయిలుగా ఆయా కేసులలో న్యాయ స్థానాలకుహాజరైన సందర్భాలలోఉపాధిని కోల్పోతుంటారు. తుదితీర్పు రోజు వెలువడే రోజు మినహా ప్రతి సారిమీసేవ వంటివాటి సహాయంతో వర్చువల్గా హాజరు నమోదుకల్పిస్తే నిజమైన నిర్దోషులకు సాయంగా ఉంటుంది. ఎందరో సెలబ్రిటీలు పొందుతున్న ఈ సౌకర్యం సామాన్యులకెందుకు వర్తింపచేయకూడదో ఆలోచించాలి.

- వి.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

### ఖాళీ సీట్లను భర్తీ చేయాలి

గురుకులాల్లో పని చేస్తున్న లెక్చరర్స్, టీచర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్ వారి పిల్లలకు కూడా గురుకులాల్లో సీట్లు కల్పించాలి. ఖాళీగాఉన్న సీట్లను భర్తీచేయాలి. ప్రతి గురుకులం ప్రతి తరగతిలో సంవత్సరం మొత్తం సీట్లు మిగిలి ఉంటున్నాయి. వృధాగా ఉండే కంటే గురుకులాల్లో పని చేస్తున్న వారి పిల్లలకు ఇవ్వాలి. మొత్తం సీట్లు ఈ 2026 -2027 నూతన విద్య సంవత్సరంలో భర్తీ చేయాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

### ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి

పోటీపరీక్షలు లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తాయి. అలాంటి పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ జరగడం వల్ల నిజాయితీగా శ్రమించిన అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణకోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఎంతో స్వాగతించదగ్గది. ఇలాంటి కేసుల్లో వేగవంతమైన విచారణ నిందితులకు త్వరగా శిక్ష పడేలా చేయడమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. చాలా సందర్భాల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సంవత్సరాల పాటు సాగుతుంటాయి. దీనివల్ల పరీక్షలురాసిన అర్హులైనఅభ్యర్థులుతీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారు. వారి విద్య, ఉద్యోగ అవకాశాలు ఆలస్యమవుతాయి. మరోవైపు నేరస్థులకు చట్టంపై భయం తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వేగవంతమైన న్యాయ ప్రక్రియఅవసరం. పరీక్షా నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు, డిజిటల్ పర్యవేక్షణ, ప్రశ్నపత్రాల రవాణా, నిల్వప్రక్రియల్లో కట్టుదిట్టమైన రక్షణచర్యలుఅమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సరైన ఎంపి!

వీవీఎస్ లక్ష్మణ్‌ను భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్‌గా నియమించాలని అభిమానులు కోరుతున్నారు. తాత్కాలిక కోచ్‌గా 7 ద్వైపాక్షిక సిరీస్‌లలో 6 విజయాలు అందించడంతో పాటు ఆసియా క్రీడల్లో భారత్‌కు స్వర్ణ పతకం అందించారు. యువ ఆటగాళ్లను ఒత్తిడి లేకుండా ప్రోత్సహించి వారి ప్రతిభను వెలికితీయడంఆయన ప్రత్యేకత. సీనియర్లు, జూనియర్లు అందరినీ సమానంగా గౌరవిస్తూ జట్టులో ఐక్యతను పెంపొందిస్తారు. ఆయన కోచింగ్ విధానం జట్టుకు సానుకూల వాతావరణాన్ని తీసుకువస్తుందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. గంభీర్ కంటే లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో యువ ఆటగాళ్ళు మెరుగ్గా రాణిస్తున్నారనే అభిప్రాయం క్రికెట్ వర్గాల్లో ఉంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఉద్యోగులు విధిగా విధులు నిర్వహించాలి

ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేకంగా పంచాయతీ కార్యదర్శులు పని వేళలో సక్రమంగా సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలి. వాళ్లకు కేటాయించిన ఊర్లోనే ఉంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. ఎక్కడ అందుబాటులో లేకపోయినాపై అధికారులకు ఫిర్యాదు చేయండి. విధుల నుండి తొలగించే అవకాశం లేకపోలేదు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# బలమైన లక్ష్యమే 'కాక్రోచ్' విజయానికి నాంది!

***అహింసతో స్వాతంత్ర్యం సాధించుకున్న ఈ దేశం క్రమేపీ హింసకు అనేక ఘటనలల్లో స్థానం ఇవ్వటం శోచనీయం! విద్యార్థులు అదుపు తప్పితే అల్లరి చిల్లరి పనులు చేస్తారు! మన ఇండ్లలో గూడా పిల్లల అల్లరి చేష్టలు చూస్తునే వుంటాం! తల్లిదండ్రులు ఆ చేష్టలు శ్రుతిమించిన పుడు హద్దుల్లో పెట్టగలరు! ఆ నేర్పు ప్రభుత్వాలు నేర్చు కోవాలి! కరుడు గట్టిన అల్లరి మూకలను అణిచివేసే ధోరణి లోనే సహేతుకంగా ఆందోళనకు దిగిన యువతను విద్యార్థు లను, అదుపు చేయాలని ప్రయత్నించటం సరికాదు! ఆ విధంగా ఢిల్లీ పోలీసులు చేసారన్న ఆరోపణలు ఊపిరి పోసుకోవటం వల్ల, ఆందోళనకారులు ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనలకు సానుభూతి లభించింది. అందుకే మిడతల యుద్ధం విజయవంతంగా ముగిసింది! కాక్రోచ్ పార్టీ ఈ విజయాన్ని ఆధారం చేసుకొని రాజకీయాల్లో జొరబడితే దేశంలో వున్న అన్ని పార్టీల మాదిరే మిగులుతుంది. ప్రత్యే కత పేరుకు మాత్రమే కాదు లక్ష్యానికి వున్నప్పుడే విజయం చీమల దండుకైనా దక్కుతుంది.***



రావులపాటి సీతారాంరావు

మిడతల దండు ఉద్యమం విజయవంతంగా ముగియటానికి ముఖ్య కారణం పట్టుదల! విద్యార్థులలో యువతలో ఆ పట్టుదల లక్ష్యం సాధించాలన్న ఏకాగ్రత చాలా రోజుల తర్వాత ఈ ఉద్యమంలో చూడగలిగాం. సి.జె.పి (కాక్రోచ్ జనతా పార్టీ) స్థాపించిన అభిజిత్ దీప్కే స్వీయ నాయకత్వంతో ఈ విజయం సాధించాడా, వెనకఎవరైనా వున్నారా అన్నది ప్రస్తుతంఅప్రస్తుతం! అది తర్వాత తేలాల్సిన విషయం! ప్రస్తుత పరిస్థితులలో, ఉద్యమం సద్దుమణిగిన వేళ కొన్ని అంశాలు ప్రస్ఫుటంగా విశ్లేషించుకోవాల్సిన అవసరం వుంది! జూలై 19న జంతర్ మంతర్ నుంచి సోనమ్ వాంగ్ చుక్‌ను ఒక రోజు ముందు లేపేసిన రోజున వందల కొద్దీ యువత నిరసనకారులకు వత్తాసు పలికారు. బీహార్, యు.పి, రాజస్థాన్, హర్యానా, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల నుండి తరలివచ్చి వారితో జత కలిపి ప్రొటెస్టు చేయసాగారు! మెట్రో స్టేషన్లు మూసి వేయబడినా, ఇంటర్నల్ సర్వీసులు పనిచేయకపోయినా, జనం విపరీతంగా ఎన్నో కిలోమీటర్లు నడుచుకుంటూ జంతర్ మంతర్ ప్రాంతానికి చేరుకోవటం విశేషమే! ఎవరిని అడిగినా జంతర్ మంతర్కు వెళ్తున్నాం అనే!జంతర్‌మంతర్ ప్రాంతంలో నిరాహార దీక్షలు చేస్తున్నవారు ఆకలిని తట్టుకొని ఎన్నో గంటలు కాక్రోచ్ ఉద్యమంలో పాల్గొనటం, విద్యార్థులకు మేమున్నాం అని చేయూతనివ్వటం ఈ మధ్య కాలంలో చూడని విషయంగా చెప్పుకోక తప్పదు! 21 రోజులు నిరాహార దీక్ష చేస్తూ గూడా చెక్కుచెదరని దీక్షతో విద్యార్థులు వుండటానికి కారణం వారు లక్ష్యాన్ని బలంగా నమ్మటం వల్లనే! అంతేగాదు ప్రశాంతంగా మౌనవ్రతంలో కూర్చోవటం గూడా అరుదైన విషయమే! ఆకలిని జయించి క్రమశిక్షణను ఆలంబనగా చేసుకొని విద్యార్థులు వారి శరీరాలను, మాటలనూ, ఓపికనూ అదుపులో నమ్మకంతో పెట్టుకోగలగటం వారి మొదటి విజయంగా చెప్పుకోవాలి!'విద్యార్థులలో తమకు జరుగుతున్న అన్యాయానికి లోలోపల కోపాగ్నిగా రగిలి బడబాగ్నిగా బయటకు ఉబికి ఉబికి వస్తున్నదని' అర్థతతో జంతర్‌మంతర్ ప్రాంతంలో అంతులేని విద్యార్థి లోకాన్ని చూసిన వృద్ధుడు అనటం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. జులై 20 నాడు జంతర్ మంతర్‌లో చూసిన దృశ్యాలు విద్యార్థి లోకం మూకుమ్మడిగా తిరగబడటం, బారికేడ్లను విరిచేయటం, టియర్ గాస్, లాఠీ చార్జిలతో గాయాలు అయినా ఎదురొడ్డి నిల్చోవటం, అరెస్టులు కావటం పోలీసుల ఎఫ్.ఐ.ఆర్లను స్టేషన్లలో ఎదుర్కోవటం, ఇంకా ఆ ప్రాంతంలో నివసిస్తున్న జనానికి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తూనే వున్నాయి! అయితే ఇన్ని జరిగినా వారిఓపిక తగ్గకుండా వుండటాన్ని ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటూనే వున్నారు! 'ప్రతిఘటన'ను విద్యార్థిలోకం ఆయుధంగా మల్చుకుంది! ఉద్రేకంతో చేసే ఆ ప్రతిఘటన వారి శరీరాల్లో ఇంకిపోయి పట్టుదలను మరింతగా పెంచినందువల్లేఅంతగా ప్రభుత్వాన్ని పాలనను ఎదిరించి పోరాడగలిగారు!వారి ప్రతిఘటనా శక్తిని అణిచివేయటానికి ప్రయత్నించినా మరింత వేగం పుంజుకొని వారిలో తిరగబడే నేర్పరితనాన్ని కలిగించటం వల్లనే, అంతమంది పోలీసులను ఎదురొడ్డి, దీక్షను సాగించగలిగారు! ప్రొటెస్ట్ వారికి ఆ క్షణంలో 'లైఫ్‌లైన్' గా మారింది అన్న భ్రాంతిని చూపరులకు కలిగించింది! వేల





కొద్దీ పార్లమెంటు వైపు పోలీసుల లాఠీచార్జీని, అణిచివేత ధోరణిని లెక్కచేయకుండా, ఆశ్చర్యపరిచే విధంగా సంయమనంతో ఓపికతో మార్చ్ చేస్తూ వెళ్ళటం వారి దృఢ సంకల్పాన్ని ప్రభుత్వానికి తెల్పినట్లయింది! వారే కాదు, మహిళలు, వృద్ధులు, పిల్లలు, బారికేడ్లను నెట్టేసుకుంటూ, లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులకు గులాబీ పుష్పాలు ఇస్తూ వెళ్తున్న వారిని చాలామందిని పోలీసులు అరెస్టు చేయటం అరుదైన దృశ్యంగా ఢిల్లీ వీధుల్లో ఆవిష్కరించబడింది! ఈ మధ్య కాలంలో యువత అంతగా బరితెగించి ప్రతిఘటించటం, చుట్టూ కమ్ముకుంటున్న నిరాశను, భవిష్యత్తు అయోమయంగా మారటాన్ని ప్రతిబింబించినట్లయింది. విద్యార్థుల చట్టోల్లంఘన పర్వం ప్రభుత్వానికి కొత్త పాఠాలను నేర్పినట్లయింది. 'నీట్' పరీక్షల ప్రహసనం కేవలం పెల్లుబుకుతున్న లావా పైకి రావటాన్ని మాత్రమే చూపించింది! ధర్మేంద్ర ప్రధాన్, మంత్రిగా రాజీనామా చేయటం వల్ల మొత్తం ప్రహసనానికి తెరపడ్డట్లు కాదేమో! ఉద్యోగాలు చాలా తక్కువ సంఖ్యలో వుంటున్న దశలో ఎంట్రెన్స్ పరీక్షలు తక్కువగా వున్న, ఆ ఉద్యోగాలు ఎంతమంది భవిష్యత్తులో కచ్చితంగా దక్కించుకోగలరో తేల్చటానికే! యువకుల ఆశాకిరణం 'పేపర్ల' లీక్‌తో 'టప్' ఆగినట్లయింది! ఆగిపోని రీతిలో అనేక లీక్‌లు దేశమంతటా సంభవిస్తుంటే దానికి కారణంగా అవినీతి కరాళనృత్యం కనపడింది. 20 లక్షల మంది (దాదాపు) నీట్ టెస్టును చాలా రోజులు కష్టపడి పగలనకా రేయనకా చదివి పరీక్ష రాసిన తర్వాత అది చెల్లదని అంటే విద్యార్థుల కడుపుల్లోంచి అగ్ని ఉబికి ఉబికి పైకొచ్చి ఉద్యమంగా మారింది! మళ్ళీ పరీక్ష రాయాలి! అదీ వారి స్కూల్ పరీక్షలు జరుగుతున్నప్పుడే అంటే విద్యార్థి లోకానికి ఆందోళన తప్ప మరో మార్గం ఏముంది? ఎంతో మంది విద్యార్థులు అపరిస్థితిని తట్టుకోలేకపోయారు! పోలీసులు సరియైన అవగాహన లేకుండా ప్రొటెస్టులు జరుగుతున్న ప్రాంతాలకు గుంపులుగా చేరకుండా వుండటానికి బలప్రయోగం చేయటం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది! ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణిచివేయటం సాధ్యం కాదని భావించిన తర్వాతనే క్రిందికి దిగివచ్చి దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టింది. ఆ చర్యలు మొదటి దశలోనే 'లీక్' అని తెలిసినప్పుడే తీసుకున్నట్లయితే పరిస్థితి యింతదాకా వచ్చేదే కాదు! కాక్రోచ్ పార్టీ భీష్మించుకొని కూర్చోవటంతో విధిలేక తలవంచే పరిస్థితి ప్రభుత్వం తెచ్చుకోవటం దయనీయంగా మారింది! రాజకీయ పార్టీలు ఈ అసాధారణ ఉద్యమాన్ని హైజాక్ చేయ ప్రయత్నించినా, వారికి సాధ్యం కాలేదు! 'సొమ్ము ఒకడిది సోకు ఒకడిది' అన్న రీతిలోఈ పార్టీలు 'క్రెడిట్' తీసుకోవాలని శతవిధాలా ప్రయత్నించినా విఫలం చెందక తప్పలేదు! కత్తి విడిచి సాము చేయటం ఈపార్టీలకు అలవాటయింది. సమస్యలను పరిష్కరించటం మానేసి నిప్పులను ఎగదోయటం అన్ని పార్టీలకు ఆనవాయితీగా మారటం దురదృష్టకరం! అహింసతో స్వాతంత్ర్యం సాధించుకున్న ఈ దేశం క్రమేపీ హింసకు అనేక ఘటనలల్లో స్థానం ఇవ్వటం శోచనీయం! విద్యార్థులు అదుపు తప్పితే అల్లరి చిల్లరి పనులు చేస్తారు! మన ఇండ్లలో గూడా పిల్లల అల్లరి చేష్టలు చూస్తునే వుంటాం! తల్లిదండ్రులు ఆ చేష్టలు శ్రుతిమించినప్పుడు హద్దుల్లో పెట్టగలరు! ఆ నేర్పు ప్రభుత్వాలు నేర్చుకోవాలి! కరుడుగట్టిన అల్లరి మూకలను అణిచివేసే ధోరణిలోనే సహేతుకంగా ఆందోళనకు దిగిన యువతను విద్యార్థులను, అదుపు చేయాలని ప్రయత్నించటం సరికాదు! ఆ విధంగా ఢిల్లీ పోలీసులు చేసారన్న ఆరోపణలు ఊపిరి పోసుకోవటం వల్ల, ఆందోళనకారులు ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనలకు సానుభూతి లభించింది. అందుకే మిడతల యుద్ధం విజయవంతంగా ముగిసింది! కాక్రోచ్ పార్టీ ఈ విజయాన్ని ఆధారం చేసుకొని రాజకీయాల్లో జొరబడితే దేశంలో వున్న అన్ని పార్టీల మాదిరే మిగులుతుంది. ప్రత్యేకత పేరుకు మాత్రమే కాదు లక్ష్యానికి వున్నప్పుడే విజయం చీమల దండుకైనా దక్కుతుంది. ●

# సవాళ్లను అధిగమిస్తేనే సాంకేతికంగా ముందడుగు

వి. వీరప్ప

రక్షణ, టెలికాం, ఆటోమొబైల్స్, ఏఐ, ఆరోగ్య సంరక్షణ... ఇలా నేడు అన్నింటికీ సెమీకండక్టర్లు ప్రాణావసరాలుగా మారాయి. ఆధునిక సాంకేతిక జగత్తుకు మెదడుగా, 21వ శతాబ్దపు చమురుగా అవి గుర్తింపు పొందాయి. వాటి తయారీపై ఆలస్యంగా దృష్టిసారించిన ఫలితంగా ప్రస్తుతం దేశానికి కావాల్సిన చిప్లలో 90శాతానికి పైగా దిగుమతులే దిక్కవుతున్నాయి. కొవిడ్ సమయంలో సరఫరాలు స్తంభించి పరిశ్రమలు కుదేలయ్యాయి. ఈ దురవస్థను తప్పించేందుకు చిప్లను స్థానికంగానే డిజైన్ చేసుకోవడంతోపాటు తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ తదితరాల్లో స్వావలంబన సాధించేందుకు ఇండియా నడుం కట్టింది. అందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆదిలోనే సంక్లిష్ట చిప్ల జోలికి వెళ్లకుండా దేశ విస్తృత ప్రయోజనాల రీత్యా వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని నీతి ఆయోగ్ రోడ్మ్యాప్ ఇటీవల సూచించింది. ఈ క్రమంలోనే గుజరాత్లోని సానంద్లో జపాన్, థాయ్లాండ్ సంస్థల సహకారంతో సిద్ధమైన కర్మాగారం. ఇది గడిచిన నాలుగు నెలల వ్యవధిలో పట్టాలకెక్కిన మూడో సెమీకండక్టర్ పరిశ్రమ కావడం విశేషం. ఏడాదికి 20కోట్ల చిప్లతో మొదలుపెట్టి, రాబోయే రోజుల్లో కొత్త ప్లాంటు తయారీ సామర్థ్యాన్ని 500 కోట్లకు తీసుకెళ్లాలన్నది లక్ష్యం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఇక్కడి నుంచి విదేశాలకూఎగుమతులు సుసాధ్యమై 'మేకిన్ ఇండియా' ప్రస్థానం మరో మెట్టుకు చేరుతుంది! దేశీయంగా సెమీకండక్టర్ల వినియోగం ప్రస్తుతంతో పోలిస్తే, 2030 నాటికి రెట్టింపవుతుందని అంచనా. పీఎల్ఐ వంటి పథకాల కారణంగా మొబైళ్లతయారీలో ఇండియా ప్రపంచంలోనే రెండోస్థానానికి చేరింది. ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి సైతం కొన్నేళ్లుగా జోరందుకుంది. దాంతో సెమీకండక్టర్ల అవసరం అధికమైంది. వాటి




కోసం చైనా, తైవాన్, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. గడిచిన తొమ్మిదేళ్లలో సెమీకండక్టర్ ఉత్పత్తులకు భారతావని 15వేల కోట్ల డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ధారపోసింది. ఈ పరాధీనత లోంచి బయటపడేందుకు ఇప్పటిదాకా రూ.1.64 లక్షల కోట్ల విలువైన 12 సెమీకండక్టర్ తయారీ ప్రాజెక్టులకు ఇండియా ఆమోదం తెలిపింది. డిజైన్ అనుసంధానిత ప్రోత్సాహక పథకం కింద 24 చిప్ రూపకల్పన ప్రాజెక్టులకూ ఊతమిస్తోంది. జపాన్, నెదర్లాండ్స్ వంటి దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో ముడిసరకులు, యంత్రాల సరఫరాలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటోంది. అందులో భాగంగానే అమెరికా నేతృత్వంలోని భిప్యాక్స్ సిలికాఖిలోనూ భాగమైంది. ఇలా ఈ రంగంలో ఆత్మనిర్భరత కోసం ప్రణాళికాబద్ధంగా కృషి జరుగుతున్నప్పటికీ, ఇండియా అధిగమించాల్సిన సవాళ్లూ కొన్ని ఉన్నాయి! మైక్రో చిప్ల తయారీకి నిరంతరం విద్యుత్, నీటి లభ్యత తప్పనిసరి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశీయంగా మౌలిక వసతులు పాదుకొనాల్సి ఉంది. ప్రపంచవ్యాప్త చిప్ డిజైనర్లలో 20శాతం భారతీయులే అయినప్పటికీ వాటి తయారీలో పనిచేయగలిగిన సాంకేతిక నిపుణుల లేమి వేధిస్తోంది. సెమీకండక్టర్లకు అత్యవసరమైన ముడిసరకుల కోసమూ విదేశాల వైపు చూడాల్సి వస్తోంది. ఈ కీలక రంగాన్ని ఏలుతున్న దేశాలతో పోలిస్తే మన దగ్గర పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తక్కువగా ఉంటున్నాయి. కండక్టర్ల సరఫరా గొలుసులో ప్రపంచానికి విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదగాలన్న భారత్ కల నెరవేరాలంటే వీలైనంత వేగంగా సంబంధిత ఆవరణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలి. 2032 నాటికి విశ్వవ్యాప్తంగా 10 లక్షల మంది సెమీకండక్టర్ నిపుణులకు కొరత ఏర్పడుతుందన్న విశ్లేషణలను గమనంలో ఉంచుకుంటూ ఆ మానవ వనరుల సృష్టిపైనా సమధికంగా దృష్టిసారించాలి!. ●

# జీవ వైవిధ్య పరిరక్షణతోనే మానవాళి మనుగడ

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వ్యాప్తంగా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహిస్తారు. పులుల ఆవాసాల రక్షణ, విస్తరణకు ప్రోత్సహించడానికి, పులుల పరిరక్షణపై అవగాహన ద్వారా పొందే మద్దతుకోసం 2010 నుండి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో జరిగిన పులుల సంరక్షణ సమావేశంలో ఈ అంతర్జాతీయ పులుల దినోత్సవం ప్రకటించబడింది. పులుల సహజ ఆవాసాలను పరిరక్షించే విధంగా వ్యవస్థను ప్రోత్సహించడం, పులి సంరక్షణగురించి ప్రజలలో అవగాహన పెంచి వారినుండి సహాయాన్ని అందుకోవడం ఈ దినోత్సవ ముఖ్యోద్దేశ్యం. ఈ దినాన్ని పురస్కరించుకొని పులుల సంరక్షణ, వాటి సంతతి వృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి ప్రణాళికలు ప్రభుత్వాలు సిద్ధం చేసుకుంటాయి. పులులు ఎక్కువ కాలం తమ తల్లిదండ్రులపై ఆధారపడవు. తమ కాళ్లపై తాము నిలబడటానికి ఇష్టపడతాయి. రెండేళ్లు కాగానే విడిగా వెళ్లిపోతాయి. మగ పులులకు మూడేళ్ల తర్వాత సెక్సువల్ మెచ్యూరిటీ వస్తుంది. ఆడ పులులకు నాలుగేళ్ల తర్వాత అది వస్తుంది. పులులు 20 ఏళ్ల దాకా బతుకుతాయి. పులి పిల్లలు పుట్టినప్పుడు వాటికి కళ్లుకనపడవు. తమ తల్లినుంచి వచ్చే వాసనను బట్టీ తల్లిని అనుసరిస్తాయి. పులి పిల్లల్లో సగం ఆకలితో చనిపోతాయి. చలికి వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక చనిపోతాయి. ప్రతీ పులికీ చారలు వేర్వేరుగా ఉంటాయి. మనుషుల్లో ఏ ఇద్దరికీ ఒకేలాంటి వేలిముద్రలు ఉండనట్లే ఏ రెండు పులులకూ ఒకేరకమైనచారలు ఉండవు. పులులు బాగా ఈదగలవు. ఆహారం కోసం చాలా దూరం ఈదుతూ వెళ్లగలవు. సింహాలు గుంపులుగా జీవిస్తాయి. పులులు విడివిడిగా జీవిస్తాయి. ప్రతీ పులీ తన కంటూ ప్రత్యేక ప్రాంతాన్ని ఎంచుకుంటుంది. బాగా పెరిగిన పులి 140 కేజీల నుంచి 300 కేజీల దాకా ఉంటుంది. పులులు గంటకు 65 కిలోమీటర్ల వేగంతో పరుగెడతాయి. పులుల పాదాల కింద మెత్తగా ఉండి, నడిచేటప్పుడు శబ్దం రాదు. వేటాడేటప్పుడు నిశ్శబ్దంగా వచ్చి పరుగెడతాయి. పులిని, 1986 నుండి ఐయుసిఎన్ రెడ్ జాబితాలో అంతరించిపోతున్న జాబితాలో చేర్చారు. గత 100 సంవత్సరాలలో, 97 శాతం అడవి పులులను ప్రపంచం కోల్పోయింది. 20వ శతాబ్దపు ప్రారంభంలో పులి లెక్కింపులో లక్ష ఉన్నట్లు తెలగా, 2013లో 3274కు తరువాత 2014లో 3200 తగ్గిపోయాయి. మానవులు నగరాల విస్తరణ, వ్యవసాయం తదితర కారణాలవల్ల పులుల93శాతం మేర సహజ ఆవాసం కోల్పోయాయి. అంతేకాకుండా, మానవ వన్యప్రాణి సంఘర్షణ, వాతావరణ మార్పుకూడా పులులజనాభా క్షీణతకు, మనుగడ నష్టానికి కారణాలు. ప్రపంచ దేశాల్లో, అత్యధిక సంఖ్యలో 2226 పులులతో భారత దేశం ఉంది. భారత దేశం తర్వాత 500పులులతో మలేషియా అనుసరి



స్తున్నది. 2004 లో 440 పులులతో మూడో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్, టైగర్ సెన్సస్ 2015లో 106కు పులుల జనాభా క్షీణతను చవిచూసింది. పులులు అంతరించిపోకుండా రక్షించడానికి 2010లో రష్యాలోని సెయింట్‌పీటర్స్ బర్గ్ టైగర్ సమ్మిట్‌వద్ద పులుల దినోత్సవం నిర్వహించారు. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఎన్‌టీసీఏ) దేశవ్యాప్తంగా పులులను లెక్కిస్తుంది. రాష్ట్రాల్లోని అన్ని అడ వుల్లో నాలుగేళ్లకోసారి ఈ గణన జరుగుతుంది. వన్యప్రాణుల గణాంక సేకరణ దేశంలోని అన్ని అటవీ ప్రాంతాల్లో జరుగుతుంది. అటవీ సిబ్బంది రోజూ సుమారు నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి, పులులతో పాటు ఇతర వన్యప్రాణుల ఆధారాలను అన్వేషిస్తారు. 2014 నుండి ఎన్‌టీసీఏ వన్యప్రాణుల లెక్కింపులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలను వాడుతోంది. వీటిని వన్యప్రాణులు తిరిగే ప్రదేశాల్లో ఎదురెదురుగా చెట్లకు అమరుస్తారు. ఒకటి నుంచి రెండు అడుగుల ఎత్తులో ఉంచే ఈ కెమెరాలు 24 గంటలూ వాటంతటవే పనిచేస్తాయి. చిత్రాల్లోని జంతువుల ఎత్తు, చారలు, నడకను పరిగణనలోకి తీసుకొని వాటి సంఖ్యను లెక్కగడతారు. భారత దేశంలో దాదాపు 3వేల పులులున్నాయని లెక్కలు చెపుతున్నాయి. పులుల ఆవాసానికి ప్రపంచంలోనే భారతదేశం అనువైన ప్రాంతం. దేశంలో క్రమంగా పులుల జనాభా పెరిగిపోతోంది. 2006లో1,411, 2010లో 1,726, 2014లో 2,226 పులులుండగా, 2018లో ఆసంఖ్య 2,967కు చేరుకుంది. ప్రతి నాలుగేండ్లకు ఒకసారి పులుల గణనచేపడుతారు. 2014లోఅవిభాజ్య ఆంధ్రప్రదేశ్లో పులుల సంఖ్య 68కాగా, 2018 నాటికి ఏపీ, తెలంగాణల్లో కలిపి వీటి సంఖ్య74కు చేరింది. ఏపీలో 48, తెలంగాణలో 26పులులున్నట్లు రికార్డులు చెపుతున్నాయి. దేశంలోని అతిపెద్ద అభయారణ్యాల్లో ఒకటైన నాగార్జునసాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యంలో 2006లో 95 పులులుండేవి. 2010లో వీటి సంఖ్య 72కు, 2014 నాటికి 68కి తగ్గింది. అయితే, 2018 లెక్కల్లో ఈ సంఖ్య పెరిగింది. రాచఠీవికి పెట్టింది పేరైన పులి భారతదేశ జాతీయ జంతువు. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించిన భారత్ మరుసటి ఏడాది టైగర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలుపడేలా చట్టాలు తెచ్చింది. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ అడవుల్లో 26 పులులు ఉన్నట్లు తేలింది. గతంలో 20 పులులు ఉన్నట్లు ఓ అంచనా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ చేపట్టిన అటవీ రక్షణ చర్యలవల్లే పులుల సంఖ్య పెరిగేందుకు దోహద పడ్డాయి. తెలంగాణలో పులులసంఖ్య పెంచే కార్యక్రమాలను రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో కవ్వాల్, ఆమ్రాబాద్ రెండు అభయారణ్యాలున్నాయి. రాబోవు రోజుల్లో పులుల అభివృద్ధికి మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడమే కాకుండా వాటి రక్షణ కోసం వ్యవస్థను కట్టుదిట్టం చేయడానికి, చర్యలు తీసుకుంటున్నారు. పులి చర్మం, గోళ్ల కోసం వాటిని చంపే వారి పట్ల శిక్షలను కఠిన తరం చేసేందుకు కార్యాచరణ అనుసరిస్తున్నారు. ●

# విద్యార్థుల నిరసనల హింసపై సిట్




**రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో విచారణ: సుప్రీం కోర్టు**

**కేంద్రం, ఢిల్లీ, బీహార్, బెంగాల్, అసోం, కేరళం రాష్ట్రాలకు నోటీసులు**

**నేర చరిత్ర లేని నిర్బంధిత మైనర్ల విడుదలకు ధర్మాసనం ఆదేశం**

**న్యూఢిల్లీ, జులై 28:** గతవారం దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా విద్యార్థులు, పోలీసు అధికారులు గాయపడ్డారన్న ఆరోపణలపై నిష్పక్షపాతమైన, స్వతంత్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విచారణ కోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని కోర్టు సూచించింది. ఈ విషయంపై తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఢిల్లీ, అసోం, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. నిరసనలలో పాల్గొన్నందుకు అరెస్టు చేయబడిన లేదా నిర్బంధించబడిన, ఎలాంటి నేర చరిత్రలేని 18 యేళ్ల లోపు పిల్లల విడుదలకు సంబంధించి కోర్టు ముఖ్యంగా పలు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అన్ని సిసిటివి ఫుటేజ్, డ్రోన్ ఫుటేజ్, బాడీవోర్న్ కెమెరా రికార్డింగ్‌లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్, పిసిఆర్ లాగ్‌లను భద్రపరచాలని కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా, నిరసనకారుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటాను భద్రపరచాలని, ప్రస్తుతానికివాటిని బహిరంగంగా వెల్లడించకూడదని రాష్ట్రాలను కోర్టు ఆదేశించింది. నిరసనకారుల వ్యక్తిగత డేటా లేదా వివరాలను ప్రచురించకూడదు. విద్యార్థులకు ఎలాంటి నేర చరిత్ర లేనంత వరకు, నిరసనల విషయంలో వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని కూడా కోర్టు ఆదేశించింది. జులై 20నుంచి దేశవ్యాప్తంగా పరీక్షాపత్రాల లీకేజీలు, ఇతర వ్యవస్థాగత అవకతవకలకు వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ దాఖలైన పలు పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచా రించింది. గాయపడిన పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధుల తరఫున దాఖలైన పిటిషన్లను కూడా కోర్టు విచారించింది. "పిటిషనర్లు చేసిన ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పక్షపాత విచారణకు ఆస్కారం కల్పిస్తున్నాయి. అటువంటి విచారణ ఆరోపణలను సమంగ్రవంతంగా పరిష్కరిస్తుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్లను తదుపరి విచారణ ఆగస్టు 3కు వాయిదా వేసింది.

## నీట్ ఇడబ్ల్యుఎస్ కోటాపై సుప్రీం కీలక ఆదేశాలు

**వార్షిక కుటుంబ ఆదాయం సహేతుకంగా లేదని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ, జులై 28:** నీట్ ప్రవేశాల కోసం ఆల్ ఇండియా కోటా (ఎఐక్యూ)లో ఆర్థికంగా బలహీన వర్గాల (ఇడబ్ల్యుఎస్) రిజర్వేషన్ కింద అర్హతను నిర్ణయించడానికి నిర్దేశించిన రూ.8 లక్షల వార్షిక కుటుంబ ఆదాయ ప్రమాణాన్ని సవాలు చేయడాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ పరిమితి ప్రాథమికంగా సహేతుకమైన ప్రమాణంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. పాండే కమిటీ సిఫార్సుల మేరకు రూపొందించిన రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితి, ప్రమాణాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను మంగళవారం జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరథేలతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా నీట్ ఈడబ్ల్యుఎస్ కోటా ఆదాయ పరిమితిపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ ఆలిండియా కోటాలో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల అర్హతకు నిర్దేశించిన రూ.8 లక్షల వార్షిక కుటుంబ ఆదాయ పరిమితి ప్రాథమికంగా సమంజసంగానే ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏ ప్రాతిపదికన మీరు దీన్ని సవాలు చేస్తున్నారు? అని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. పాండే కమిటీ సిఫార్సు చేసిన మార్పులను కేంద్ర ప్రభుత్వం ఇంకా పూర్తిగా అమలు చేయలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది తన్వీ దూబే కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దేశవ్యాప్తంగా దాఖలైన ఇలాంటి పిటిషన్లన్నింటినీ క్రోడీకరించి, వాటిలోని ప్రధానాంశాలతో ఒక సమగ్రమైన చార్ట్ తయారు చేయాలని ధర్మాసనం తన్వీ దూబేను ఆదేశించింది. తదుపరి విచారణను కోర్టు ఆగస్టు 11వ తేదీకి వాయిదా వేసింది.

## కోర్టు విచారణ విడియోలను అనుమతి లేకుండా సోషల్ మీడియాలో పోస్టు చేస్తే కఠిన చర్యలు: సుప్రీంకోర్టు హెచ్చరిక

**న్యూఢిల్లీ, జులై 28:** సుప్రీంకోర్టు లేదా సంబంధిత హైకోర్టు నుండి ముందస్తు అనుమతి లేకుండా, కోర్టు విచారణల ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియా, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేయడం, రీపోస్ట్ చేయడం, అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం లేదా నిల్వ చేయడాన్ని సుప్రీంకోర్టు నిషేధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వును జారీ చేసింది. అయితే, ఈ ఉత్తర్వు న్యాయవరమైన విచారణల నిష్పక్షపాతమైన, కచ్చితమైన వార్తా నివేదనను ప్రభావితం చేయదని కోర్టు స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో ఎడిట్ చేసి, కత్తిరించిన వీడియోలను ప్రచారం చేయడం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయబడిన కోర్టు విచారణలను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలకు సంబంధించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై విచారణ జరుపుతూ, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి మరియు వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అయితే, మీడియా సంస్థలకు మాత్రం కోర్టు కేసులపై రిపోర్టింగ్ చేయడంపై ఎలాంటి ఆంక్షలు ఉండవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## ఎక్కువ కెఫిన్ ఉన్న పానీయాలు ఎనర్జీడ్రింక్స్‌గా బ్రాండింగ్ చేయొద్దు: ఎఫ్ఎస్ఎస్ఎఐ హెచ్చరికలు

**న్యూఢిల్లీ,జులై 28:** అధిక కెఫిన్ కలిగిన పానీయాలను ఎనర్జీ డ్రింక్స్‌గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పెప్సీ, రెడ్ బుల్, మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి ఎనర్జీ డ్రింక్ అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. భారత్‌లో ఎనర్జీ డ్రింక్స్ పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని ఎఫ్ఎస్ఎస్ఎఐ పేర్కొంది. ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఎఐ సీఈఓ రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది.

# విద్యాశాఖ బాధ్యతలు జోషికి ఎలా ఇస్తారు?

**అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తికి ఆపదవి ఇవ్వడమా?: రాహుల్ ఫైర్**

**విద్యార్థులపై గన్స్ పేల్చమని ఆదేశించిందెవరు: ప్రియాంక**

**న్యూఢిల్లీ,జులై 28:** నూతన కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని విద్యాశాఖ మంత్రిగా నియమించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో ప్రధాని మోడీ ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగించిన నిర్ణయాన్ని ప్రశ్నించారు. దేశంలో యువత విద్యా వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేస్తోంది. ఎంతో మంది విద్యార్థినులు ఆందోళనల్లో పాల్గొన్నారు. వారిపై దాడులు జరిగాయి. అలాంటి సమయంలో అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిగా నియమించింది. అలాంటి వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అత్యాచార నిందితులకు రక్షణ కల్పించాలనే వ్యక్తే ఇప్పుడు భారత విద్యాశాఖ మంత్రి అని రాహుల్ గాంధీ ఆరోపించారు.



అంతేకాకుండా ప్రధాని మోడీ నిర్ణయంపై కూడా విమర్శలు చేశారు. ప్రధాని స్పందన చాలా విచిత్రంగా ఉంది. ఆయన మంత్రి వర్గంలో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరినైనా ఎంపిక చేసుకోవచ్చు. కానీ అత్యాచార నిందితులను రక్షించే వ్యక్తినే ఎంపిక చేశారు. ఇది నిజంగా ఆశ్చర్యకరమైన విషయమని అన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం లేదా ప్రహ్లాద్ జోషి నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.

**పార్లమెంటులో జోషిపై ప్రియాంక సంచలన విమర్శలు:** ఇదిలా ఉంటే పార్లమెంటులో నీట్ అక్రమాల కట్టడి బిల్లుపై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గర్భవతిపై అత్యాచారం చేసిన నిందితుల్ని ఆయన సమర్థించారని ఆరోపించారు. అత్యాచార నిందితులకు బెయిల్ వస్తే ఆయన ఆనందించారన్నారు. ఈ వ్యాఖ్యల్ని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు తీవ్రంగా ఖండించారు. ప్రియాంకా గాంధీ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇదిలాఉంటే, ప్రధానిపై కూడా ప్రియాంకాగాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని కెమెరా యాంగిల్‌కాదు, మనసు యాంగిల్ మార్చుకోవాల న్నారు. ఇన్‌స్టాగ్రామ్ క్లిప్ కోసం కెమెరా యాంగిల్ మార్చినంత మాత్రాన జెన్ జీ నమ్మకాన్ని గెలుచుకోలేరని అన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే 47, పెల్లెట్ గన్స్ కాల్చుమని ఎవరు ఆదేశించారని ప్రధాని మోడీని, అమిత్ షాను ప్రశ్నించారు.

# బీహార్, అసోంలో నీట్ అల్లర్లకేసులు ఎత్తివేత

**ఢిల్లీ నిరసనలపై ఎన్‌హెచ్‌ఆర్‌సి సీరియస్**

**పాట్నా,గువాహతి,జులై 28:** పరీక్షా పత్రం లీకేజీ అవకతవకలపై ఆందోళనలు చేపట్టిన విద్యార్థులకు ఊరట లభించింది. నిరసనకారులపై నమోదైన కేసులను బీహార్, అస్సాం ప్రభుత్వాలు ఉపసంహరించుకున్నాయి. అరెస్టయిన వారిని విడుదల చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి చర్యలు ఉండవని నిర్ణయించాయి. నీట్ ఆందోళనలకు సంబంధించి నిరసనకారులపై నమోదు చేసిన కేసులన్నింటినీ ఉపసంహరించుకుంటామని, వివిధ ఆరోపణల కింద జైలు పాలైన వారిని విడుదల చేస్తామని బీహార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు ముందు జరిగిన నిరసనల్లో పాల్గొన్న ఏ వ్యక్తిపైనా ప్రభుత్వం ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోదని పేర్కొంది. అలాగే అస్సాంలో 26 నాటికి నమోదైన 5 కేసుల్లో అరెస్టైన 13 మందితో పాటు, ఇరు రాష్ట్రాల్లో అదుపు లోకి తీసుకున్న నిరసనకారులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో చర్చించిన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు స్పష్టమైన హామీ ఇచ్చారు. అస్సాం, బీహార్ తరహాలోనే రాజస్థాన్‌లోనూ విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని తెలిపినట్లు సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు.



**ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్:** నీట్‌యూజీ పరీక్ష పేపర్ లీకేజీపై ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో విద్యార్థులు చేపట్టిన నిరసనలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం పట్ల జాతీయ మానవహక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు లాఠీచార్జ్ ఘటనను సుమోటోగా స్వీకరించింది. ఘటన సమయంలో సీసీటీవీ ఫుటేజ్ అందజేయాలని సంబంధింత అధికారులను ఆదేశించిది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది.

# ప్రధాని కోసం ధర్మేంద్ర ప్రధాన్ బలయ్యారు

**లోక్‌సభలో ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్**

**న్యూఢిల్లీ,జులై 28:** పార్లమెంట్‌లో మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై వాడీవేడి చర్చ నడుస్తోంది. ప్రతిపక్షాలు బీజేపీని విమర్శిస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రధాన్‌ను తొలగించి ప్రధాన మంత్రిని కాపాడారు అంటూ సెటైర్లు వేశారు. ప్రధాని కోసం ధర్మేంద్ర ప్రధాన్‌ను బలిపశువు చేసినట్లు ఆరోపించారు. విద్యార్థి ఉద్యమం ప్రభుత్వం మెడలు వచ్చిందని అన్నారు. రాజీనామా తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంట్‌కు వచ్చినప్పుడు బీజేపీ ఎంపీలు ఘనంగా స్వాగతించాయని, ఆయన తొలగింపు




ఎంత పెద్ద సంక్షోభం నుంచి బయటపడేసిందో ఊహించండి అని అఖిలేష్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని తల వంచేలా చేసిన యువత ధైర్యసాహసాలను అఖిలేష్ ప్రశంసించారు. ప్రపంచం వంగుతుంది, దానిని వంచే వ్యక్తి ఉండాలి. ప్రభుత్వం ఎప్పటికీ తలవంచదనను కుంది, కానీ యువత ఐక్యత ముందు ప్రభుత్వం వెనక్కి తగ్గి మంత్రితో రాజీనామా చేయించింది అని అన్నారు. తల్లిదండ్రుల మద్దతు పొందిన తొలివిద్యార్థి ఉద్యమం ఇదే అని ఆయన అన్నారు. ప్రభుత్వం భయపడినప్పుడే డిమాండ్లను అంగీకరిస్తుందని, రైతుల ఉద్యమ సమయంలో ఎన్నికలు సమీపించడంతో మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థ, యూనివర్సిటీలనను దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. విద్యావ్యవస్థకు ఒకే రంగు వేయాలని బీజేపీ ప్రయత్నించిందని, అందుకే విద్యార్థుల్లో ఆగ్రహం పెరిగిందని, భారీ ఉద్యమంగా మారిందని, చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ కూడా వెనక్కి తగ్గాల్సి వచ్చిందని అన్నారు. దళితులు, వెనకబడిన వర్గాల ఉద్యోగ హక్కుల్ని ప్రభుత్వం హరిస్తుందని ఆరోపించారు.

# కృత్రిమ సూర్యుడి కోసం అతిపెద్ద అయస్కాంతం ఆవిష్కరించిన చైనా

**బీజింగ్, జులై 28:** సమస్త జీవకోటికి ఆధారం, గ్రహాల్లో ప్రధానం సూర్యుడు. అలాంటి సూర్యుడిని కృత్రిమంగా సృషించాలని చైనా భావిస్తున్నది. దీనిలో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ ఫ్యూజన్ అయ స్కాంతాన్ని రూపొందించింది. విజయవంతంగా పరీక్షించింది. దీనిలో ఉన్న టెక్నాలజీ ప్రపం చంలోని విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఉప యోగపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు. చైనా కృత్రిమ సూర్యుడి ప్రాజెక్టులో భాగంగా 2030 నాటికి ఫ్యూజన్ ద్వారా విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద 582 టన్నులు గల అయస్కాంతాన్ని రూపొం దించింది. అణు సంలీనం ద్వారా అపరిమితమైన శక్తిని ఉత్పత్తి చేయడానికి ఈ అతిపెద్ద అయ స్కాంతం కీలకం. దీన్ని విజయవంతంగా పరీక్షించి కృత్రిమ సూర్యుడిని సృష్టించాలనుకున్న చైనా లక్ష్యానికి ముందడుగు పడినట్లు అయ్యింది. 21 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు గల 'డి' ఆకారంతో ఈ అయస్కాంతాన్ని చైనీస్‌అకాడమీకి చెందిన ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ అభివృద్ధి చేసింది.

**కృత్రిమ సూర్యుడు అంటే?** అచ్చం సూర్యుడి లాగే పనిచేసే న్యూక్లియర్ ఫ్యూజన్ రియాక్టర్‌ను కృత్రిమంగా నిర్మించడం. సూర్యుడిలో 100 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద ప్రతిక్షణం కొన్ని కోట్ల హైడ్రోజన్ అణువులు సంలీనం



చెంది కార్బన్ డయాక్సైడ్ రహిత అపారమైన శక్తి విడుదలవుతుంది. ఇలాంటి ప్రక్రియనే భూమిపై సృష్టించి విద్యుత్‌గా మారిస్తే స్వచ్ఛమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన శక్తిని పొందవచ్చు.

# భార్యను హత్యచేసి అత్తమామలకు విడియో కాల్‌లో చూపించిన భర్త

**భాగల్‌కోట్,జులై 28:** కర్ణాటకలో ఒక కిరాతక ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యను అతి దారుణంగా హత్య చేయడమే కాకుండా, ఆమె ప్రాణాలు విడుస్తున్న దృశ్యాలను నిందితుడు వీడియో కాల్ ద్వారా అత్తమామలకు చూపించాడు. బాగల్‌కోట్ జిల్లాలో వెలుగుచూసిన ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. వివరాల్లోకి వెళితే, బిళగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గలగలి గ్రామానికి చెందిన ప్రవీణ్ జిగలూర్, భాగ్యశ్రీ (23) దంపతులు. భార్యపై అనుమానంతో ప్రవీణ్ తరచూ గొడవ



పడేవాడు. భర్త వేధింపుల తాళలేక భాగ్యశ్రీ రెండు నెలల క్రితమే పుట్టింటికి వెళ్లిపోయింది. గతాన్ని మర్చిపోయి అన్యోన్యంగా ఉందామని నమ్మబలికిన ప్రవీణ్ ఆదివారం ఆమెను తిరిగి తన ఇంటికి తీసుకువచ్చాడు. ఇంటికి వచ్చిన అదే రోజు సాయంత్రం ఆమెపై దాడి చేసి అత్యంత దారుణంగా హత్య చేశాడు. అంతటితో ఆగకుండా, ఆమె మరణిస్తున్న చివరి క్షణాలను మొబైల్‌లో రికార్డ్ చేయడమే కాకుండా, నేరుగా ఆమె తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి చూపించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆ వీడియోను మరికొందరికి కూడా షేర్ చేసినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకితీసుకున్నారు. తల్లిదండ్రులు ఆవేదన చూసి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




# ఐరోపాను నవంబరు దాకా దహించనున్న కార్చిచ్చు

**స్పెయిన్‌లో లక్షా 25 వేల ఎకరాలకుపైగా అటవీప్రాంతం అగ్నికి ఆహుతి**

**ప్యారిస్, జులై 28:** ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఫ్రాన్స్‌లో 420 చదరపు కిలోమీటర్లకు పైగా,స్పెయిన్‌లో 1,25,000 ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. గిరాండ్ ప్రాంతంలో కోట్ల విలువ చేసే 240కిపైగా విలాసవంతమైన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఫ్రాన్స్‌లో ఈ భారీ కార్చిచ్చు నవంబరు మొదటి వారం వరకూ కొనసాగవచ్చని యూరోపియన్ యూనియన్ అధికారులు హెచ్చరించారు. ఐరోపాలో అగ్నికీలల వల్ల ఈ యేడాది అత్యంత ఘోరమైన సంవత్సరాలలో ఒకటిగా నిలిచిపోతుందన్నారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతుండడంతో ఫ్రాన్స్, స్పెయిన్, గ్రీస్‌లలో కార్చిచ్చుల ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

**అగ్ని సుడిగుండాలు వచ్చే ప్రమాదం**

శుక్రవారం సాయంత్రం ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లో ప్రారంభమైన ఈ అగ్నికీలలు పలు నగరాలకు వేగంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఫ్రాన్స్‌పై భారీ పొగ మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో వీటిని ఆర్పడం సవాలుగా మారింది. కార్చిచ్చును ఎదుర్కోవడానికి యూరోపియన్ కమిషన్ సమన్వయంతో ఫ్రాన్స్‌కు ఏడు అగ్నిమాపక విమానాలు, నాలుగు హెలికాప్టర్లు, స్పెయిన్‌కు ఆరు విమానాలు, మూడు అగ్నిమాపక బృందాలను పంపారు. భారీగాలులు, ఉరుములు, మెరుపులతో ఇవి అగ్ని సుడిగుండాలుగా మారే ప్రమాముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**రోడ్లపైకి జంతువులు :** మంటలు వేగంగా వ్యాపిస్తుండడంతో ఫ్రాన్స్‌లో సుమారు 2లక్షల మంది, స్పెయిన్‌లో లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అడవుల్లోని జంతువులు మంటల వేడిని తాళలేక రోడ్లపైకి పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పెంపుడు జంతువులను కూడా ప్రజలు బయటకు వదిలేస్తున్నారు. రాబోయే రెండు వారాల్లో పరిస్థితులు మరింత కఠినంగా ఉంటాయని వీటిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేట్ మెక్రాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. అగ్నికీలలు ఆర్పడానికి వేలమంది సిబ్బంది పనిచేస్తున్నారని, వందల సంఖ్యలో హెలికాప్టర్లతో నీళ్లు వెదజల్లుతున్నారని తెలిపారు. దేశంలోని అనేకప్రాంతాల్లో ప్రజలు గాలి కాలుష్యం సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

# రూ.52,676 కోట్ల పరిహారానికి అంగీకారం

**న్యూయార్క్, జులై 28:** తమ బేబీ పౌడర్, ఇతర టాల్క్ ఉత్పత్తులు అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పదివేల వ్యాజ్యాలను పరిష్కరించేందుకు 5.5 బిలియన్ డాలర్ల (రూ.52,676 కోట్లు) పరిష్కారానికి చేరుకున్నట్లు జాన్సన్ అండ్ జాన్సన్ తెలిపింది. ఈ పరిష్కారం ఫెడరల్ కోర్టులో ఏకీకృతం చేయబడిన సుమారు 69,000 కేసులను, రాష్ట్ర కోర్టులోని సంబంధిత కేసులను పరిష్కరిస్తుందని, ఇది మిగిలిన టాల్క్ క్లెయిమ్‌లలో 99.75శాతానికి సమానమని జె అండ్ జె తెలిపింది. దశాబ్దకాలంగా సాగిన కోర్టు పోరాటం తర్వాత ఇది ఒక మంచి పరిష్కారమని పేర్కొంటూ, వాదుల న్యాయ సంస్థలు ఈ ఒప్పందాన్ని ధ్రువీకరించాయి. టాల్క్ ప్రత్యేకంగా తమ అండాశయ క్యాన్సర్‌కు కారణమైందని నిరూపించగల వ్యక్తిగత వాదుల సామర్థ్యంపై ఒక ఫెడరల్ న్యాయమూర్తి సందేహం వ్యక్తం చేయడంతో,



సుదీర్ఘకాలంగా సాగుతున్న ఈ న్యాయ పోరాటంలో గత వారం జె అండ్ జె కోర్టు విజయాన్ని సాధించింది. టాల్క్ సురక్షితమైనదని, అందులో ఆస్బెస్టాస్ లేదని చెబుతూ, తమ టాల్క్ ఉత్పత్తుల వల్ల క్యాన్సర్ వస్తుందన్న ఆరోపణలను జె అండ్ జె ఖండించింది. ఈ కంపెనీ 2020లో అమెరికాలో టాల్క్ ఆధారిత బేబీ పౌడర్ అమ్మకాలను నిలిపివేసి, కార్న్‌స్టార్చ్ ఉత్పత్తికి మారింది. ఒక షెల్ కంపెనీ దివాలా ద్వారా వ్యాజ్యాలను పరిష్కరించడానికి జెఅండ్‌జె పదేపదే ప్రయత్నించగా, మూడేళ్లకు పైగా నిలిపివేసిన ఈ వ్యాజ్యం,మార్చి 2025లో తిరిగి ప్రారంభమైంది.

# సంక్షిప్త వార్తలు

## కేసుల భయంతో మాస్కులతో పాల్గొన్న విద్యార్థులు..





**న్యూఢిల్లీ,జులై 28:** నీట్‌యూజీ పేపర్ లీక్ వ్యవహారంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో కొత్త ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసు కేసులకు భయపడి చాలా మంది విద్యార్థులు మాస్కులు, కళ్లద్దాలతో తమ గుర్తింపును దాచుకుంటున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల నిఘానే దీనికి ప్రధాన కారణం. నిరసనలో పాల్గొన్న తమపై ఎఫ్ఐఆర్ నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్‌జారీ, విదేశీ విద్యఅవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

## మోడీ ఇన్‌స్టా విడియోలకు 105 మిలియన్ల ఫాలోయర్లు..



**న్యూఢిల్లీ,జులై 28:** ప్రధాని నరేంద్రమోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డులు సృష్టిస్తున్నారు. ఇటీవల, నీట్ పేపర్‌లీక్ వివాదం, నిరసనల సమయంలో ఆయన పోస్ట్ చేసిన వీడియో ఏకంగా మిలియన్ల కొద్దీ వ్యూస్ వచ్చాయి. ఈ వీడియో తర్వాత ప్రధానికి ఏకంగా 40 లక్షల మంది కొత్త ఫాలోవర్లు పెరిగారు. ఇప్పుడు మొత్తం ఆయన ఇన్‌స్టా ఫాలోవర్లు 105 మిలియన్లు (10.5కోట్లు)కు చేరుకుంది. కేవలం గత వారంరోజుల్లోనే నాలుగు మిలియన్ల మంది ఆయనను ఫాలో అవుతున్నారు. వారం క్రితం మోడీకి 101 మిలియన్ల(10.1కోట్ల) మంది ఫాలోవర్లు ఉండగా, ప్రస్తుతం ఇది 105 మిలియన్లను అధిగమించింది.

## విస్కాన్సిన్ రాష్ట్రాన్ని వణికించిన టోర్నడో..



**వాషింగ్టన్, జులై 28:** అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రాన్ని సోమవారం తీవ్రమైన టోర్నడో వణికించింది. ఈ టోర్నడో ధాటికి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దాంతో విస్కాన్సిన్‌తోపాటు అమెరికా మధ్య పశ్చిమప్రాంతంలోని పలు రాష్ట్రాల్లో 3.9లక్షల ఇళ్లకుపైగా విద్యుత్ సరఫరా కోల్పోయి నట్లు అధికారులు వెల్లడించారు. మెనాషా, యాపిల్‌టన్ నగరాలపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపిందని తెలిపారు. టోర్నడో ధాటికి ఇళ్ల పైకప్పులు ఎగిరిపో యాయి. భారీ వృక్షాలు నేలకూలాయి. మరోవైపు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 20 నిమిషాలపాటు టోర్నడో విధ్వంసం సృష్టించిందని అధికారులు తెలిపారు.

## అంతర్జాతీయ విద్యార్థులకు పిజి వర్క్ పర్మిట్ల తిరస్కరణ

**వాంకోవర్,జులై 28:** కెనడాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులతో సహా పలువురు అంతర్జాతీయ విద్యార్థుల పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్లు తిరస్కరణకు గురికావడం, దానికి నిరసనగా విద్యార్థులు ఆందోళనలు చేపట్టడంపై ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా స్పందించింది. విద్యార్థులు చదువుకునే సమయంలో పనిచేయడానికి వర్తించే నిబంధనలపై కీలక స్పష్టతనిస్తూ తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. స్టడీపర్మిట్ నిబంధనలను అతిక్రమించి అను మతి లేకుండా పనిచేయడం ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘించడమేనని ఐఆర్‌సీసీ స్పష్టం చేసింది.

## మైన్మార్‌లో సైబర్ నేరాలకు పాల్పడితే ఇక మరణశిక్షే..

**నాయ్‌పైథా,జులై 28:** మయన్మార్ పార్లమెంట్ ఆన్‌లైన్ స్కామ్ మోసాలపై ఉక్కుపాదం మోపేందుకు మంగళవారం ఒక నూతన చట్టాన్ని ఆమోదించింది. ఈ 'యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లు' ప్రకారం సైబర్ స్కామ్ సెంటర్లలో ప్రజలను అక్రమంగా బంధించినా, హింసించినా లేదా బలవంతంగా పనిచేయించినా మరణశిక్ష లేదా జీవిత ఖైదు విధించేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. రాజధాని నేపిడాలో ఉభయ సభల సంయుక్త సమావేశంలో ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర వేసినట్లు స్పీకర్ ఆంగ్ లిన్ ద్వే తెలిపారు.

## జమ్ముకాశ్మీర్‌లో ఇంటిపై పడిన బస్సు: 39 మందికి తీవ్ర గాయాలు

**శ్రీనగర్,జులై 28:** జమ్మూ కాశ్మీర్‌లోని గందర్‌బాల్ జిల్లా కంగన్ ప్రాంతంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న అమర్‌నాథ్ యాత్రికుల బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి నేరుగా ఓ ఇంటిపై పడిపోయింది. ఈ దుర్ఘటనలో కనీసం 39 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఘటన జరిగిన సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల పెద్ద ఉపద్రవం తొలిగిపోయింది. బస్సు ఆ ఇంటిపై పడి ఆగిపోవడం వల్లే పక్కనే ప్రవహిస్తున్న సింధు నదిలోకి జారిపడకుండా ఉండిపోయిందని, ఒకవేళ నదిలో పడి ఉంటే ఊహించని రీతిలో నష్టం జరిగేదని అధికారులు భావిస్తున్నారు.

# జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నిరకాల స్పెషాలిటీ వైద్యసేవలు

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** జగిత్యాల గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో అన్నిరకాల స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. అత్యాధునిక వసతులతో కూడిన హాస్పిటల్ భవనం నిర్మిస్తున్నామని, కొత్త హాస్పిటల్‌లో అన్నిరకాల స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేశారు. జగిత్యాల్ మెడికల్ కాలేజీలో అన్నిరకాల పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేయాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు జగిత్యాల్ మెడికల్ కాలేజీ, జీజీహెచ్, ఇతర హాస్పిటళ్ల పనితీరుపై మంత్రి సమీక్ష చేశారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్



మంగళవారం సెక్రటేరియట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీందర్ నాయక్, జగిత్యాల్ జీజీహెచ్ సూపరింటెండెంట్, డాక్టర్ కృష్ణమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీసీహెచ్ఎస్ డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, హాస్పిటళ్ల అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, ఇతర అంశాలపై మంత్రి సమీక్షించారు. జగిత్యాల మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్, సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్ల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ రెండున్నర సంవత్సరాల్లో ఆరోగ్యశాఖలో 15వేల ఉద్యోగాలను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ పరిధిలోని సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటల్స్‌లో పనిచేసేందుకు 1616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను భర్తీ చేస్తున్నామని చెప్పారు. అందులో 1182 పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని, కోరుట్ల, మెట్‌పల్లి సహా అన్ని హాస్పిటళ్లకు డాక్టర్లు వస్తారని మంత్రి హామి ఇచ్చారు. అత్యాధునిక వసతులతో జగిత్యాల్‌లో కొత్త హాస్పిటల్ భవనం నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి అన్నిరకాల స్పెషాలిటీ వైద్య సేవలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

ఇందుకోసం జగిత్యాల్ మెడికల్ కాలేజీలో ముఖ్యమైన అన్నిరకాల పీజీ డిపార్ట్‌మెంట్లను ప్రారంభించాలని నిర్ణయించామని మంత్రి వెల్లడించారు. పీజీ సీట్ల కోసం వెంటనే నేషనల్ మెడికల్ కమిషన్‌కు దరఖాస్తు చేయాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. స్పెషాలిటీ వైద్య సేవల కోసం జగిత్యాల్ జీజీహెచ్, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కోసం కరీంనగర్ జీజీహెచ్ ప్రధాన హాస్పిటళ్లుగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు.

జగిత్యాల్‌లో ఇటీవలే క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిర్మించామని, అన్నిరకాల ట్రామా కేర్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. జగిత్యాల్‌లో అత్యాధునిక వసతులతో సెంట్రల్ మెడిసినల్ స్టోర్ ఏర్పాటు చేశామని.. జిల్లాలోని అన్ని హాస్పిటల్స్‌కు ఇక్కడి నుంచే మెడిసిన్ సప్లై చేస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. సిజేరియన్ డెలివరీలు తగ్గించేందుకు ప్రభుత్వ హాస్పిటళ్లలో పనిచేసే నర్సులకు మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఇప్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మిడ్‌వైఫరీ ట్రైనింగ్ కోర్సును ప్రవేశ పెడుతున్నామని మంత్రి వెల్లడించారు.

# బాలల కమిటీ ఛైర్మన్ పరీక్ష ఫలితాన్ని ప్రకటించాలి

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** బాలల సంక్షేమ కమిటీ (సిడబ్ల్యుసి) ఛైర్‌పర్సన్ పదవికి గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు పరీక్ష రాసిన ఒక అభ్యర్థి ఫలితాన్ని ప్రకటించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2015లోని సెక్షన్ 27 ప్రకారం, కేవలం శిక్ష పడిన వారిని మాత్రమే అనర్హులుగా ప్రకటించాలి కానీ, కేవలం కేసు పెండింగ్‌లో ఉన్న వారిని కాదని మంగళవారం ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ ఉత్తర్వు ప్రకారం పరీక్ష రాసినందున, అతని ఫలితాన్ని మరింత ఆలస్యం లేకుండా ప్రకటించాలని న్యాయస్థానం ఇప్పుడు ఆదేశించింది. గతంలో ఆదిలాబాద్ జిల్లాలోని బాలల సంక్షేమ కమిటీలో సభ్యుడిగా పనిచేసిన పిటిషనర్, గత ఏడాది జూలై లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను అనుసరించి ఛైర్‌పర్సన్ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన గడువులోగా దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఈ ఏడాది ఏప్రిల్ 19న జరగాల్సిన రాత పరీక్షకు ముందు తన హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేకపోయారు. ఫలితంగా హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా, జువెనైల్ జస్టిస్ యాక్ట్ కింద అధికారాలను దుర్వినియోగం చేసినట్లు రుజువైందా అని అడిగే కాలమ్‌కు అతను అవును అని టిక్ పెట్టినందున, అతని దరఖాస్తును పరిగణనలోకి తీసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. అయితే, తాను ఆ ఆప్షన్‌ను ఎప్పుడూ ఎంచుకోలేదని పిటిషనర్ దీనిని ఖండించారు. పిటిషనర్‌కు హాల్ టికెట్ జారీ చేసి పరీక్ష రాయడానికి అనుమతించాలని, అలాగే తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అతని ఫలితాన్ని ప్రకటించవద్దని ఆయన అధికారులను ఆదేశించారు. ఫలితం నిలిపివేయబడిన ఆ పోస్టుకు జూన్ 25 నుండి ఇంటర్వ్యూలు ప్రారంభం కానున్నందున, ఫలితాన్ని తక్షణమే ప్రకటించాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపారు. మధ్యంతర ఉత్తర్వు కారణంగానే ఫలితాన్ని నిలిపివేశారని, ఇప్పుడు దానిని ప్రకటిస్తారని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు ధృవీకరించారు. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న హైకోర్టు, బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ పదవి కోసం పిటిషనర్‌కు నిర్వహించిన పరీక్ష ఫలితాన్ని తక్షణమే ప్రకటించాలని అధికారులను ఆదేశిస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది.

# అన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఇహెచ్ఎస్‌ను అమలుచేయాలి

## అసోసియేషన్‌కు ఇహెచ్‌సిటి బోర్డు సభ్యుల విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఈహెచ్ఎస్ పథకాన్ని రాష్ట్రంలోని అన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో అమలు చేయాలని ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సీటీ) బోర్డు సభ్యులు తెలంగాణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్‌కి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈహెచ్‌సీటీ బోర్డు సభ్యులు తెలంగాణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (టిఎస్‌హెచ్‌ఏ) అధ్యక్షులు రఘునాథ్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ప్రయోజనాల దృష్ట్యా ఈహెచ్ఎస్ సేవలను వెంటనే తెలంగాణలోని 17 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో అమలు చేయాలని బోర్డు సభ్యులు విజ్ఞప్తి చేశారు. స్పందించిన టిఎస్‌హెచ్‌ఏ అధ్యక్షులు డాక్టర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రారంభ దశలో కాంటినెంటల్ హాస్పిటల్స్(గచ్చిబౌలి), కిమ్స్ హాస్పిటల్స్‌లో ఈహెచ్ఎస్ సేవలను వెంటనే అందిస్తామని తెలిపారు. మిగిలిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో కూడా త్వరలోనే ఈహెచ్ఎస్ అమలుకు చర్యలు తీసుకుంటామని టిఎస్‌హెచ్‌ఏ ప్రెసిడెంట్ హామీ ఇచ్చినట్టు ఈహెచ్‌సీటీ బోర్డు సభ్యులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన ఐఎస్‌డబ్ల్యు కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యు) కానిస్టేబుల్ కుటుంబానికి ఇదే విభాగం సిబ్బంది అంతా కలిసి ఐదు లక్షల 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఐఎస్‌డబ్ల్యు అధికారులు, సిబ్బంది అం తా కలిసి ఒకరోజు వేతనం విరాళంగా అందించి ఈ డబ్బును పోగు చేశారు. ఈ నగదును మంగళవారం నాడు కమాండ్ కంట్రోల్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌డబ్ల్యు ఓఎస్‌డి కమలాసన్ రెడ్డి చేతుల మీదుగా కిరణ్ కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా కమలాసన్ రెడ్డి మా ట్లాడుతూ సహచర కానిస్టేబుల్ మరణిస్తే అందరు కలిసి అతని కుటుంబాన్ని ఆదుకోవడం మంచి పరిణామమని అన్నారు. కానిస్టేబుల్ కిరణ్ కుటుంబానికి అందాల్సిన సహాయం పూర్తిగా అందజేస్తామని ఆయన తెలిపారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని కమలాసన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌డబ్ల్యు ఎస్పిలు చక్రవర్తి, సయ్యద్ భాష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులను ఓదార్చుతున్న తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

# నేరేళ్ల బాధిత కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి

## నాటి ఘటనకు క్షమాపణలు చెబుతున్నా : కవిత

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త :** 'నేరేళ్ల దమనకాండ మనమందరం సిగ్గుతో తలదించుకునే నల్లటి సంఘటన. ఆ ఘటన జరిగినప్పుడు అధికారంలో ఉన్న కుటుంబంలో నేను కూడా ఒక సభ్యురాలినే అయినందుకు సిగ్గుపడుతున్నా.. మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నా' అని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నేరేళ్ల ఘటనలో తీవ్ర అనారోగ్యానికి గురై ఇటీవలే మృతి చెందిన గంధం గోపాల్ కుటుంబ సభ్యులను మంగళవారం ఆమె పరామర్శించారు. వారిని ఓదారుస్తూ అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ కొందరి ధన దాహానికి, ఇసుక మాఫియా ప్రయోజనాల కోసం అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్నారని కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇసుక లారీల భయానికి ఒక బిడ్డ ప్రాణం పోతే, న్యాయం కోసం ఆందోళన చేసినందుకు ప్రజలపై పోలీసులు నాడు పాశవికంగా విరుచుకుపడి ఐదు రోజుల పాటు 8 మందిని ఇష్టానుసారంగా చితకబాదారని మండిపడ్డారు. దెబ్బల తీవ్రత చూసి జైలర్ సైతం వీళ్లను జైల్లోకి తీసుకోలేమని చెప్పేంత దాష్టీకం జరిగింది' అని నాటి దమనకాండను గుర్తు చేశారు.

నెరేళ్ల బాధిత కుటుంబాలకు తక్షణమే రూ.1 కోటి పరిహారం ప్రకటించాలని బాధిత కుటుంబాల పిల్లల చదువుల ఖర్చు మొత్తాన్ని స్థానిక ఎమ్మెల్యేగా కేటీఆర్ భరించాలని కవిత డిమాండ్ చేశారు. దమనకాండకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని 'మేము టూరిస్టుల మాదిరిగా పరామర్శకు రాలేదని తెలంగాణ రక్షణ సేన అంటేనే ప్రశ్నించడానికి, పోరాడటానికి, పరిష్కరించడానికి పుట్టిన పార్టీఅన్నారు. నెరేళ్ల బాధితులతో కలిసి అవసరమైతే ఢిల్లీకి వెళ్తామని ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలూ రాజకీయాన్ని పక్కనపెట్టి మానవత్వంతో బాధితులను ఆదుకోవాలి' అని కవిత పిలుపునిచ్చారు.

# అదనపు ఫీజులు వసూలుచేస్తే చర్యలు తప్పవు

## ఒక్కో విద్యార్థి చొప్పున రూ. 2 లక్షలు జరిమానా విధిస్తాం

## ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు టిఎఎఫ్ఆర్‌సి లేఖలు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తెలంగాణ ప్రవేశాలు, ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టిఏఎఫ్ఆర్‌సీ) హెచ్చరించింది. ఈ మేరకు అదనపు ఫీజులు వసూలు చేస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడమే కాకుండా.. ప్రతి విద్యార్థికి రూ. 2 లక్షలు జరిమానా విధిస్తామని ఏఎఫ్ఆర్‌సీ స్పష్టం చేసింది. ఇదే అంశాన్ని పేర్కొంటూ టిఏఎఫ్ ఆర్‌సీని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు లేఖలు రాశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అదనంగా ఎలాంటి రుసుములు వసూలు చేసినా అది చట్టవిరుద్ధమని టిఏఎఫ్ఆర్‌సీ స్పష్టం చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కాకుండా అడ్మిషన్ ఫీజు, ఎన్‌బిఏ ఫీజు, స్పెషల్ ఫీజు, కేరియర్ డెవలప్మెంట్ ఫీజు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ఫీజు, యూనిఫాం ఫీజుల పేరుతో కొన్ని యాజమాన్యాలు అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నట్లుగా విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు టిఏఎఫ్ఆర్‌సీ తెలిపింది.

ప్రభుత్వ ఆదేశాల ద్వారా అనుమతించిన ఫీజు కంటే ఏ పేరుతో అదనంగా వసూలు చేసినా దానిని క్యాపిటేషన్ ఫీజుగానే పరిగణిస్తామని హెచ్చరించింది. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అదనపు ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఉల్లంఘనకు పాల్పడే విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలతో పాటు, నిబంధనలు పాటించని కాలేజీలకు ఒక్కో విద్యార్థికి రూ.2 లక్షల చొప్పున జరిమానా విధిస్తామని స్పష్టం చేసింది. అదనపు ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలపై విద్యార్థులు, తల్లిదండ్రులు తగిన ఆధారాలతో నేరుగా తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని టిఏఎఫ్ ఆర్‌సీ విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించింది.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక నేత్ర వైద్యసేవలు

## ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌తో భాగస్వామ్యం

## మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా. రాష్ట్రం లోని 35 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నేత్ర వైద్య విభాగాలు ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలను అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కంటి పరీక్షలు, ఆప్టోమెట్రీ సేవలు, శుక్లాల (క్యాటరాక్ట్) శస్త్రచికిత్సలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని సరోజిని దేవి కంటి ఆసుపత్రి రాష్ట్రంలో నేత్ర వైద్యానికి అత్యున్నత కేంద్రంగా సేవలందిస్తోందని, రెటీనా శస్త్రచికిత్సలు, లేజర్ చికిత్సలు, మెల్లకన్ను (స్క్వింట్) శస్త్రచికిత్సలు, కార్నియా మార్పిడి, కంటి క్యాన్సర్‌కు సంబంధించిన చికిత్సలు, ప్లాస్టిక్ సర్జరీలు, గ్లాకోమా చికిత్సలు వంటి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కంటి వైద్య సేవల రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా స్థాయి ప్రభుత్వ బోధన ఆసుపత్రుల్లో ప్రత్యేక నేత్ర శస్త్రచికిత్స ఆపరేషన్ థియేటర్లు, అవసరమైన వైద్య పరికరాలను ఏర్పాటు చేయడానికి ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఇప్పటికే అవసరమైన ప్రణాళికలను రూపొందించామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్య సేవల బలోపేతానికి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో అమలు చేస్తున్న నవజాత శిశువుల కంటి పరీక్షల పైలట్ కార్యక్రమాన్ని దశలవారీగా ఇతర జిల్లాలకు విస్తరించడంపై చర్చించారు.

# గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 28:** తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్ మంగళవారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్‌శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పరిపాలనా, ఆర్థిక లెక్కల నిర్వహణ అంశాలపై వారు గవర్నర్‌తో సంక్షిప్తంగా చర్చించారు.

# రైతుల బకాయిలు చెల్లించాలి

## లాభార్జన కాకుండా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలి

## మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త :** సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు గానీ నిరక్ష్యంగా వ్యవహరించడం వల్ల సీడ్ రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీడ్ కంపెనీల ప్రతినిధులు, సీడ్ కంపెనీ అసోసియేషన్ సభ్యులు, వివిధ జిల్లాల్లో పత్తి విత్తనోత్పత్తిలో భాగస్వాములైన ఆర్గనైజర్లతో సమావేశం జరిగింది. ఇందులో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులను వెంటనే ప్రారంభించి రైతులకు సకాలంలో అందేలా కార్యాచరణ చేపట్టాలని కంపెనీలకు సూచించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోదని హెచ్చరించారు. సీడ్ కంపెనీలు కేవలం లాభార్జన కోణంలో కాకుండా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్గనైజర్లకు, వారి ద్వారా రైతులకు చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. కాగా రైతులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటినీ ఈ ఏడాది ఆగస్టు నెలలోగా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని కంపెనీల ప్రతినిధులు తెలిపారు.

**రైతు చెంతకు నూతన సాంకేతికత**

**ఎల్‌నినోఎదుర్కోవడంలో రైతు నేస్తం కీలకం**

రైతుల చెంతకు నూతన సాంకేతికతను తీసుకెళ్లడమే రైతు వేదిక ప్రధాన లక్ష్యమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తంలో మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు ఒకే వేదికపై ప్రత్యక్షంగా చర్చించే అవకాశాన్ని కల్పించడం ద్వారా రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బోర్ల కింద, ప్రాజెక్టుల కింద ఏ ప్రాంతంలో ఏ పంటలు అనుకూలమో శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచంతో పోటీపడే వ్యవసాయం కోసం సాంకేతిక పరిజ్ఞానం అత్యంత అవసరమని మంత్రి అన్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావాన్ని ప్రభుత్వం, రైతులు కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతును రాజుగా తీర్చిదిద్దడమే రైతునేస్తం కార్యక్రమం లక్ష్యమని స్పష్టం చేశారు. మరో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వర్షాలతో చెరువులు, ప్రాజెక్టులు నిండే పరిస్థితి లేదని, భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం లేదని చెప్పారు. కాబట్టి రైతులు ఈ వర్షాలను చూసి నీటి అవసరం ఎక్కువగా ఉండే వరి వంటి పంటలను విస్తృతంగా సాగు చేయవద్దని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని జిల్లా, మండలాల వారీగా రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ నెలలో వర్షాలు మరింత తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు.



# నార్త్ కరోలినాలో గుత్తా సుఖేందర్‌రెడ్డి, అమిత్‌రెడ్డికి ఘనస్వాగతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 28:** అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం, ర్యాలీ నగరంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డిలకు ఘనస్వాగతం పలికారు. అసోసియేషన్ ప్రతినిధులు శ్రీను యాదవ్ నాగనబోయిన, కరుణాకర్ వంగూరు, శేఖర్ నల్లబోతుల, రవీందర్ గడ్డంపల్లి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా స్వాగతించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రవాస భారతీయుల పాత్ర, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర అభ్యున్నతికి ప్రవాసుల సహకారం వంటి పలు అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అతిథులు అభినందిస్తూ, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇక టెలివిజన్ రంగంలో అవార్డులు

## పివి నరసింహారావు పేరిట ప్రోత్సాహం

## సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార:** రాష్ట్రంలో బుల్లితెర (టెలివిజన్) రంగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోనే మొదటిసారిగా టెలివిజన్ రంగానికి ప్రత్యేక అవార్డులను అందించేందుకు చర్యలు చేపట్టింది. సినీరంగానికి తోడుగా టీవీ రంగానికి కూడా ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు టెలివిజన్ అవార్డు కమిటీ ప్రతినిధులతో హైదరాబాద్‌లో మంగళవారం మంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టీవీ అవార్డులకు సంబంధించి లోగో, కేటగిరీలు, ప్రత్యేక పేరు రూపకల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మ ప్రతిబింబించేలా ఈ అవార్డుల లోగో, పేరు ఉండాలని మంత్రి సూచించారు. టెలివిజన్ రంగంలో ఎక్కువ ఎంటర్టైన్మెంట్ నిచ్చే రంగం కీలకం అని అన్నారు. ఎక్కువ మంది మహిళలు, వృద్ధులు టీవీ కార్యక్రమాల పట్ల మక్కువ చూపుతున్నారని అన్నారు. టీవీ రంగంలో రాణిస్తున్న అన్ని కేటగిరీల వారికి, మంచి మెసేజ్ ఇచ్చే సీరియల్స్, ప్రోగ్రామ్స్, చిల్డ్రన్స్ మూవీలు తీసేవారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును ఈ టీవీ అవార్డులకు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారి ఇవ్వబోయే ఈ అవార్డు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. అవార్డుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగేలా చూడాలని కమిటీకి సూచించారు. దీనికి సంబంధించి సమగ్ర మార్గదర్శకాలను త్వరగా సిద్ధం చేయాలని టెలివిజన్ అవార్డు కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి ముందరెడ్డితో పాటు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# టెట్ ఇన్‌సర్వీస్ టీచర్స్‌కు 16,042 దరఖాస్తులు

## నేటితో ముగియనున్న గడువు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇన్ సర్వీస్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కి సంబంధించిన టెట్ ఇన్ సర్వీస్ టీచర్స్-2026 దరఖాస్తులను సమర్పించడానికి నేడు(బుధవారం) తుది గడువు. మంగళవారం మధ్యాహ్నం వరకు 16,042 దరఖాస్తులు వచ్చినట్టు టెట్ ఇన్ సర్వీస్ టీచర్స్-2026 కన్వీనర్ జి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్-1కి 1705, పేపర్-2కి 11,634, రెండు పేపర్లకు 2703 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఫీజు చెల్లించి, దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి నేడు తుది గడువని గుర్తు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 30 వరకు ఎడిట్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతోపాటు సాధారణ రెసిడెన్షియల్ స్కూల్స్, వివిధ సంక్షేమ శాఖల అధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల స్కూల్స్ టీచర్లు, మోడల్ స్కూల్ టీచర్లు టెట్ ఇన్ సర్వీస్ టీచర్స్‌కి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. దరఖాస్తులను ఈ నెల 22 నుంచి స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఒక్కో పేపర్‌కి జనరల్, బీసీ అభ్యర్థులకు ఫీజు రూ. 750గా నిర్ణయించగా.. రెండు పేపర్లు రాయాలనుకునే వారు రూ. 1000 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఒక్కో పేపర్‌కి రూ. 700 కాగా.. రెండు పేపర్లకి కలిపి రూ. 950గా నిర్ణయించారు. సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనుండగా.. మధ్యాహ్నం సెషన్ 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 28 నుంచి 31 మధ్యలో టెట్ ఫలితాలను విడుదల చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో ప్రకటించారు. రాష్ట్రంలో సుమారు 25 వేల మంది ఇన్ సర్వీస్ టీచర్లు టెట్ పరీక్షకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# 500 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదల

## ఫలితాలను విడుదల చేసిన మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోని ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదలయ్యాయి. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాల్లోని మొత్తం 500 పోస్టులకు సంబంధించిన ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) మంగళవారం విడుదల చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను అధిగమించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు సంబంధించిన 692 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేయగా, అధికారులు వారికి పోస్టింగ్స్ కూడా ఇచ్చారు. ఇపుడు జనరల్ సర్జరీ - 174, జనరల్ మెడిసిన్ - 166, ఆర్థోపెడిక్స్ - 89, రేడియాలజీ - 71 చొప్పున 500 పోస్టులకు సంబంధించిన ఫలితాలను ఎంహెచ్ఆర్‌బీ విడుదల చేసింది. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, తుది ఫలితాలను ప్రకటించింది.

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఎంహెచ్ఎస్ఆర్‌బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నూతనంగా ఎంపికైన స్పెషలిస్ట్ డాక్టర్లు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత లేకుండా చూడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 24 విభాగాల్లో 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

ఈ సూపర్ స్పెషాలిటీ పోస్టులలో కలిపి 1192 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.



## సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా తెలంగాణ

### స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై28:**అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భారతదేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్‌క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్1ను విజయవంతంగా ప్రయోగించిన తీరును వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధనఅభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వం-ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారు సాధించిన విజయం భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతుందని ప్రశంసించారు.

## పోలీసు ఎస్కార్టు నుంచి మానసిక ఖైదీ పరార్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 28, ప్రభాతవార్త:** పోలీసు ఎస్కార్టు మధ్య చికిత్స కోసం వెళ్లిన ఒక మానసిక ఖైది పరారైన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు పోలీసులు ఒక కేసులో నిందితుడిగా ఉన్న రవి(36) అనే వ్యక్తిని కోర్టు ఆదేశాల మేరకు ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య ఆస్పత్రిలో చికిత్స కోసం తీసుకొచ్చారు. పోలీసు ఎస్కార్ట్‌లో ఉన్న సమయంలో బాత్రూమ్ కిటికీ ద్వారా తప్పించుకుని అతను పరారయ్యాడు.ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో, ఇతర ప్రాంతాల్లో పోలీసులు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో కానిస్టేబుల్ ప్రభాకర్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా రవి స్వస్థలం ఢిల్లీలోని మెహ్రౌలి ప్రాంతమని, అతనికి మానసిక స్థితి స్థిరంగా లేదని, హిందీ భాష మాత్రమే మాట్లాడగలడని ఫిర్యాదులో పేర్కొన్నారు.



## పెళ్లికాలేదని 29 మంది యువకులు ఆత్మహత్య

**జలగాంవ్,జులై 28:** మహారాష్ట్రలోని జలగావ్ జిల్లాలో ఏకంగా 29 మంది యువకులు పెళ్లి కాలేదనే బాధతో బలవన్మరణాలకు పాల్పడడం ఆప్రాంతంలో నెలకొన్న యువత మానసిక స్థితిని సూచిస్తోంది. సామాజికంగా ఈ సమస్య ఎంత తీవ్రతంగా ఉందో తెలుస్తోంది. మహారాష్ట్రలోని జలగావ్‌జిల్లా పోలీసులు ఒక ప్రత్యేక సర్వే చేశారు. జనవరి 1 నుంచి జూన్ 30 మధ్య ఆ జిల్లాలో మొత్తం 443 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో 383 మంది పురుషులు, 29 మంది మహిళలు, 8 మంది బాలురు, 11 మంది బాలికలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, బాధ్యతలు, సామాజిక, మానసిక ఒత్తిడిలు లాంటి వివిధ కారణాలతో వారు ఆత్మహత్యలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వీటన్నింటి కంటే ఘోరం ఏమిటంటే, పెళ్లి కాలేదనే నిరాశతో ఏకంగా 29 మంది యువకులు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివాహ వయస్సు పెరిగిపోవడం, సరైన భాగస్వామి దొరకకపోవడం, సమాజం నుంచి వచ్చే ఒత్తిడి, మానసిక ఆందోళనలు మొదలైనవి యువతపై చాలా చెడు ప్రభావం చూపిస్తున్నాయని, ఇవే పురుషుల్లో ఆత్మహత్య సంఖ్య ఎక్కువగా ఉండడానికి కారణమవుతున్నట్లు డేటా స్పష్టం చేస్తోంది.

## అవినీతి అధికారుల భరతం పట్టాల్సిందే

### రెండో త్రైమాసిక సమావేశంలో ఎసిబి డిజి చారుసిన్హా వెల్లడి

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** ప్రభుత్వ విభాగాల్లో అవినీతిపరులుగా వున్న వారి భరతం పట్టాలని ఎసిబి డిజి చారు సిన్హా వెల్లడిం చారు. ఈ విషయంలో ఎంతటి వారిని కూడా ఉపేక్షించకూడదని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో మ ంగళవారం నాడు ఈ విభాగం రెండవ త్రైమాసిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎసిబి డైరక్టర్ అవినాష్ మొహంతితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజి చారు సిన్హా మాట్లాడుతూ ఎసిబి చరిత్రలో 1983 తరువాత ఇదివరకు ఎన్నడు లేనంతగా ఈ ఏడాది రెండవ త్రై మాసికంలో పది మంది అధికారులను అక్రమాస్తుల కేసులో అరెస్టు చేశామని, 34 మంది లంచగొండులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని తె లిపారు. ఇదే సమయంలో 23 చోట్ల ఆకస్మిక తనిఖీలు చేబట్టి ఆయా ప్రాంతాలలో గల సర్కారీ విభాగాల అవినీతిని రట్టు చేశామని ఆమె తెలి పారు. ఎసిబి అధికారులు అవినీతి అధికారులను వదిలిపెట్టకూడదని, అక్రమార్కులపై నిరంతరం నిఘా వుంచాలని, పక్కా సమాచారంతో అరె స్టు చేయాలని ఆమె కోరారు. ఎసిబి సర్కారీ విభాగాల్లో ఎంతో కీలకమైనదని ఆమె తెలిపారు. ఈ విభాగం అధికారులు ప్రొఫెషనల్‌గా వ్యవహ రించాలని, అవినీతిపరుల గురించి ప్రజల నుంచి సమాచారం సేకరించాలని ఆమె ఆదేశించారు. ఎసిబి డైరక్టర్ అవినాష్ మొహంతి మాట్లాడు తూ అవినీతిపరులను పట్టుకోవడంలో అక్రమార్కులను అరెస్టు చేయడంలో అధికారులు చేస్తున్న కృషి ప్రశంసనీయంగా వుందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో అక్రమార్కులను ఏరిపారేయాలని ఆయన కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రెండవ త్రైమాసి కంలో విశేషంగా కృషిచేసి న ఎసిబి అధికారులకు డిజి చారు సిన్హా రివార్డులను అందజేశారు.

# పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కమిటీల పాత్ర చాలాగొప్పది

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

### అసెంబ్లీ కమిటీలు ఇతర రాష్ట్రాల్లో స్టడీ టూర్ చేయాలి: శాసనసభావ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు

### శాసనసభ అస్యూరెన్స్ కమిటీ, రూల్స్ కమిటీ, ఎథిక్స్ కమిటీల తొలి సమావేశాలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై28:** శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ (అస్యూరెన్స్), శాసనసభ నియమాల కమిటీ (రూల్స్), శాసనసభ నైతిక విలువల కమిటీ (ఎథిక్స్)లు ప్రారంభమయ్యాయి. మంగళవారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో కమిటీల ప్రారంభ సమావేశాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు హాజరై దిశానిర్దేశం చేశారు. శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణ హాజరయ్యారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రూల్స్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కమిటీ సభ్యులు దానం నాగేందర్, తూడి మెఘారెడ్డి, భూక్యా మురళి నాయక్ ఈ సమావేశానికి హాజరయ్యారు.శాసనసభ నైతిక విలువల కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవ రెడ్డికి, ఎథిక్స్ కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కమిటీల పాత్ర చాలా గొప్పది. శాసనసభ సమావేశాల సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విదంగా చూడాల్సిన బాధ్యత హామీల కమిటీది. ఆవిధంగా పనిచేయాలని సూచిస్తున్నానని చెప్పారు. నియామాల కమిటీ శాసనసభ సక్రమమైన, సమర్ధవంతమైన ప్రజాస్వామ్యబద్ధమైన నిర్వాహణలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుందన్నారు. శాసనసభ చట్టాల ద్వారానే కాకుండా ఆ చట్టాలను రూపొందించే సభ్యుల ప్రవర్తన, నిబద్ధత, వ్యవహార శైలి ద్వారా కూడా అంచనా వేయబడుతుందన్నారు.
ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల నమ్మకాన్ని బలోపేతం చేయడం అనే ఉద్యేశ్యంతోనే ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంటరీ వ్యవస్థలో నైతిక విలువల కమిటీ అనే వ్యవస్థ అభివృద్ధి చెందిందన్నారు. రాగద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపా తంగా కమిటీలు పనిచేయాలని సూచించారు.
శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ శాసనసభ కమిటీల చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు.శాసనసభలో సభ్యులకు మొదటిగా ఇచ్చేది రూల్స్ బుక్, దానికి అనుగుణంగా స్పీకర్ శాసనసభను నడుపుతారు. గత ప్రభుత్వంలో రూల్స్ బుక్ ను మార్చివేశారని చెప్పారు. శాసనసభను సమర్ధవంతంగా నడపడానికి కమిటీ అధ్యక్షులు, సభ్యులు కలిసి నూతన నిబంధనలతో రూల్స్ బుక్‌ను రూపొందించాలని చెప్పారు. శాసనసభ కమిటీలు ఇతర రాష్ట్రాలలో కూడా స్టడీ టూర్ చేసి ఆయా రాష్ట్రాల శాసనసభలలో అమలవుతున్న నిబంధనలను పరిశీలించాలి, వారి సలహాలు తీసుకోవాలని సూచించారు. సభలో నియమాలను పాటించే విధంగా చూడడంతో పాటుగా, సభ హుందాతనాన్ని కాపాడడంలో విలువల కమిటీది కీలక పాత్ర, కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా ఉంటూ తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్‌గా ఉండే విదంగా ఎథిక్స్ కమిటీ సూచనలు ఉండాలని చెప్పారు. కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ శాసనసభ మాపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తూ సభ గౌరవాన్ని పెంచుతామని తెలిపారు. ఈ కమిటీల సమావేశాలలో కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆల్మట్టి వరద జలాలను సద్వినియోగం చేసుకోవాలి

### నీటపారుదల శాఖ కార్యదర్శికి సూచించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 28:** ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల నుంచి దిగువకు వస్తున్న వరద జలాలను వృథా కాకుండా జూరాల, నెట్టెంపాడు, భీమా రిజర్వాయర్లలో నిల్వ చేసి చెరువులు, కుంటలు నింపేలా తక్షణ చర్యలు చేపట్టాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్‌కు సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి కొరత తలెత్తే అవకాశం ఉన్నందున ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు.
వరద జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా జలాశయాల్లో నిల్వ చేయడంతో పాటు చెరువులు, కుంటలను నింపే కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వరద ప్రవాహాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు

## పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 28:**మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లు తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి స్వాగతిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. కొత్త బిల్లులు తీసుకురావడానికి ముందు గత తప్పుల నుంచి ఏమి నేర్చుకుందో ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అందులో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా ఉండగా మూడుసార్లు జరిగాయని వివరించారు. ప్రస్తుతం దేశానికి జవాబుదారీతనం, పారదర్శకత, దీర్ఘకాలిక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. డా. కె.రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలు ఏమైందో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది.. అయితే దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకు రాలేదని వివరించారు. అందుకు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ఉదాహరణ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అవి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని ప్రభుత్వం.. కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని సందేహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1971 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్‌ను నిలిపివేసి, ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఆ గడువును పొడిగించిందని వివరించారు. ఈ కాలంలో దక్షి ణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని.. కానీ ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా పెరిగిందని సోదాహరణగా తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షి ణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఆగస్టు 3 నుంచి సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

### ఆగస్టు 30 తుది గడువు

### అపరాధ రుసుంతో సెప్టెంబర్ 12 వరకు అవకాశం

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్స్ ఉద్యోగాల కోసం నిర్వహించే అర్హత పరీక్ష తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(టిజి సెట్)-2026 దరఖాస్తులను ఆగస్టు 3 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 30 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు టిజి సెట్-2026 మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి శ్రీనివాస్ ప్రకటించారు. అపరాధ రుసుం రూ. 1500తో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 5 వరకు, రూ. 2000తో సెప్టెంబర్ 6 నుంచి 10 వరకు, రూ. 3000 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 11, 12 తేదిల్లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సెప్టెంబర్ 13 నుంచి 15 వరకు ఎడిట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. హాల్ టికెట్లను సెప్టెంబర్ 22 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. పరీక్షలను సెప్టెంబర్ చివరి వారంలో నిర్వహించనున్నట్లు టిజి సెట్-2026 మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి శ్రీనివాస్ తెలిపారు.

## గనుల పని ప్రాంతాల్లో శూన్య ప్రమాదాలు

### భద్రత నిబంధన మాత్రమే కాదు, ప్రతి కార్మికుడి బాధ్యత

### సింగరేణి డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** గనుల పని ప్రాంతాల్లో శూన్య ప్రమాదాలు (జీరో యాక్సిడెంట్స్) సాధించడమే ప్రధాన లక్ష్యమని సింగరేణి డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డిజిఎంఎస్) ఉజ్వల్ తాహ్ స్పష్టం చేశారు. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా గుర్తింపు పొందిన సింగరేణి, భద్రతా ప్రమాణాల అమలులోనూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. గనుల్లో ప్రమాదాల నివారణ, కార్మికుల రక్షణే ధ్యేయంగా సింగరేణి కాలరీస్ 56వ వార్షిక భద్రత వృక్షోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణిలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రమాదరహిత ఉత్పత్తే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. భద్రత అనేది కేవలం ఒక నిబంధన మాత్రమే కాదని, అది ప్రతి కార్మికుడి బాధ్యత అని పేర్కొన్నారు. గనుల్లో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు. పరిశ్రమ అభివృద్ధికి సమిష్టి కృషి, భద్రతా సంస్కృతి అత్యంత అవసరమని పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు గనుల్లో భద్రతా ప్రమాణాలను మరింత పెంపొందించాలని సూచించారు. ప్రమాదరహిత ఉత్పత్తే సంస్థ లక్ష్యంగా కొనసాగాలని, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. భద్రతా చర్యల అమలులో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు భద్రతా పతాకాన్ని ఆవిష్కరించి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన బొగ్గు గని కార్మికులకు నివాళులర్పిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ పక్షోత్సవాల ముగింపు కార్య క్రమం సమీక్షలో భాగంగా, ఉత్తమ భద్రతా ప్రమాణాలు పాటించిన గనులకు, ఏరియా వర్క్‌షాప్‌లకు, ఉత్తమ కార్మికులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు భద్రతా సావనీర్‌ను ఉజ్వల్ తాహ్ ఆవిష్కరించారు. అద ే విధం గా భద్రతా పక్షోత్సవంలో విశేష ప్రతిభ కనబరిచిన గనులు, విభాగాలు, అధికారులు, ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంఒ సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

## భారీవర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్లతో సిఎస్ సంజయ్‌జాజు టెలీకాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై28:**రాబోయే రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని కేంద్ర వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ ప్రత్యామ్నాయ ప్రణాళిక, వనమహోత్సవం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీ లతో మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు, ఆరు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా 26 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికలో భాగంగా జిల్లాల్లో విత్తన మేళాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల విషయంలో ఏవిధమైన సహాయం కావాలన్నా అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని సిఎస్ తెలిపారు.కాగా, రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో విస్తృత స్థాయిలో కురుస్తాయన్న భారత వాతావరణ శాఖ తాజా సూచనల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు.ప్రధానంగా, వివిధ శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు. భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాలలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. హైదరాబాద్, ఇతర ప్రధాన కేంద్రాల్లో ఉన్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను కూడా అవసరం ఉన్న చోటుకు తరలిస్తామన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శులు దాసరి హరిచందన, సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆటా సభలకు వెళ్లనున్న బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 28:**అమెరికాలోని మేరీల్యాండ్ వేదికగా జరగనున్న అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) 19వ మహాసభలు, యూత్ కన్వెన్షన్‌కు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుకు గౌరవపూర్వకంగా ఆహ్వానం అందింది. జూలై 31 నుండి ఆగస్టు 2, 2026 వరకు బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో అత్యంత వైభవంగా జరగనున్న ఈ మూడ్రోజుల సమ్మేళనానికి రాంచందర్ రావును విశిష్ట అతిథిగా హాజరుకావాల్సిందిగా ఆటా ఆహ్వానించింది. ఈ మహాసభలలో పాల్గొనడానికి రాంచందర్ రావు జూలై 30న అమెరికా బయలుదేరి వెళ్లి, కార్యక్రమాలు ముగించుకుని తిరిగి ఆగస్టు 6న హైదరాబాద్‌కు చేరుకుంటారు.

## ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ దరఖాస్తు గడువు ఆగస్టు 3 వరకు పొడిగింపు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ఎడ్ సెట్-2026 ద్వారా బీఈడీ కోర్సుల్లో చేరడానికి నిర్వహిస్తున్న మొదటి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. తమ వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవడానికి ఈ నెల 28 వరకు ఉన్న గడువును కాస్త ఆగస్టు 3 వరకు పొడిగించినట్లు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 6న సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం అర్హుల జాబితాను ప్రకటిస్తారని తెలిపారు. ఆగస్టు 7 నుంచి 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 11న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఆగస్టు 16న మొదటి విడత సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీటు పొందిన అభ్యర్థులు ఆగస్టు 17 నుంచి 20 వరకు ఆయా కాలేజీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో జాయిన్ కావాలని పాండురంగారెడ్డి ప్రకటనలో సూచించారు.



## ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ పోర్టులో చిక్కుకున్న 13 మంది భారత నావికులు

**న్యూఢిల్లీ, జులై 28:** ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ పోర్టులో నిలిపి ఉన్న ఎం.వి. అమీర్1 నౌకలో 13 మంది భారతీయ నావికులు చిక్కుకుపోయారని ఫార్వర్డ్ సీమన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. వారి భద్రత, స్వదేశానికి తరలింపు కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని, నౌక యజమానులను యూనియన్ కోరింది.మొత్తం 15 మంది సిబ్బందితో ఉన్న ఈ నౌక ప్రస్తుతం 'ప్రాణాపాయ పరిస్థితుల్లో చిక్కుకుందని ఎఫ్‌సియుఐ తెలిపింది. నౌక సమీప ప్రాంతాల్లో వరుసగా డ్రోన్లు, క్షిపణి దాడులు జరుగుతుండటంతో ఎప్పుడైనా నేరుగా దాడి జరిగే ప్రమాదం ఉందన్న భయంతో సిబ్బంది తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొంది.ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎఫ్‌ఎస్‌యుఐ అత్యవసర విజ్ఞప్తి చేసింది.ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ పోర్టులో 15 మంది సిబ్బందితో ఉన్న ఎం.వి. అమీర్1 నౌకలో 13 మంది భారతీయ నావికులు ఉన్నారు. ప్రస్తుతం వారు అత్యంత ప్రమాదకర, ప్రాణాంతక పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నౌక సమీపంలో పదేపదే డ్రోన్, క్షిపణి దాడులు జరుగుతున్నాయి. ఏ క్షణంలోనైనా ప్రత్యక్ష దాడి జరిగే ప్రమాదంతో సిబ్బంది భయాందోళనలో జీవిస్తున్నారు' అని యూనియన్ పేర్కొంది.

## పేటిఎం పేమెంట్స్ బ్యాంకు మూసివేత షురూ

### లిక్విడేటర్‌గా ఎస్బీఐ మాజీ సిజిఎం గిరికుమార్ ఎం నాయర్

**ముంబయి,జులై 28:** పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు అధికారికంగా ముగింపు పలికే ప్రక్రియ షురూ అయింది. నిబంధనల ఉల్లంఘనలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఇప్పటికే బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేయగా, ఇప్పుడు ఆ బ్యాంక్‌ను పూర్తిగా మూసివేసే దిశగా మరో కీలక అడుగు పడింది. ఢిల్లీ హైకోర్టు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను లిక్విడేషన్‌కు పంపాలని ఆదేశించింది. దీంతో బ్యాంక్ వ్యవహారాలన్నీ ఇక అధికారిక లిక్విడేటర్ ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. ఆర్‌బీఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈనెల 8,22 తేదీల్లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం1949, కంపెనీల చట్టం2013 నిబంధనల కింద మూసివేయాలని ఆదేశించింది. కోర్టు నిర్ణయంతో బ్యాంక్ లిక్విడేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. బ్యాంక్‌కు సంబంధించిన పరిపాలనా బాధ్యతలన్నీ ఇక లిక్విడేటర్ చేతుల్లోకి వెళ్లాయి. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ గిరికుమార్ ఎం. నాయర్‌ను అధికారిక లిక్విడేటర్‌గా హైకోర్టు నియమించింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంతో పాటు కంపెనీల చట్టం కల్పించిన అధికారాలన్నీ ఆయన వినియోగించుకోనున్నారు.



# అంగన్వాడీల పేరుతో విషప్రచారం

- వైసిపి నాయకులపై మంత్రి నారా లోకేష్ మండిపాటు
- 'ఫేక్ వర్సెస్ రియల్' పేరుతో విడియో విడుదల

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** అంగన్వాడీల విషయంలో వైసిపి తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే అంగన్వాడీలకు అమ్మఒడి పథకం అందలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం అమలు చేసిందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో తనకు మద్దతుగా అంగన్వాడీలు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీని వైసిపి నేతలు కావాలనే నిరసన కార్యక్రమంగా చూపుతున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ "ఫేక్ వర్సెస్ రియల్" పేరుతో వీడియోను విడుదల చేశారు. అంగన్వాడీల పేరుతో విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి తెలిపారు. వైసిపి హయాంలో అంగన్వాడీ కార్యకర్తలకు అమ్మఒడి ఇవ్వకుండా గొడ్డలి పార్టీ అన్యాయం చేసిందని మంత్రి మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయడంతో సంతోషంతో నా పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో కృతజ్ఞతలు తెలిపారు. గొడ్డలిపోటు ను గుండెపోటుగా ప్రచారం చేసిన గొడ్డలి పార్టీ అంగన్వాడీల ఈ కృతజ్ఞత ర్యాలీని, నిరసన ర్యాలీ అంటూ విషప్రచారం చేస్తోంది' అని మంత్రి పోస్ట్ చేశారు.

# డిఎస్సీలో భారీ అక్రమాలు: పేర్ని నాని

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని, అందుకు ఆధారాలున్నాయని వైసిపి నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. డిఎస్సీ అవకతవకలపై బహిరంగ చర్చకు రావలసిందిగా ఆయన లోకేశ్‌కు సవాల్ విసిరారు. ఒకవేళ చర్చకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తే వైసిపి నుంచి జగన్ వస్తారని, లోకేశ్ వస్తే స్వయంగా తానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. డిఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం దీనిని 'మెగా డిఎస్సీ' అని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, లోపల జరిగిన అక్రమాల వల్ల ఇది దగా డిఎస్సీగా మారిందని మండిపడ్డారు. మంత్రిగా లోకేశ్ విద్యాశాఖ బాధ్యతలను పక్కనబెట్టి మిగిలిన అన్ని శాఖల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. కొంచెమైనా నైతికత ఉంటే ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు, డిఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి మంత్రి పదవికి లోకేశ్ రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం తమ సొంత ప్రచార సాధనాలు, పత్రికల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారంటూ పేర్కొన్నారు.

# శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగంలో పద్మావతి వర్సిటీకి అత్యుత్తమ ర్యాంకు




**తిరుపతి, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత ప్రభుత్వ శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగం న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నాలజీ ఇన్నోవేషన్ సపోర్ట్ సెంటర్ వార్షిక కార్యకలాపాల సమావేశం జరిగింది. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అత్యుత్తమ పనితీరుకు ఎక్స్‌లెంట్ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన సమావేశ నిర్ణయాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమకి సమన్వయకర్త ఆచార్య పి.జ్యోత్స్న, సహసమన్వయకర్త డాక్టర్ డి.సుజాత అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.ఉష పాల్గొన్నారు. టిఐసిఐసి ద్వారా నూతన ఆవిష్కరణలతో ముందుకు వచ్చే వ్యక్తులు, స్టార్టప్‌లు సంస్థలకు వారి ప్రాజెక్టుల స్వభావాన్ని బట్టి రూ.2 లక్షల నుండి 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని సమన్వయకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఉమ టిఐసిఐసి బృందాన్ని అభినందించి, విశ్వవిద్యాలయానికి ఈ గుర్తింపు తీసుకువచ్చినందుకు ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా వినూత్న ఆవిష్కరణలు, స్టార్టప్‌లు యువఆవిష్కర్తలకు మరింత సహకారం అందించాలని ఆకాంక్షి ంచారు.

**ఎస్వీ ఆయుర్వేద కళాశాల హాస్టల్‌లో వికటించిన భోజనం**

# 28మంది విద్యార్థులకు అస్వస్థత

**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలో శ్రీవేంకటేశ్వర (ఎస్వీ) ఆయుర్వేద కళాశాల హాస్టల్‌లో భోజనం వికటించింది. సోమవారం మధ్యాహ్నం ఈ భోజనం తిన్న హాస్టల్ విద్యార్థులు రాత్రి వాంతులు, విరేచనాలతో 28మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని తొలుత టిటిడి కేంద్రీయ వైద్యశాలకు తరలించి వైద్యచికిత్స చేయించారు. వారి ఆరోగ్యం కొంత కుదుటపడినా వారిలో మరికొందరు 11మంది వరకు రాత్రివేళ తీవ్రస్థాయిలో అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో 20 మంది బాలికలు, 8 మంది బాలురు ఉన్నారు. వీరిలో 17 మంది బాలికలు, ముగ్గురు బాలురను అంబులెన్స్ ద్వారా మంగళవారం ఉదయం టిటిడి స్విమ్స్‌కు, కేంద్రీయ వైద్యశాలకు తరలించారు. విరేచనాలు, వికారం, స్వల్ప కడుపు నొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్న 20 మంది విద్యార్థులకు ముఖ్య వైద్యాధికారి పర్యవేక్షణలో తక్షణమే అవసరమైన వైద్య చికిత్స అందించారు. మంగళవారం ఉదయం సమాచారం అందుకున్న టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణూదీక్షిత్, అధ్యాపకులు ఆస్పత్రులకు చేరుకుని వైద్యులతో మాట్లాడారు. చికిత్సకు విద్యార్థులందరూ సానుకూలంగా స్పందించడంతో వారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉండటంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు. అనంతరం వాళ్ళంతా తిరిగి వసతి గృహాలకు చేరుకుని మధ్యాహ్నం భోజనం చేశారు. తుది వైద్య నివేదిక ప్రకారం అస్వస్థతకు గురైన విద్యార్థులందరూ ప్రస్తుతం సురక్షితంగా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. హాస్టల్‌కు అందించిన భోజనం నాణ్యత లోపించడంతోనే వికటించిందని ప్రాథమికంగా నిర్ధారించారు.

# షర్మిల ఆరోగ్యం కోసం కాంగ్రెస్ శ్రేణుల పూజలు



**తిరుపతి, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి త్వరగా కోలుకోవాలని అలిపిరి పాదాల మండపం వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు పూజలు చేశారు. మంగళవారం తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చేర్చుకున్నారు. అనంతరం గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి కోలుకోవాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిత్తూరు శివశంకర్, జ్యోతీశ్వర్ నాయక్, వేమూరి కృష్ణమూర్తి, బోయన నరేంద్రబాబు, గౌతం తదితరులు పాల్గొన్నారు.

# గాజువాకలో రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

- ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు



**విజయ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజక వర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తామని ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణరాజు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో రఘురామ అధ్యక్షతన ఫిర్యాదుల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు మాట్లాడుతూ ఎపి రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్‌కార్డులు (రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు. దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధి కారులు, బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేం దుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణుకుమార్ రాజుతో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి16కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు. అదేవిధంగా స్టీల్ ప్లాంట్‌కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్‌కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్‌లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు.

# తమ్మినేని సీతారాంకు ముందస్తు బెయిల్

## విచారణాధికారి ఎదుట హాజరు కావాలని హైకోర్టు ఆదేశం

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** డాక్యుమెంట్ల ఫోర్జరీ, భూకబ్జా కేసులో అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణిలకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనకు చెందిన సుమారు రూ.4 కోట్ల విలువైన స్థలాన్ని ఫోర్జరీ పత్రాలతో కబ్జా చేశారని శ్రీకాకుళానికి చెందిన కట్టా జయకిశోర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఐదో నిందితుడిగా (ఏ5) ఉన్న చిరంజీవి నాగ్, అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ వై. లక్ష్మణరావు, నాగ్ అభ్యర్థనను తిరస్కరించారు. ఆయనపై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవని, తాను కొనుగోలు చేసినట్లు చెబుతున్న మూడు ప్లాట్లకు సంబంధించి నగదు చెల్లింపుల ఆధారాలను సమర్పించడంలో ఆయన విఫలమయ్యారని న్యాయస్థానం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. ఇదే కేసులో హైకోర్టు తాజా సమాచారాన్ని అనుసరించి ఆరో, ఏడో నిందితులుగా (ఏ6, ఏ7) ఉన్న తమ్మినేని సీతారాం, వాణిశ్రీలకు హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వీరిపై నిర్దిష్టమైన ఆరోపణలు లేకపోవడంతో పాటు, గతంలో దాఖలైన సివిల్ దావాలో వీరిని ప్రతివాదులుగా చేర్చని అంశాలను పరిగణనలోకి తీసుకుని కోర్టు ఈ నిర్ణయం వెలువరించింది. ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని తమ్మినేని సీతారాంను ఆదేశించిన న్యాయస్థానం, విచారణకు సహకరించని పక్షంలో బెయిల్ రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ప్రధాన బెయిల్ పిటిషన్లపై తదుపరి విచారణను ఆగస్టు 17కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో తమ్మినేని స్పందిస్తూ.. తాము ఎప్పుడూ చట్టాన్ని ఉల్లంఘించలేదని, మధ్యవర్తులు చూపించిన పత్రాల ఆధారంగానే సబ్‌రిజిస్ట్రార్ పరిశీలన తర్వాత భూమి కొనుగోలు చేశామని తెలిపారు. ఈ వ్యవహారంలో తాము కూడా బాధితులమేనని, దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నారు.



**ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం**

**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు తమవంత విరాళాలు అందిస్తున్నారు. తాజాగా మంగళవారం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన వెంకట గణేష్ గంగాధర్ దాసిక వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళమిచ్చారు. దాత విరాళాల డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

**'సుస్థిర అభివృద్ధి కోసం మహిళల డిజిటల్ సమ్మిళితతకు జీవితాంత విద్య - సమస్యలు వ్యూహాల్లు పై**

# 40 మంది పరిశోధనా పత్రాల సమర్పణ



**తిరుపతి, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం, ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు మంగళవారం ముగిసింది. "సుస్థిర అభివృద్ధి కోసం మహిళల డిజిటల్ సమ్మిళితతకు జీవితాంత విద్య - సమస్యలు వ్యూహాల్లు అనే అంశంపై పద్మావతి విశ్వవిద్యాలయంలోని సావేరి సెమినార్ హాల్‌లో ఈ సదస్సులో మొత్తం 7 సెషన్స్‌లలో 40 మందికి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఒక్లీనరీ సమావేశం 3 ప్యానెల్ చర్చలు నిర్వహించారు. మహిళల డిజిటల్ సమ్మిళితత, డిజిటల్ అంతరం, మహిళా సాధికారత, కృత్రిమ మేధస్సు, సైబర్ నేరాలు, జీవితాంత విద్య పాత్ర తదితర అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఈ చర్చల ఆధారంగా మహిళలకు డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడం, గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ సాంకేతిక శిక్షణ, మహిళా అధ్యయన కేంద్రాలు-సాంకేతిక విభాగాల మధ్య సమన్వయం, సైబర్ నేరాల నివారణపై ప్రచారం, అసంఘటిత గిరిజన మహిళలకు ప్రత్యేక శిక్షణ, డిజిటల్ వేదిక ఏర్పాటు, చట్టపరమైన అవగాహన, మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.ఉమాదేవి, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్ మేనేజ్మెంట్ డీన్, మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ పి.విజయలక్ష్మీ ్మ పరిశోధనా పత్రాలను సమర్పించిన ప్రతినిధులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.ఆదినారాయణ రెడ్డి, ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్, న్యూఢిల్లీ ప్రతినిధులు, సర్వోదయ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు, మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మాతృభూమికి సేవ చేయడం బాధ్యత




**కుప్పం, జులై 28 ప్రభాతవార్త:** మాతృభూమికి సేవ చేయడం మన బాధ్యత అని సమాజానికి సేవ చేసేందుకు అందరూ ముందుండాలని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో నారా భువనేశ్వరి విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థుల క్రీడలను వీక్షించి క్విజ్ పోటీల్లో పలు ప్రశ్నలను అడిగారు. లిటిల్ ఛాంప్స్ రైజ్ షైన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె ప్రసంగించారు. జాతిపిత మహాత్మా గాంధీ, ప్రధాని మోడీ వంటి వారి నుంచి విద్యార్థులు, యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. మహాత్ముడిలా సమాజానికి సేవచేసే గుణం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల చదువులకు చేయూత అందించేందుకే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద చదువుకునే ప్రతి బిడ్డకు 15వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషితో ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల నుండి 1.06 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం గొప్ప విశేషం అన్నారు. ఒక్కరోజులో ఏ విజయమో రాదని నిరంతర కృషితోనే అది సాధ్యమవుతుందన్నారు. తెల్లవారుజామున లేవడం, పనిలో తల్లిదండ్రులకు సాయం చేయడం వంటివి విద్యార్థులు అలవాటు చేసుకోవాలని సూచించారు. తల్లి తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు. గురువులు మార్గదర్శకులని వారిని గౌరవించాలని సూచించారు. తాను చెన్నైలోనే చర్చి పార్క్ ప్రజెంటేషన్ కాన్వెంట్‌లో చదివానని విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవడం వల్లే ఎంచుకున్న రంగంలో విజయం సాధించినట్లు నారా భువనేశ్వరి పేర్కొన్నారు. యువత అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తనకు ఎదురైన ఇబ్బందులను అవకాశాలుగా మార్చుకొని ఎదిగినట్లు పేర్కొన్నారు. హెరిటేజ్ సంస్థ నిర్వహణలో తనకు వచ్చే సందేహాలను అడిగేందుకు తాను వెనకాడనని పేర్కొన్నారు .మంచి వ్యక్తులతో స్నేహం ఉన్నతికి దోహదపడుతుందన్నారు. పుస్తకాలు చదవడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్, ట్యాబ్‌లను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. తన మనవడు నారా దేవాన్ష్ పుస్తకాలు బాగా చదువుతాడని టీవీ, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటాడని పేర్కొన్నారు. విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు విజ్ఞానం పెంపొందించుకోవడానికి టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు,యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తో జీవితాలు నాశనమవుతాయన్నారు. వ్యసనాల నుంచి బయటపడడం చాలా కష్టమని పేర్కొన్నారు. పరీక్షల్లో విఫలమైతే జీవితానికి అది ముగింపు కాదన్నారు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోరాదని అలాంటి చర్యలతో తల్లిదండ్రులు కృంగిపోతారని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని భువనేశ్వరి సూచించారు.

**మా ఇంట్లో నేను కుప్పం పార్టీ:** తమ కుటుంబంలో రెండు పార్టీలు ఉన్నాయని, అందులో తాను కుప్పం పార్టీ అని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం గుడుపల్లె మండలం అగరం గ్రామంలో మహిళలతో ముఖాముఖిలో నారా భువనేశ్వరి ఆసక్తికరంగా మాట్లాడారు. మా ఇంట్లో ఒకటి కుప్పం పార్టీ, రెండోది మంగళగిరి పార్టీ అన్నారు. మంగళగిరి పార్టీలో మంత్రి లోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్ ఉంటారన్నారు. తాను మాత్రం కుప్పం పార్టీ అని చెప్పారు. తాను ఇంట్లో కుప్పానికి ఏం తెచ్చారు, ఏం ఇచ్చారు అని సిఎం చంద్రబాబును ప్రశ్నిస్తుంటానని పేర్కొన్నారు. చేసిన మంచి పనులు శాశ్వతం కావాలని, కుప్పంలో మనపేరు మిగలాలి అనేది తమ ఆలోచన అన్నారు. సిఎం చంద్రబాబుతో పోరాడి, కొట్లాడి కుప్పం ప్రజలకు మంచి చేస్తానన్నారు. కుప్పం ప్రజలు సిఎం చంద్రబాబును గుర్తుంచుకోవాలని 40 ఏళ్లుగా ఆయనపై కుప్పం ప్రజలు చూపుతున్న అభిమానానికి పాదాభివందనాలు చేస్తున్నానని భువనేశ్వరి పేర్కొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖలో సంస్కరణలకు కేంద్రం ప్రశంస

## మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖలో చేపడుతున్న సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పిడిఎస్)లో స్టీమ్ రైస్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల పార్బాయిల్డ్ ధాన్యం సేకరణకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా 'మీ మార్ట్' కాన్సెప్ట్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజార్లలో తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని విక్రయించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఎపి వ్యాప్తంగా స్వర్ణ వెరైటీ బియ్యాన్ని కిలో రూ.40కు అందించడమే ప్రభుత్వ లక్ష ్యమని మంత్రి తెలిపారు. రేషన్ కార్డుదారులకు 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.281 కోట్ల నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. ధాన్యం ట్రాకింగ్‌కు ఆర్ఎఫ్ఐడి టెక్నాలజీని అమలు చేస్తున్నామని అన్నారు. డిజిటల్ వాలెట్ విధానం ద్వారా సబ్సిడీల పంపిణీకి పైలట్ ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెప్పారు. షెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల కమిషన్ పెంపునకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో బియ్యం ధరల స్థిరీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. మిల్లర్లతో చర్చలు జరిపామని, ప్రస్తుతం కిలో రైస్ ధర రూ.52 వద్ద ఉండేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ వెరైటీ రైస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# గ్రామస్థాయిలోనూ శ్రీవారి సేవ విస్తరణ

**సేవకుల పనితీరు ఆధారంగా రేటింగ్ - టిటిడి ఇఒ రవిచంద్ర**




**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కీలకంగా ఉన్న శ్రీవారి సేవకులు స్వామివారికి సేవ చేయడానికి తిరుమలకు రావడంతో బాటు తమ ప్రాంతాలు, గ్రామాల్లోని స్థానిక ఆలయాల్లో సేవలందించేలా ప్రోత్సాహించాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర చెప్పారు. శ్రీవారి సేవకులకు వారి పనితీరు ఆధారంగా సిబిల్ స్కోర్ తరహాలో రేటింగ్ ఇచ్చి, ఆ రేటింగ్ ఆధారంగా విధులు కేటాయించే విధానంపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను గ్రామస్థాయిలో కూడా విస్తరించేందుకు టిటిడి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. తిరుమల శ్రీవారి సేవా సదన్‌లో గ్రూప్ సూపర్వైజర్లకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణా కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఇఒ రవిచంద్ర మాట్లాడుతూ శ్రీవారి సేవను మరింత విస్తరించేందుకు గ్రూప్ సూపర్వైజర్లు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 50 వేల ఆలయాలు ఉన్నాయని, ఆయా దేవాలయాల్లో శ్రీవారి సేవ ద్వారా భక్తులకు సేవలందించేందుకు ఉన్న అవకాశాలను శ్రీవారి సేవకుల ద్వారా టిటిడి దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

గ్రూప్ సూపర్వైజర్ల శిక్షణా కార్యక్రమం ద్వారా నేర్చుకున్న అంశాలను తమ ప్రాంతాల నుండి శ్రీవారి సేవకు విచ్చేసే ముందు సేవకులకు శిక్షణ ఇవ్వడం వల్ల వారు తిరుమలకు వచ్చి నాణ్యమైన సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. అనంతరం గ్రూప్ సూపర్వైజర్ల శిక్షణా కార్యక్రమం, శ్రీవారి సేవను గ్రామస్థాయిలో విస్తరించడం, భక్తులకు టిటిడి అందిస్తున్న సేవలను మరింత మెరుగు పరచడం వంటి అంశాలపై గ్రూప్ సూపర్వైజర్ల నుండి సలహాలు, సూచనలు స్వీకరించారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని భక్తులకు నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి. శ్రీనివాస్, చెన్నైకు చెందిన శరత్‌లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ, శ్రీవారి సేవా సదన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి: వైకాపా

**చిత్తూరు, జులై 28 ప్రభాతవార్త:** డిఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం చిత్తూరులో మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువత ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. డిఎస్సీ అక్రమాలపై బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి పదవికి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్‌తో మంగళవారం గాంధీ సర్కిల్ వద్దకు చేరుకున్న వైకాపా నాయకులు, పార్టీ శ్రేణులు గాంధీ విగ్రహం నుండి ఎంఎస్ఆర్ సర్కిల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం మళ్ళీ గాంధీ సర్కిల్ వరకు వచ్చి కూటమి ప్రభుత్వ ఆరాచాకాలపై నాయకులు ధ్వజమెత్తారు. చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి, పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్‌కుమార్, వైకాపా రాష్ట్ర యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ భాగ్యరాజ్ ప్రభంజన్‌ల ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డిఎస్సీలో అన్యాయానికి గురైన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు.





# మళ్లీ చిరుత సంచారం

**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతంలో మంగళం తిరుమలనగర్ ప్రాంతంలో చిరుతపులి సంచారం జనంలో భయం గొల్పిస్తోంది. మొన్నటివరకు తిరుమల కాలినడక మార్గాల్లో, తాజాగా మంగళం ఉపాధ్యాయ నగర్‌లో ఏకంగా ఓ ఇంటి ప్రహరీగోడపై సంచరించడం ఆందోళనకరంగా మారింది. ఒక్కసారిగా ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా ఆందోళనకరంగా మారింది. అటవీప్రాంతాన్ని ఆనుకుని వున్న కాలనీల్లో, అలిపిరి నడకమార్గాల్లో చిరుతపులుల సంచారంతో జనం మాత్రం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అటవీశాఖ మాత్రం ఒంటరిగా బయటకు వెళ్ళవద్దని సూచిస్తున్నారు.

# వ్యాసమహార్షి పుట్టిన రోజే 'గురుపూర్ణిమ'



ప్రతి సంవత్సరం ఆషాడశుద్ధ పౌర్ణమి రోజున గురుపూర్ణిమ జరుపుకుంటారు. ఈరోజున గురుపూజోత్సవం జరిపి గురువులకు కానుకలు బహుమతులు సమర్పించి వారిని సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకుంటారు. తమ జీవితానికి దిశానిర్దేశం చేసి, ముక్తివైపు నడిపించినందుకు ప్రతిఫలంగా ఇలా చేస్తారు. ఈరోజు వ్యాసమహాముని పుట్టిన రోజు కాబట్టి దీనికంత ప్రాముఖ్యత ఉంది. ఈరోజు చాలా మంది ప్రజలు రోజంతా ఉపవాసం ఉంటారు. సూర్యోదయం వేళ ఉపవాసం ఆరంభించి, చంద్రోదయం వేళకు ఉపవాసం ముగుస్తారు. గురువును భగవంతునికి భక్తునికి మధ్య సంధానకర్తగా భావిస్తుంటారు. వేదవ్యాసుని మానవజాతి కంతటికీ మంచి ఆధ్యాత్మిక వారసత్వాన్ని మిగిల్చి వెళ్లాడు. కాబట్టి ఆయన్ను మానవవాలి కంతటికీ గురువుగా భావిస్తుంటారు. వేదవ్యాసుని పూర్వనామం కృష్ణ ద్వైపాయనుడు. వేదకాలపు సంస్కృతినంతా నాలుగు వేదాల్లో ఆయన సంకలనం చేసిన తర్వాత ఆయన్ను వేదవ్యాసుడిగా పిలవడం ప్రారంభించారు. వేదాలతో పాటు మహాభారతం, మహాభాగవతంతో పాటు అష్టాదశ పురాణాలు రచించాడు వ్యాసుడు. వ్యాసుడు సప్తచిరంజీవుల్లో ఒకడు. దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో పూర్ణిమ వ్రతాన్ని ఆదిశక్తి పేరిట ఆచరిస్తుంటారు. ఈపర్వ దినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూర్ణిమనాడు కొంతమంది సత్యనారాయణవ్రతాన్ని లేదా పూజను నిర్వహిస్తుంటారు. షిరిడీ సాయినాథుని ఆలయాల్లో నేటి నుంచి మూడు రోజుల పాటు గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. చరిత్ర..వ్యాసులు మహాభారత రచయిత. పరాశర ఋషి ఓ మత్స్యకారుని కుమార్తె సత్యవతికి జన్మించిన రోజు కాబట్టి ఈరోజును వ్యాసపూర్ణిమగా కూడా జరుపుకుంటారు. వేద వ్యాసుడు తన కాలంలో ఉన్న అన్ని వేద స్తోత్రాలను సేకరించి వాటి లక్షణాలను ఆచారాలలో ఉపయోగించడం ఆధారంగా వాటిని నాలుగు భాగాలుగా విభజించడం ద్వారా వేద అధ్యయనాల కారణానికి గొప్ప సేవచేశాడు. తర్వాత వాటిని తన నలుగురు ముఖ్య శిష్యులైన పైల. వైశంపాయన, జైమిని సమంతులకు బోధించాడు. ఈ విభజించడం సవరించడం వలన ఆయనకు గౌరవ ప్రదమైన 'వ్యాస' లభించింది. ఆయన వేదాలను ఋగ్, యజుర్, సామ, అధర్వ అని నాలుగు భాగాలుగా విభజించారు. గురుపౌర్ణమి సందర్భంగా హిందూమతం, బౌద్ధమతం, జైనమతంలో వివిధ రకాలుగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించుకోవడం సంప్రదాయం. నేపాల్‌లో త్రీనోక్ గుహపూర్ణిమ పాఠశాలల్లో పెద్దరోజు. ఈరోజు నేపాలీలకు ఉపాధ్యాయ దినోత్సవం. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను రుచికరమైన వంటకాలు,దండలు స్వదేశీ బట్టతో తయారు చేసిన టోపి అని పిలిచే ప్రత్యేక టోపీలను అందజేస్తారు.. వ్యాసపౌర్ణమిరోజు పూజా విధానం..కొత్త అంగవస్త్రం మీద (నేలమీద పరచి) బియ్యం పోస్తారు. ఆ బియ్యంపైన నిమ్మకాయలు ఉంచుతారు. శంకరులు అతని నలుగురు శిష్యులు వచ్చి దానిని అందుకుంటారని నమ్మకం. పూజ అయ్యాక ఆ బియ్యం తీసుకెళ్ళి పిడికెడు చొప్పున తమ ఇండ్లలో బియ్యంలో కలుపుతారట. బియ్యం, కొత్త వస్త్రం లక్ష్మి చిహ్నం. నిమ్మపళ్ళు కార్యసిద్ధికి సూచన. నిమ్మపళ్ళు లక్ష్మి కటాక్షానికి చిహ్నం. దక్షిణాదిన కుంభకోణంలో శృంగేరిలో శంకర మఠాలలో వ్యాసపూర్ణిమ ఎంతో వైభవంగా జరుపుకుంటారు. అయితే ఈరోజున దేశంలోని మహర్షులంతా వ్యాసుని రూపంలో ఉన్న తమ గురువుని కొలుస్తారని పండితులు చెబుతారు. వైష్ణవపురాణం ప్రకారం దానం చేస్తే ఆషాడ పూర్ణిమనాడు విష్ణులోకం పొందుతారట. వ్యాసుడు సకల కళానిధి. సకలశాస్త్రవేత్త, శస్త్ర చికిత్స వేది, మేధానిధి, వైద్యపరుడు, ఆత్మ విద్యానిధి, ఈరోజున అష్టాదశ పురాణ నిర్మాత అయిన వ్యాసుని తప్పక పూజించాలి.

# నైపుణ్యంతోనే గెలుపు

**తమ కలల్ని నెరవేర్చు కుంటూ కోరుకున్న ఉద్యోగంలో కుదురుకున్నా.. పదోన్నతులు అందు కోవడంలో కొందరు వెనకబడుతుంటారు. ఇలాంటప్పుడు పనితీరుని సమీక్షించుకోవడం చాలా అవసరం అదెలాగంటే..**

**లక్ష్యాలకు తగ్గ ప్రణాళిక:** ప్రతి ఒక్కరికీ కొన్నిన లక్ష్యాలు ఉండాలన్నది నిజమే అయినా.. వాటిని సాధించడానికి మీ దగ్గర సరైన ప్రణాళిక ఉందో లేదో చూసు కోండి. ఎందు కంటే విజయ తీరాలకు చేరిన వారందరికీ స్పష్టమైన ఆలోచన, ప్లాన్ తప్పనిసరిగా ఉంటాయి మరి. అదీ డాక్యు మెంటేషన్ అయి ఉండాలి. లేదంటే మీ ఆలోచనలన్నీ నీటి మీద రాతలే అవు తాయి. కాలంతో పోటీ పడాలి:. ప్రణాళిక వేసు కోగానే విజయం మీ చెంతకి వచ్చేయదు. కాలం పై పట్టు, పనిపై అవ గహన కూడా ఉండాలి. ఎంత కష్టమైనా సరే, అనుకున్న గడువు కంటే ముందు చేయగలగాలి. ఇది ఒక్కసారిగా అలవడకపోవచ్చు. కానీ, ప్రయత్నిస్తే సాధ్యమే. ఎందుకంటే ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ కాలం కంటే వేగంగా పరుగెడితేనే గమ్యాన్ని చేరుకునేది. ఉద్యోగంలో చేరాం హమ్మయ్య అనుకుని సరిపెట్టేసుకోకండి. ఎప్పటికప్పుడు మార్కెట్ పోకడల్ని తెలుసుకుంటూ నైపుణ్యాలను ఒంట పట్టించు కోవాలి. ప్రముఖ సంస్థలు అప్పుడప్పుడూ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటుచేస్తుంటాయి. అలాంటి వాటిని వినియోగించుకుని నైపుణ్యాలతో పాటు వన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. చిన్న విజయానికే పొంగిపోవడం, వెనకబడినప్పుడు కుంగిపోవడం సరికాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మానసిక స్థైర్యాన్ని కోల్పోకూడదు. పొరపాటు జరిగితే కారణాలను నిశితంగా పరిశీలించుకోవాలి. విశ్లేషించుకుని.. మరోసారి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడపనిలో నైపుణ్యం సాధించడంతో పాటు పదోన్నతులూ అందుకోగలుగుతారు. □



# 'పట్టు'దలతో 'నీట్'గా మెడికోలుగా..



కలలు కనడంతోనే సరిపోదు. వాటిని నిజం చేసుకోవడంలోనూ పడే శ్రమ ఒక జీవితానికి సరిపోక పోవచ్చు. ఐనా పట్టుదలతో సాధించలేనిదేదీ ఉండదని ఓ మహిళామ తల్లి నిరూపించింది. సంకల్పం ఉంటే చాలు దానికి వయసుతో నిమిత్తం లేదని ఆమె నమ్మింది అందుకే కూతురితో కలిసి 'నీట్'గా స్వయం కృషితో చదివి పోటాపోటీగా ఉత్తీర్ణత సాధించింది. ఇప్పుడిద్దరూ వైద్య విద్యలో సహవిద్యార్థులు. వారిద్దరూ ఒకేసారి ప్రతిష్టాత్మక 'నీట్' పరీక్షలో ఉతీర్ణత సాధించారు. రాబోయే తరంలో కాబోయే డాక్టర్లుగా మెడికోలుగా సహ విద్యాభ్యాసం చేస్తున్న ఆ తల్లీ కూతుర్ల సంకల్పం, విజయ ప్రస్థానం మహిళా లోకానికి ఆదర్శప్రాయమే.తమిళనాడులో తెన్కాశికి చెందిన ఆముదవల్లి, మణిమన్నన్‌కు చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనే బలమైన కోరిక. ఆర్థిక ఇబ్బందుల వల్ల తన ఆకాంక్షను పక్కన పెట్టేశారు. ఏ నాటికైనా సాధించలేక పోతానా? అనుకుంటూనే ఫిజియోథెరపిస్ట్‌గా సరిపెట్టుకున్నారు. ఆమె కూతురు సంయుక్త వైద్య విద్యనభ్య సించడం కోసం 'నీట్' పరీక్షకు సిద్ధమ య్యారు. ఆముదవల్లి మనసాగలేదు. తానూ చదువుకోవాలన్న ఉత్సా హం ఉరిమురిమి పడుతోంది. మనసటు లాగేసింది. కుమార్తై పరీక్షల కోసం రాత్రింబవళ్లు చదువుతుంటే తల్లి అముదవల్లి కూడా అవే పుస్తకాలు చదవడం ప్రారంభిం చారు. ఆ క్రమంలో కుమార్తైకు చదువు చెప్పే ఉద్దేశంతో మొదలైన ఆసక్తి ఆముదవల్లిలో చిన్ననాటి కల వెన్ను తట్టి లేపింది దాంతో ఆమె, కూతురితో కలిసి 'నీట్' రాసేందుకు ఏర్పాట్లు చేసుకొంది. ఇద్దరూ కలిసి ఒకేచోట కూర్చుని సందేహాలను నివృత్తి చేసుకుంటూ, ఒకరికొకరు గురువుగా పరీక్షకు సిద్ధమయ్యారు. ఇటీవల విడుదలైన 'నీట్' ఫలితాలలో వీరిద్దరి శ్రమకు తగిన ఫలితం దక్కింది. తల్లి ఆముదవల్లి 147 మార్కులు సాధించి తన సొంత ఊరికి దగ్గరలోనే ఓ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు దక్కించుకుంది. కుమార్తై సంయుక్త 450 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కౌన్సిలింగ్‌లో సీటు పొందింది. ఆ తల్లీకూతుర్ల విజయ గాధ వింటేనే ఎందరికో స్ఫూర్తి కలిగిస్తోంది. □

# గంటల తరబడి ఒకే చోట? వామ్మో



**ఈ రోజుల్లో ఉద్యోగం చేసే మహిళల సంఖ్య ఎక్కువగానే ఉంది. వాళ్లలో చాలామంది క్షణం తీరికలేని పనిలో నిమగ్నమవుతున్నారు.**

అలా ఆఫీసులో గంటల తరబడి కూర్చోవడం వల్ల ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూసుతుంది. ఆఫీసుకి వెళ్లిన వెంటనే కూర్చుంటారు. ఆపై పని కారణంగా లేవలేని పరిస్థితి అలా గంటల కొద్దీ కూర్చోవడం వల్ల శరీరంలో కణాలు బలహీనపడతాయి. దీని కారణంగా రోగనిరోధక వ్యవస్థ ప్రభావితమవుతుంది. మెడ, వెన్నునొప్పి సమస్యలు మొదలవు తాయి. కాబట్టి, ఎంత బిజీగా ఉన్నా, పని మధ్యలో కొంత విరామం తీసుకోవడానికి ప్రయత్నించాలి. పని ముగిసిన తర్వాత కొదిపాటి వ్యాయామం చేస్తూ ఉంటే కండరాలు చురుకుగా పని చేస్తాయి. నిరంతరం ఒకే చోట కూర్చొని పనిచేయడం వల్ల కెలోరీలు ఖర్చుకావు. దాంతో ఊబకాయం, బరువు పెరగడం జరుగుతుంది. పని మధ్యలో నీళ్ల తాగుతూ, విరామం సమయంలో నడవడం చేస్తుండాలి. ఇల్లు లేదా ఆఫీసులో ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల మోకాళ్ల, నడుము నొప్పి వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. □

# బేసన్ ఖీర్



**కావలసినవి:** శనగపిండి: అర కప్పు, నెయ్యి: అర కప్పు, పాలు: లీటరు, చక్కెర: ఒక కప్పు, తరిగిన డ్రైఫ్రూట్స్ (బాదం, జీడిపప్పు, పిస్తా, కిస్మిస్): అర కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, ఎల్లో ఫుడ్ కలర్: చిటికెడు.

**తయారీ:** స్టవ్ మీద కడాయి పెట్టి నెయ్యి వేయాలి. వేడయ్యాక శనగపిండి వేసి పచ్చివాసన పోయేలా వేయించాలి. ఆ పిండిలో తరిగిన డ్రైఫ్రూట్స్, యాలకుల పొడి వేసి మరికాసేపు వేయించాక పాలుపోసి మరగనివ్వాలి. మరుగుతున్న మిశ్రమంలో చక్కెర, ఎల్లో ఫుడ్ కలర్ జోడించి దగ్గర పడేంతవరకు ఉడికించి దించుకుంటే సరిపోతుంది. □

చెలి
మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం..
ఈ మెయిల్: Cheli@vaartha.com


తెర

# 'కొరియన్ కనకరాజు'.ఆడియన్స్ నవ్వుతూనే ఉంటారు: రితిక నాయక్



**డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?**
కొరియా వెళ్ళడం నన్ను మొదట ఆకట్టుకుంది. (నవ్వుతూ) ఎందుకంటే నాకు కొరియన్ కల్చర్, అక్కడి సినిమాలు, కొరియన్ డ్రామాలు అంటే చాలా ఇష్టం. ఇందులో నేను చేసిన పాత్రకు, నా వ్యక్తిత్వానికి కూడా కొన్ని పోలికలు ఉన్నాయి. ఇది కేవలం కమర్షియల్ పాత్ర మాత్రమే కాదు. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.
**కథల ఎంపిక విషయంలో మీరు చాలా సెలెక్టివ్‌గా ఉంటారా?**
అవును. నాకు చాలా ఓపిక ఉంది. మంచి స్క్రిప్ట్ కోసం ఎంతకాలమైనా ఎదురుచూడగలను. ఒక పాత్రకు నేను 100 శాతం న్యాయం చేయగలనని అనిపిస్తేనే అంగీకరిస్తాను.
**ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**
ఈ సినిమాలో నేను సెల్ఫ్ ఇండిపెండెంట్, చాలా మోడరన్ అమ్మాయిగా కనిపిస్తాను. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలన్నింటికంటే ఇది చాలా మోడరన్ క్యారెక్టర్.
**వరుణ్ తేజ్‌తో కలిసి పనిచేయడం ఎలా అనిపించింది?**
వరుణ్ తేజ్ చాలా హార్డ్‌వర్కింగ్ పర్సన్. తన వృత్తి పట్ల ఎంతో డెడికేషన్ ఉంటుంది. ఇటీవల కొన్ని ప్యాచ్‌వర్క్ షూట్స్ చేశాం.
**షూటింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి చెప్పండి?**
అనంతపురంలో కొంత భాగం షూటింగ్ చేశాం. అలాగే కజకిస్థాన్, కొరియాలో షూటింగ్ చేశాం. మొత్తం షూటింగ్ జర్నీ చాలా బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్‌గా నిలిచిపోయింది.
**యూవీ క్రియేషన్స్‌తో కలిసి పనిచేయడం ఎలా అనిపించింది?**
యూవీ క్రియేషన్స్‌తో పనిచేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్. షూటింగ్ సమయంలో ఒకసారి నేను అనారోగ్యానికి గురయ్యాను. ఆ సమయంలో నిర్మాతలు నా గురించి ఎంతో కేర్ తీసుకున్నారు.
**ఇతర భాషల్లో కూడా సినిమాలు చేయాలనుకుంటున్నారా?**
మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాను. అవకాశం వస్తే తప్పకుండా అన్ని భాషల్లో పనిచేయాలని ఉంది. కానీ తెలుగుకే నా మొదటి ప్రాధాన్యత.
**భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు?**
మంచి కథ, పాత్రకు ప్రాధాన్యం ఉన్న అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది.

# 'డూప్'లొద్దు! 'రిస్క్'తో..














తెలుగు చిత్రసీమలో నిన్నమొన్నటి, నేటి తారల మధ్య అంతరం ఎప్పుడు కన్పిస్తునే ఉంటుంది. తొలితరం మూకీ నుంచి ప్రారంభమైన టాకీలోకి వచ్చేసరికి నటనే ప్రధానంగా అఖిల తెలుగు ప్రేక్షకుల ఆదరణ, మలి తరం నటనతోపాటు స్వయం కృషితో నాట్యాభినయంతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. నేటి తరం సరికొత్త పోకడలతో ప్రేక్షకాదరణకోసం ట్రెండ్ మార్చింది. విపరీతమైన 'రిస్క్'లు చేసి సినిమాల్ని విజయవంతం చేయడమే ప్రధానంగా భావిస్తున్నారు. ఎడాపెడా వచ్చేవి వస్తున్నవి ఇక 'పాన్' ఇండియా చిత్రాలే కనుక ప్రపంచ వ్యాప్తంగా దక్షిణాది చిత్రాలను విశ్వవ్యాప్త చిత్ర రాజాలుగా విస్తృత సొంతం చేసుకుంటున్నాయి. ఈ తరం హీరోలు ప్రతి ఒక్కరూ నటనకే ప్రాధాన్యత కాకుండా తాము ధరించే ప్రాత్రల్లో వైవిధ్యత కనపడే విధంగా రూపకల్పన చేసు కొంటున్నారు. ఒకప్పుడు ఫైట్స్ చేయాలంటే 'డూప్'లుండేవారు. ఇప్పుడు స్వయంగా వారే యుద్ధ విన్యాస చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఏమైతే సాహసానికి వారే ప్రతినిధులుగా 'హీరోదాత్తత'ను చూపిస్తున్నారు. పాత్రోచితంగా బరువు తగ్గడాలు, వ్యాయామంపై దృష్టి, డైట్, గడ్డం, స్టైల్, మేకప్ అన్నింటిలోనూ విభిన్నత చూపిస్తున్నారు. వాటికెంతో ఆసక్తి, పట్టుదల కలిగి ఉన్నవారే చిత్రసీమలో రాణిస్తున్నారు. ఈ క్రమంలో అఖండుడు 'బాలకృష్ణ','పెద్ది' రాంచరణ్ తేజ్, 'ఓజి' పవన్‌కళ్యాణ్, టైగర్ జూనియర్ ఎన్‌టిఆర్‌లు రిస్క్‌ఫైట్‌లు, నటనలతో 'సర్జరీ'ల వరకు వచ్చారు. వారలాంటి ఇబ్బందికి గురవుతున్నరంటే ఆయా పాత్రల్లో జీవిస్తు న్నారనే చెప్పాలి. వారి శ్రమ అందులో కనపడుతుంది. అందుకే ప్రేక్షక జనం వారినారాధిస్తున్నారు. థియేటర్‌లో ఈలలు వేస్తున్నారు, కేరింతలు కొడుతున్నారు. ఇవేమీ చేయకూండా కేవలం వారసత్వంలోనో, అదృష్టవశాత్తునో హీరోలైపోయారంటే నమ్మలేం. సినీ పరిశ్రమలో అందం, ఫిట్‌నెస్,యవ్వనాన్ని కాపాడుకోవడం.. ఇవన్నీ ప్రథమ ప్రాధాన్యతలోనే ఉంటాయి. మన చిత్రాల్లో మన హీరోలకు ఎంతమందినైనా చితకబాదే సన్నివేశా లుంటాయి. డూప్‌లతో సరిపెడితే సరి. కానీ నేటి తరం హీరోలు తామే స్వయంగా చిత్రీకరణలో ఉంటామనడమే చిక్కొచ్చిపడింది. కొందరు సినీ యువ హీరోలి ప్పుడు 'సర్జరీ'ల బాటపట్టారు. మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవరప్రసాద్' చిత్ర ప్రమోషన్స్ సమయంలో 'మోకాలి నొప్పి'కి సర్జరీ చేయించుకు న్నారనే వార్త 'హల్‌చల్' అయింది. మొన్నీమధ్య నందమూరి బాలకృష్ణ కాకినాడలో షూటింగ్‌లో ఉండగా జారి పడితే ఫ్యాక్చర్‌కు శస్త్ర చికిత్స చేయించు కున్నారు. పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ ముంబాయి ఆసుపత్రిలో రెండు భుజాలకు సర్జరీ. మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్‌కు కోయం బత్తూరులో మణికట్టుకు ఆర్థోపెడిక్ వైద్యం విశిష్ట చికిత్సలు చేసే వైద్యునిగా పేరొందిన డాక్టర్ రాజశేఖర్ శస్త్ర చికిత్స చేసారు. ఈ శాస్త్ర చికిత్సలో అమెరికాలోని మయామికి చెందిన ప్రముఖ హ్యాండ్ అండ్ రిస్ట్ సర్జన్ డాక్టర్ అలెహాండ్రో బాడియా ప్రత్యేకంగా పాల్గొన్నారు. అంతకు ముందు 1982లో బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ 'కూలీ' చిత్రం షూటింగ్‌లో ప్రాణాంతక ప్రమాదం జరగా 'సెలబ్రిటీల శస్త్ర చికిత్సలపై అప్పట్లోనే చర్చ మొదలైంది. సాధారణంగా ఇలాంటివి జరిగినప్పుడు ఆయా కథానాయకుల అభిమానులు ఆ హీరోల ఆరోగ్యం కోసం వేయి దేవుళ్లకు మొక్కుతుంటారు. ఇప్పుడు అదే జరిగింది. స్టార్‌డమ్' వెనుక కష్టాలు, పట్టుదల, ఉంటేనే ఆ రంగంలో రాణిస్తారన్నది సర్వవిదితం. యాక్షన్ సీన్స్‌లో తామే స్వయంగా పాల్గొనాలన్న జిజ్ఞాస కారణంగా జూనియర్ ఎన్టీయార్ కూడా సర్జరీ చేయించుకున్నారని ఫిల్మ్ ఇండస్ట్రీ టాక్. చిత్రాలు, చిత్ర కథానాయకులు, పాత్ర ధారులు ప్రేక్షకులకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, సమాజపు అడుగుజాడల్ని ప్రత్యక్షంగా అందచేయా లని సంకల్పించనందున వారి శ్రమ ఊరికే పోరాదు.

# 'చెన్నై లవ్ స్టోరీ' సక్సెస్ మీట్‌లో నాగచైతన్య



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన "చెన్నై లవ్ స్టోరీ" సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో ఆకట్టుకున్నా రంటూ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారు. దర్శకుడు, నటుడు దేవిప్రసాద్ మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ లాంటి మంచి ప్రేమ కథా చిత్రానికి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్ దర్శకుడు, నటుడు కరుణ కుమార్ మాట్లాడుతూ సినిమాల ట్రెండ్ మారుతున్నా, ఎప్పటికీ మారనివి ప్రేమ కథలు మాత్రమే. అలా వచ్చిన మంచి ప్రేమ కథా చిత్రం చెన్నై లవ్ స్టోరీ. లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ మాట్లాడుతూ ఏ నిర్మాతలైనా ఆదివారం వరకు గుండెల మీద చేయి వేసుకుని ఉంటారు. సోమవారం వారిలో ఉత్కంఠ మొదలవు తుంది. మైత్రీ శశి మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ సినిమాకు నైజాంలో మార్నింగ్ షోస్ 40 లక్షల గ్రాస్ వస్తే మ్యాట్నీకే 90 లక్షలకు పెరిగింది. అంటే ఈ సినిమాను ప్రేక్షకులు ఎంత ఫాస్ట్ గా రిసీవ్ చేసుకున్నారు అనేది తెలుస్తోంది. హీరో నాగచైతన్య మాట్లాడుతూ ఈ ఈవెంట్ కు వచ్చినందుకు నాకు థ్యాంక్స్ చెబుతున్నారు. నాకు కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం లేదు. ఈ వేదిక మీద మీ అందరి సక్సెస్ సెలబ్రేట్ చేయడం నాకు హ్యాపీగా ఉంది.

# ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' AK47లో స్వర్ణగా శ్రీనిధి శెట్టి పరిచయం



విక్టరీ వెంకటేష్ పోషించిన చిట్టిబాబు పాత్ర పరిచయానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిన నేపథ్యంలో, 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' (AK47) చిత్ర బృందం ఈ ఆదర్శ కుటుంబంలోని మరో కీలక సభ్యురాలిని పరిచయం చేసింది.ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి 'స్వర్ణ' పాత్రలో నటిస్తున్నారు. చిట్టిబాబుకు భార్యగా, చిరునవ్వే చిరునామాగా ఉండే ఓ ఆప్యాయమైన మధ్యతరగతి ఇల్లాలిగా ఆమె పాత్ర ప్రేక్షకుల హృదయాలను హత్తుకోనుంది. చిట్టిబాబు–స్వర్ణల మధ్య ఉండే అనుబంధం, చిలిపి సంభాషణలు, అనురాగం, కుటుంబ విలువలు సినిమాకు మరింత ఆత్మను, ఆహ్లాదాన్ని అందించనున్నాయి.విడుదలైన ఈ క్యారెక్టర్ గ్లింప్స్‌లో నివేదా పేతురాజ్, ప్రముఖ హాస్యనటుడు సత్య కొన్ని క్షణాలు కనిపిస్తూ చిత్రంలోని వినోదాత్మక వాతావరణాన్ని మరింత ఆసక్తికరంగా మలిచారు. ఇప్పటికే విడుదలైన పాత్ర పరిచయాలు ప్రేక్షకుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించగా, త్వరలోనే యువినా పార్థవిను సంపూర్ణగా, రాజా ప్రజ్వల్ను 'సర్వ'గా చిత్ర బృందం పరిచయం చేయనుంది.

# KJQ (కింగ్ జాకీ క్వీన్) ట్రైలర్ రిలీజ్



సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి SLV సినిమాస్ బ్యానర్ పై నిర్మించిన పీరియడ్ క్రైమ్ డ్రామా KJQ(కింగ్ జాకీ క్వీన్). 1990ల నాటి నేప థ్యంలో సాగే ఈ చిత్రంలో దసరా, దిగర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. వీరితో పాటు నూతన నటుడు శశి ఓదెల, యుక్తి తరేజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గత ఏడాది కన్నుమూసిన దర్శకుడు రీరీకి ఇది చివరి చిత్రం. ఆయన క్రియేటివిటీ, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావానికి ఇది ఒక నివాళిగా నిలుస్తుంది. దావూద్ ఇబ్రహీం, అజ్మల్ కసబ్, మదర్ థెరిసాలతో పోలుస్తూ ప్రధాన పాత్రలను పరిచయం చేసే ఆకట్టుకునే వాయిస్‌ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పరిస్థితులు ఒక మనిషిని క్రూర మృగంగానో, గొప్ప మహర్షిగానో లేదా సాధారణ మనిషి గానో ఎలా మారుస్తాయో ఇది సూచిస్తుంది, దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా పోషించిన పాత్రలకు బలమైన పునాదిని వేస్తుంది. దీక్షిత్ శెట్టి అద్భుతమైన నటనతో కథను తన భుజాలపై మోశారు, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, నటన కథనానికి ఎంతో బలాన్ని చేకూర్చాయి. నూతన నటుడు శశి ఓదెల తన నటనతో ఆకట్టుకుని మంచి ముద్ర వేశారు, దర్శకుడు రీరీ ఎమోషన్స్ సంఘర్షణలు, ఆసక్తి కరమైన సన్నివేశాల కలయికతో ఈ

# 'శ్రీ శ్రీ' నుంచి 'బొమ్మ బొమ్మ' సాంగ్ రిలీజ్



వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ శ్రీ శ్రీ బిజీగా ఉన్నారు. ప్రతిష్టాత్మక ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, నిర్మాణ సంస్థకు 10వ ( SLV10) మైల్ స్టోన్ చిత్రంగా నిలుస్తోంది. ఇషాన్ సక్సేనా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జంటగా నటిస్తున్న ఈ సినిమా ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన వర్కింగ్ స్టిల్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన అందుకోగా, తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ తొలి పాట 'బొమ్మ బొమ్మ'ను మేకర్స్ విడుదల చేశారు. రైల్వే స్టేషన్‌లో బెంచ్‌పై కూర్చున్న దుల్కర్ సల్మాన్, ప్లాట్‌ఫామ్‌పైకి పూజా హెగ్డే అడుగుపెట్టిన క్షణమే ఆమెకు మెస్మరైజ్ అవుతాడు . అక్కడి నుంచి ఇద్దరి అందమైన ప్రేమ ప్రయాణాన్ని, ఆనంద క్షణాలను, వారితో పాటు ఉండే ఓ బృందాన్ని ఈ పాటలో అందంగా చూపించారు.సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ మరోసారి మనసును హత్తుకునే మధురమైన మెలోడీని అందించారు. ఆహ్లాదకరమైన ట్యూన్, అందమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఈ పాట ఆకట్టుకుంటుంది.అనంత శ్రీరామ్ తన సాహిత్యంతో ప్రేమలో మునిగిపోయిన ఓ యువకుడి భావాలను కవితాత్మకంగా ఆవిష్కరిస్తూ, కథానాయిక అందం, ఆమె ప్రత్యేకతను ఎంతో అందంగా వర్ణించారు.

# క్లీన్‌స్వీప్ చేసినా మారని తీరు



## నాలుగు పొరపాట్లతో టీమిండియా

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరిగిన టి20 సిరీస్‌ను టీమిండియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసి అదరగొట్టింది. అయితే 2028 ప్రపంచకప్ లక్ష్యంగా సాగుతున్న ఈ కీలక ప్రయాణంలో ప్రయోగాలు చేయకపోవడం తీవ్రంగా నిరాశపరిచింది. ఈ పర్యటనలో అత్యంత ప్రతిభావంతుడైన ఫాస్ట్ ఆల్‌రౌండర్ సూర్యాన్ష్ షెడ్జ్‌ను పక్కన పెట్టడం పెద్ద లోపం. కేవలం మూడో మ్యాచ్‌లో మాత్రమే అతనికి అవకాశం దక్కింది. హార్దిక్ పాండ్యాకు తగిన ప్రత్యామ్నాయాన్ని వెతికే ప్రక్రియలో షెడ్జ్ లాంటి యంగ్‌స్టర్‌కు 3 మ్యాచుల్లోనూ ఛాన్స్ ఇవ్వాల్సింది. నితీష్ కుమార్‌కు గాయాలు, శివమ్ దూబే జట్టులో ఇంకా స్థానాన్ని ఖాయం చేసుకోకపోవడంతో షెడ్జ్ అత్యంత కీలకమైన ఆటగాడిగా మారే అవకాశముంది. ముస్తాక్ అలీ ట్రోఫీలో 5 వికెట్లు తీయడంతో పాటు, గత ఐపిఎల్‌లో విలువైన పరుగులు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. అలాగే శ్రీలంకఎతో పోరులో అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. బలహీనమైన జింబాబ్వేపై వరుస ఛన్స్ ఇచ్చి ఉంటే అతడి బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యాలపై స్పష్టత వచ్చేది. ఒకే ఒక్క మ్యాచ్ ఆధారంగా ఈ యువ ఆటగాడి సామర్థ్యాన్ని అంచనా వేయడం ఏమాత్రం సరైన పద్ధతి కాదు. అలాగే బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చడం ఎంతో ముఖ్యం. ఐసిసి టోర్నీల్లో పరిస్థితులకు అనుగుణంగా మారే జట్లే విజయం సాధిస్తాయి. అయితే ఈ సిరీస్‌లో భారత్ పాత పద్ధతిలోనే సాగడం గమనార్హం.
అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఓపెనర్లుగా రాగా, మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు వచ్చారు. నిరాశపరిచిన అభిషేక్ శర్మ స్థానంలో తిలక్ వర్మను ఓపెనర్‌గా పంపే ప్రయోగం చేయాల్సింది. ఇక పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్న శివమ్ దూబేను ఆర్డర్‌లో ముందుకు పంపి క్రీజులో ఎక్కువ సమయం గడిపేలా చేసి ఉంటే అతడికి లయ చిక్కేది. మిడిలార్డర్‌లో రింకూ సింగ్‌ను కేవలం ఫినిషర్‌గానే కాకుండా ఇన్నింగ్స్‌ను నిలబెట్టే యాంకర్‌గా పరీక్షించేందుకు ఇది మంచి సమయం. ఐపిఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కష్టాల్లో పడినప్పుడు నాలుగో స్థానంలో వచ్చి ఇన్నింగ్స్ నిర్మించిన అనుభవం అతడికి ఉంది. ఈ సిరీస్‌లో అతడిని మూడో స్థానంలో ప్రమోట్ చేసి ఉంటే రింకూలో ఉన్న మరో కోణం బయటపడేది. భవిష్యత్తులో టాప్ ఆర్డర్ బ్యాటర్లు గాయపడితే రింకూ లాంటి ఆటగాడు ఆ స్థానాన్ని భర్తీ చేయగలడనే నమ్మకం కుదిరేది.
మరోవైపు ఎడమచేతి వాటం స్పిన్నర్ హర్ష్ దూబేకు అరంగేట్రం చేసే అవకాశం దక్కకపోవడం మరో లోపం. రవీంద్ర జడేజా కెరీర్ ముగింపునకు చేరువవుతున్న వేళ సరైన ప్రత్యామ్నాయ స్పిన్నర్ కోసం వెతుకులాట సాగుతోంది. విజయ్ హజారే ట్రోఫీ, ఐపిఎల్ 2026లో సత్తా చాటిన దూబేను తుది జట్టులోకి తీసుకుని ఉంటే భారత్‌కు మరొక నాణ్యమైన స్పిన్ బౌలర్ అందుబాటులోకి వచ్చేవాడు.







### కామన్వెల్త్ గేమ్స్‌లో

## షర్మిలకు స్వర్ణం శిల్పకు కాంస్యం

### అజయ్‌కు రజతం, బింద్యాకు కాంస్యం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ మహిళల ఎఫ్57 షాట్‌పుట్ విభాగంలో షర్మిల, శిల్పలు కలిసి భారతదేశానికి చారిత్రాత్మక డబుల్ పోడియంను అందించారు. ఈవెంట్‌లో షర్మిల భారతదేశానికి మొట్టమొదటి స్వర్ణ పతకాన్ని అందించగా, శిల్ప కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వీరు ఇద్దరూ కలిసి కామన్వెల్త్ గేమ్స్‌లో పారా అథ్లెటిక్స్ పతకం గెలిచిన తొలి భారతీయ మహిళలుగా నిలిచారు. షర్మిల తన ప్రచారాన్ని 9.48 మీటర్ల త్రోతో ప్రారంభించి, దానిని 9.58 మీటర్లకు మెరుగుపరిచి, ఆపై తన మూడవ ప్రయత్నంలో 9.81 మీటర్ల త్రోతో చివరికి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఆమె మిగిలిన మూడు ప్రయత్నాలలో 9.17 మీ, 9.37మీ, మరియు 9.60 మీ స్కోరుసాధించి, చాలా సునాయాసంగా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అయితే, శిల్ప పోడియంకు చేరుకున్న మార్గం మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఆమె మొదట 7.26 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో నాల్గవ స్థానంలో నిలిచింది, కానీ ఈవెంట్ ముగింపులో నైజీరియాకు చెందిన యూకారియా ఇయాజీని అనర్హురాలిగా ప్రకటించిన ఫలితంగా ఆమెకు కాంస్య పతకం లభించింది. వెయిట్‌లిఫ్టింగ్ పురుషుల 79 కేజీల విభాగంలో మలేషియా వెయిట్‌లిఫ్టర్‌తో హోరాహోరీగా తలపడిన అజయ్‌బాబు, చివరకు 330 కేజీల విభాగంలో కేవలం ఒకకిలో తేడాతో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. బింద్యారాణి 199 కిలోల బరువును ఎత్తి, మహిళల 58 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుని, వరుసగా తన రెండవ కామన్వెల్త్ గేమ్స్ పతకాన్ని కైవసం చేసుకుంది.



### శ్రీలంక పర్యటనకు..

## భారత్ టెస్ట్ టీమ్ ఖరారు

### జట్టులోకి బుమ్రా, సారాంశ్

**న్యూఢిల్లీ:** ఆగస్టు 15న ప్రారంభమయ్యే శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం భారత జట్టును మంగళవారం ప్రకటించారు. శుభ్‌మన్ గిల్ జట్టుకు నాయకత్వం వహించడం కొనసాగిస్తాడు, కేఎల్ రాహుల్ అతనికి డిప్యూటీగా ఉంటాడు. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాను జట్టులోకి తీసుకున్నారు, కానీ అతనిభాగస్వామ్యం ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడిఉంటుంది. స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కండరాల గాయం కారణంగా మొదటి టెస్టుకు దూరమవ్వగా, అతని స్థానంలో భారత జట్టులోకి సారాంశ్ జైన్‌ను తీసుకున్నారు. భారత్ జట్టులో శుభమన్ గిల్ (కెప్టెన్), కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్‌కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవీంద్రజడేజా, కుల్దీప్‌యాదవ్, మానవ్ సుతార్, జస్ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్‌బ్రార్, దేవదత్ పడిక్కల్, సరన్ష్ జైన్ ఉన్నారు.

### వరల్డ్ యూత్ క్లైంబిగ్ ఛాంపియన్..

## రికార్డు నెలకొల్పిన అమీరా



**న్యూఢిల్లీ:** భారతదేశానికి చెందిన 15 ఏళ్ల స్పీడ్ క్లైంబింగ్ ప్రతిభావంతురాలు అమీరా ఖోస్లా, ఇటలీలోని ఆర్కోలో మంగళవారం జరిగిన ఐఎఫ్ఎస్‌సి ప్రపంచ యూత్ క్లైంబింగ్ ఛాంపియన్‌షిప్స్-2026లో కొత్త భారత జాతీయ యూత్ రికార్డును నెలకొల్పి, ప్రపంచంలో ఆరవ స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించింది. స్పీడ్ క్లైంబింగ్ ఈవెంట్ ఫైనల్స్‌లో అమీరా 7.60 సెకన్ల అద్భుతమైన సమయాన్ని నమోదు చేసి, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను రెండుసార్లు మెరుగుపరుచుకుంది.
అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో 7.74 సెకన్లను నమోదు చేసిన ఆమె, ఫైనల్‌లో మరింత వేగవంతమైన ప్రదర్శనను కనబరిచింది. ఆమె సాధించిన విజయం, ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్‌లలో ఒక భారతీయ అథ్లెట్ సాధించిన అత్యుత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. క్లైంబింగ్‌తో పాటు, అమీరా అథ్లెటిక్స్‌లో కూడా తనదైన ముద్ర వేసింది. ఆమె నేషనల్ స్కూల్ గేమ్స్ 2024లో 100 మీటర్ల పరుగులో రజత పతకం గెలుచుకుంది.
2024 నుండి 2026 వరకు వరుసగా మూడు సంవత్సరాల పాటు 60 మీటర్ల పరుగులో ఢిల్లీ స్టేట్ ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టులో శ్లోక్ దాదుకర్, నీల్ వార్కే, రుద్ర కరండికర్ కూడా ఉన్నారు. దాదుకర్ 6.76 సెకన్ల టైమింగ్‌తో 27వ స్థానంలో నిలవగా, వార్కే 7.33 సెకన్ల టైమింగ్‌తో 35వ స్థానాన్ని దక్కించుకున్నారు. కరండికర్ 8.47 సెకన్ల టైమింగ్‌తో 44వ స్థానంతో తన ప్రయాణాన్ని ముగించారు.

## కామన్వెల్త్‌లో.. సర్వేశ్‌కు రజతం



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెటిక్స్ చరిత్రలోనే అత్యంత స్ఫూర్తిదాయకమైన అధ్యాయాలలో ఒకదాన్ని సర్వేశ్ కుషారే లిఖించారు. 31 యేళ్ల కుషారే, ఫైనల్‌లో 2.25 మీటర్ల అత్యుత్తమ ఎత్తును అధిగమించి, కామన్వెల్త్ గేమ్స్ 136 యేళ్ల చరిత్రలో హైజంప్‌లో రజత పతకం గెలుచుకున్న తొలి భారతీయుడిగా నిలిచాడు. పురుషుల హైజంప్ ఫైనల్‌లో పాల్గొన్న ముగ్గురు భారతీయులలో సర్వేశ్ కుషారే ఒకడు. మిగతా ఇద్దరూ పతకాల పోటీ నుండి వైదొలగగా, అతను మాత్రం పోరాటం కొనసాగించి భారతదేశానికి పోడియం స్థానాన్ని సాధించిపెట్టాడు. హై జంప్‌లో కుషారే తన మొదటి ప్రయత్నంలోనే 2.20 మీటర్లతో సహా తన మొదటి నాలుగు ఎత్తులను అధిగమించి, బలమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, 2.25 మీటర్ల వద్ద తన మొదటి రెండు ప్రయత్నాలలో విఫలమవడంతో అతను అకస్మాత్తుగా అగ్రస్థానం నుండి వెనుకబడ్డాడు. కానీ తన మూడవ ప్రయత్నంలో తీవ్రంగా పోరాడి, బార్‌ను అధిగమించి, భారతదేశానికి పతకాన్ని ఖాయం చేశాడు. జమైకాకు చెందిన స్వర్ణ పతక విజేత రొమైన్ బెక్‌ఫోర్డ్ లాగే, అతను 2.28 మీటర్ల వద్ద చేసిన మూడు ప్రయత్నాలలోనూ విఫలమైన ప్పటికీ, కౌంట్‌బ్యాక్ ఆధారంగా అప్పటికే రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. టోక్యోలో జరిగిన 2025 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో 2.28 మీటర్ల కొత్త వ్యక్తిగత అత్యుత్తమ రికార్డును నెలకొల్పాడు. ఆ ప్రదర్శన అతనికి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో చారిత్రాత్మకమైన టాప్‌సిక్స్ స్థానాన్ని సంపాదించి పెట్టింది.

## జూన్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 7.3% వృద్ధి



**ముంబయి,జులై 28:** దేశ పారిశ్రామిక రంగం జూన్ నెలలో గణనీయమైన పురోగతిని నమోదు చేసింది. తయారీ రంగం, మూలధన వస్తువులు (క్యాపిటల్ గూడ్స్), మౌలిక సదుపాయాల ఉత్పత్తి బలంగా పెరగడంతో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ వార్షిక ప్రాతిపదికన 7.3 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది గత 23 నెలల్లో అత్యధిక వృద్ధి రేటు కావడం విశేషం.మే నెలలో సవరించిన గణాంకాల ప్రకారం నమోదైన 5.1 శాతం వృద్ధితో పోలిస్తే జూన్‌లో పారిశ్రామిక ఉత్పత్తి గణనీయంగా పుంజుకుంది. మార్కెట్ అంచనాలు 6 శాతం ఉండగా, వాటిని అధిగమిస్తూ 7.3 శాతం వృద్ధి నమోదైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ దేశీయ పారిశ్రామిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఐఐపిలో అత్యధిక వాటా కలిగిన తయారీ రంగం జూన్‌లో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసి మొత్తం పారిశ్రామిక ఉత్పత్తికి ప్రధాన బలంగా నిలిచింది. దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం, కీలక పరిశ్రమల్లో ఉత్పత్తి పెరగడం ఈ వృద్ధికి దోహదపడింది. విద్యుత్, గ్యాస్ ఉత్పత్తి 10.6 శాతం పెరిగింది. పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు ఇంధన అవసరాలు పెరగడడమే ఇందుకు కారణం. గనుల రంగం మాత్రం స్వల్పంగా 1 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసింది. క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 14.2 శాతం పెరిగి అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసింది. పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్య విస్తరణపై పరిశ్రమలు ఇప్పటికీ విశ్వాసంతో ముందుకు సాగుతున్నట్లు ఇది సూచిస్తోంది.మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగానికి సంబంధించిన వస్తువుల ఉత్పత్తి 7.5 శాతం పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలమౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగంగా కొనసాగుతున్నట్లు ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. వినియోగదారుల మన్నికైన వస్తువుల ఉత్పత్తి 7.7 శాతం పెరగడం ద్వారా గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై వినియోగదారుల డిమాండ్ బలంగా కొనసాగుతోందని స్పష్టమైంది. ఇక నీటి సరఫరా, అనుబంధ సేవలు కూడా జూన్ నెలలో 6.1 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

# ఐటిషేర్ల అండతో ఈక్విటీ నష్టాల కట్టడి



## స్వల్ప నష్టాలతోముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి,జులై 28:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం రోజంతా పరిమిత శ్రేణిలో ట్రేడింగ్ అనంతరం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఐటీ షేర్లలో నమోదైన బలమైన కొనుగోళ్లు మార్కెట్లకు మద్దతు ఇవ్వగా, ఎఫ్ఎంసిజీ, కెమికల్స్, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం సానుకూలంగా మారినా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన నిర్ణయానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బిఎస్‌ఇ సెన్సెక్స్ 69.86 పాయింట్లు తగ్గి 76,765.92 వద్ద ముగియగా, ఎన్ఎస్‌ఇ నిఫ్టీ 10.60 పాయింట్లు కోల్పోయి 23,985.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్ 7.11 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 1.94 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.65 శాతం క్షీణించి సూచీలను దిగజార్చాయి.విస్తృత మార్కెట్లలో మాత్రం మిశ్రమ ధోరణి కనిపించింది. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ స్వల్పంగా 0.01 శాతం పెరగగా, బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.47 శాతం తగ్గింది. మొత్తం ట్రేడైన షేర్లలో 1,528 షేర్లు లాభపడగా, 2,740 షేర్లు నష్టపోయాయి. 169 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఐటీ రంగంలో భారీ ర్యాలీమంగళవారం ట్రేడింగ్‌లో ఐటీ రంగం మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచింది. నిఫ్టీ ఐటీ సూచీ 3.32 శాతం ఎగసి 30,418.35 వద్ద ముగిసింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో ఈ సూచీ మొత్తం 6.61 శాతం లాభపడింది. ఐటీ కంపెనీల్లో కోఫోర్జ్ 10.16 శాతం ఎగిసి అగ్రస్థానంలో నిలవగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) 4.46 శాతం, ఎంఫాసిస్ 3.57 శాతం, టెక్ మహీంద్రా 3.49 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 3.22 శాతం, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ 2.82 శాతం, ఇన్ఫోసిస్ 2.39 శాతం, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ (ఒఎఫ్ఎస్ఎస్) 2.08 శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 1.93 శాతం, విప్రో 1.41 శాతం చొప్పున లాభపడ్డాయి. త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రభావంతో పలు కంపెనీల షేర్లలో భారీ ఒత్తిడి కనిపించింది. వరుణ్ బేవరేజెస్ త్రైమాసిక ఫలితాల అనంతరం 7.53 శాతం క్షీణించింది. హిందుస్థాన్ యూనిలీవర్ సమీకృత నికర లాభం ఏడాది ప్రాతిపదికన 3.01 శాతం తగ్గి రూ.2,673 కోట్లకు చేరడంతో షేరు 7.11 శాతం పడిపోయింది. ఇండోకో రెమెడీస్ తొలి త్రైమాసికంలో రూ.64.99 కోట్ల లాభం నమోదు చేసినప్పటికీ షేరు 7.72 శాతం క్షీణించింది. టాటా కెమికల్స్ త్రైమాసికంలో రూ.17 కోట్ల సమీకృత నికర నష్టం ప్రకటించడంతో షేరు 3.73 శాతం పడింది.తేజస్ నెట్‌వర్క్స్ రూ.202.24 కోట్ల నికర నష్టం నమోదు చేయడంతో 3.84 శాతం బలహీనపడింది. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ సమీకృత నికర లాభం 64.30 శాతం తగ్గి రూ.31.59 కోట్లకు చేరినా షేరు స్వల్పంగా 0.10 శాతం పెరిగింది.గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా నికర లాభం 44.3 శాతం తగ్గడంతో షేరు7.80 శాతం క్షీణించింది. ఔరియన్ ప్రో సొల్యూషన్స్ సమీకృత నికర లాభం 10.62 శాతం తగ్గడంతో 11.79 శాతం పతనమైంది.
ఇండస్ టవర్స్ 1.73 శాతం నష్టపోయింది.ఆర్ ఆర్ కేబుల్ 2.36 శాతం లాభపడింది.ఓం ఇన్‌ఫ్రా ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుకు అత్యల్ప బిడ్డర్‌గా ఎంపిక కావడంతో షేరు 4.78 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.93 డాలర్లు తగ్గి 86.43 డాలర్లకు చేరింది. దేశీయ విదేశీ మారక మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.8875 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.9900గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5,2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 1.17 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,41,395 వద్ద ట్రేడైంది.

## ఎయిరిండియా, ఎక్స్‌ప్రెస్‌ల నికర నష్టం రూ.22,238 కోట్లు



**ముంబయి,జులై 28:** టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లు 2026 ఆర్థిక సంవత్సరంలో భారీ నష్టాలను ప్రకటించాయి. ఈ రెండు సంస్థల సంయుక్త నికర నష్టం రూ. 22,238 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 10,859 కోట్ల నష్టంతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. ఇదే సమయంలో సంస్థల సంయుక్త ఆదాయం కూడా దాదాపు 9 శాతం తగ్గి రూ. 71,870 కోట్లకు పరిమితమైంది. ఎయిరిండియా రూ. 15,368 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేయగా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రూ. 6,767 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ప్రస్తుతం ఎయిరిండియాలో టాటా సన్స్‌కు 73.82 శాతం, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉంది. ఈ ఫలితాలపై వాటాదారులను ఉద్దేశించి ఎయిరిండియా ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ సంస్థ పునరుద్ధరణను ఒక దీర్ఘకాలిక ప్రక్రియగా చూడాలని సూచించారు. చరిత్రలో ఏ గొప్ప విమానయాన సంస్థ అయినా దశాబ్దాల కాలంలో నిర్మితమైందనీ, అంతేకానీ కొన్ని త్రైమాసికాల్లో కాదని ఆయన స్పష్టం చేశారు. సంస్థను కొనుగోలుచేసిననాటి పరిస్థితి, విడిభాగాల సరఫరాలో అంతరాయాలు, పాత వ్యవస్థల ఆధునికీకరణ వంటి సవాళ్లను అధిగమించేందుకు 5 నుంచి 10 యేళ్ల సమయం పడుతుందని వివరించారు. ఛైర్మన్ వ్యాఖ్యలను బట్టి చూస్తే, 2022లో ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన ఈ జాతీయ విమానయాన సంస్థను గాడిన పెట్టేందుకు టాటా గ్రూప్ తొలుత అంచనావేసిన దానికంటే ఎక్కువసమయం, పెట్టుబడులు అవసరమవుతాయని స్పష్టమవుతోంది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆరు పాత ఎయిర్‌బస్ ఏ319 విమానాలను విక్రయించేందుకు ఎయిరిండియా ఇటీవలే యూకేకు చెందిన స్కైటెక్ ఎవిసి సంస్థను నియమించుకుంది.

## ఇండిగో సిఇఒగా విల్లీ వాల్ష్‌కు కేంద్రం ఓకే



**న్యూఢిల్లీ,జులై 28:** దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో కొత్త సిఇఒగా విల్లీ వాల్ష్ నియామకానికి కేంద్ర ప్రభుత్వం మంగళవారం భద్రతా అనుమతి మంజూరు చేసింది. అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం డైరెక్టర్ జనరల్‌గా ఆయన పదవీకాలం ఈనెల 31తో ముగియనుండగా, ఆగస్టు 3లోగా ఇండిగోలో చేరనున్నట్లు సమాచారం. మార్చిలో అప్పటి సిఇఒ పీటర్‌ఎల్బర్స్ ఆకస్మికంగా వైదొలిగిన తర్వాత సంస్థ కొత్త నాయకత్వం కోసం ఎదురు చూస్తోంది. సిఇఒగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇండిగో కార్యకలాపాల నిర్వహణతో పాటు సంస్థ దీర్ఘకాలిక వ్యూహాల రూపకల్పనలో విల్లీ వాల్ష్ కీలక పాత్ర పోషించనున్నారు. విలియం విల్లీ వాల్ష్ 1961 అక్టోబర్ 25న ఐర్లాండ్‌రాజధాని డబ్లిన్‌లో జన్మించారు.1979లో ఐరిష్ విమానయాన సంస్థ ఏర్ లింగస్‌లో క్యాడెట్ పైలట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బోయింగ్737 విమాన కెప్టెన్‌గా పనిచేస్తూనే ట్రినిటీ కాలేజ్ డబ్లిన్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రే షన్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు.1990ల చివర్లో నిర్వహణ విభాగంలోకి అడుగుపెట్టిన ఆయన, 2000లో ఏర్ లింగస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా, 2001లో సిఇఒగా నియమితులయ్యారు. 2005లో బ్రిటిష్ ఎయిర్‌వేస్ సిఇఒగా బాధ్యతలు స్వీకరించిన విల్లీ వాల్ష్ సంస్థను సమర్థంగానడిపించారు. 2011లో బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఐబీరియా విలీనానికి ఆయన నాయకత్వం వహించారు. 2021 ఏప్రిల్ నుంచి అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం ఎనిమిదో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న విల్లీ వాల్ష్, విమాన భద్రత, నియంత్రణ విధానాలు, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమ వ్యయ నియంత్రణ వంటి అంశాల్లో ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థలకు ప్రాతినిధ్యం వహించారు.
2005 నుంచి 2018వరకు ఐఎటిఎ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో సభ్యుడిగా, ఒక దశలో ఛైర్మన్‌గా కూడా సేవలందించారు. భారతీయ దేశీయ విమానయాన మార్కెట్లో సుమారు 64 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో అగ్రస్థానంలో ఉంది. సంస్థ రోజుకు 2,200కు పైగా విమాన సర్వీసులు నిర్వహిస్తూ 95 దేశీయ, 40కిపైగా అంతర్జాతీయ గమ్యస్థానాలకు సేవలు అందిస్తోంది. సుమారు 440 విమానాల ఫ్లీట్‌ను నిర్వహిస్తున్న ఇండిగో, అంతర్జాతీయ విస్తరణపై దృష్టి సారించిన నేపథ్యంలో విల్లీ వాల్ష్‌కు ఉన్న ప్రపంచ స్థాయి నిర్వహణ అనుభవం సంస్థ తదుపరి వృద్ధి దశకు బలాన్నిస్తుందని విమానయాన రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అంచనాలను మించిన ఎల్ అండ్ టి నికరలాభం

**ముంబయి,జులై 28:** ఇంజినీరింగ్, నిర్మాణ రంగ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్‌అండ్‌టి) 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14 శాతం పెరిగి రూ.4,123 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.3,617 కోట్లు. మార్కెట్ విశ్లేషకులు రూ.3,985 కోట్ల లాభాన్ని అంచనా వేయగా, కంపెనీ ఆ అంచనాలను అధిగమించింది. కంపెనీ మొత్తం ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.67,942 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.63,679 కోట్లు. మార్కెట్ నిపుణులు రూ.67,545 కోట్ల ఆదాయాన్ని అంచనా వేయగా, ఎల్‌అండ్‌టీ ఆ అంచనాలను కూడా మించింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, అమార్టైజేషన్‌కు ముందు లాభం అంటే ఎబిడిటా మాత్రం 3.2 శాతం తగ్గి రూ.6,117 కోట్లకు పరిమితమైంది. గత యేడాది ఇదే కాలంలో ఎబిడిటా రూ.6,318 కోట్లు కాగా, విశ్లేషకుల అంచనా రూ.6,535 కోట్లు. దీంతో కంపెనీ నిర్వహణ లాభదాయకతపై కొంత ఒత్తిడి కనిపించింది.కంపెనీ ఎబిడిటా మార్జిన్ కూడా గత యేడాది 9.9 శాతం నుంచి 9 శాతానికి పడిపోయింది. ఇది 90 బేసిస్ పాయింట్ల క్షీణతగా నమోదైంది. మార్కెట్ అంచనా 9.7 శాతం కాగా, వాస్తవ ఫలితం దానికంటే తక్కువగా ఉంది. ఆర్థిక ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్ఇలో ఎల్‌అండ్‌టి షేరు ధర 0.63 శాతం పెరిగి రూ.3,830 వద్ద ముగిసింది. అదే సమయంలో ప్రామాణిక సూచీ నిఫ్టీ స్వల్ప నష్టంతో ముగిసింది. దీంతో కంపెనీ ఫలితాలపై పెట్టుబడిదారులు సానుకూలంగా స్పందించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.